అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 21-3 -2018

సంపుటి : 4 సంచిక : 82 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 14 + 16 పేజీలు వెల : 5.00

ఆశీర్వాద బలమే...

నవతెలంగాణ మూడేండ్ల పసిబిడ్డ.ఈ రోజు నాలుగవ ఏట అడుగుపెట్టింది. పాఠకుల ఆదరాభిమానాలే తల్లిప్రేమనందించాయి. ఆ ప్రజల ఒడిలో, ఆ ప్రజల కోసమే, ప్రజల గొంతుకగా పని చేస్తున్న పత్రిక. నిజాలను నిలువెత్తు సాక్ష్యాలతో నిగ్గుతేల్చి ప్రజల ముందుంచుతున్న ప్రజల పత్రిక. విశ్వ మానవుల వేదనలకు వేదిక. పోరాటాలకు బాసట. తెలంగాణ ప్రజల హృదయ స్పందన. కష్టజీవుల గొంతుక. రైతు బాంధవుల ఆత్మ బంధువు. బహుజనుల బంధువు. ఒడిదుడుకులను తట్టుకొని తప్పటడుగుల దశను దాటి మునుముందుకే సాగుతున్నది. శ్రమదోపిడీనీ, సామాజిక అణచివేతను ప్రశ్నిస్తున్న ప్రజల పుత్రిక. ప్రజా సమస్యలనూ, మహిళల హక్కులనూ ఎలుగెత్తి చాటుతూ, బడుగు బలహీన వర్గాల, సామాజిక తరగతుల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిందీ మూడేండ్ల కాలంలో. ఇది వివక్షను దునుమాడే అక్షర సమాహారం. కలం యోధుల కార్యక్షేత్రం. చివరి పేజీల్లో చిన్న వార్తలుగా మారిన రైతుల ఉరితాళ్లు నవ తెలంగాణలో మొదటి పేజీలో దర్శనమిస్తాయి. సభ్య సమాజం చెవినజేరని కుల వివక్ష, కుల దురహంకార వార్తలతో పాఠకుల ముంగిట నిలుస్తున్నది. పురుషాధిక్యత సమస్యలూ, మహిళల మీద లైంగిక దాడులే కాదు.. మహిళల సాధికారతను ఎలుగెత్తి చాటుతున్న దినపత్రిక. మైనారిటీల భద్రతకు, మత సామరస్యానికీ, సమభావనకూ, సమైక్యతా భావానికీ వేదికైంది. నేరెళ్ల బాధితుల నిలువుటద్దం ఇది. వేములవాడలో పోలీస్ చిత్రహింసలతో మరణించిన ఎంబీసీ యువకుడి గాథ, పసిబిడ్డలతో బజారుపాలైన ఆ పేద కుటుంబం స్థితిగతులను వెలికితీసి సభ్య సమాజం ముందుంచిన ఏకైక పత్రిక. ఖాకీవనంలోనే వ్యవస్థీకృతమైన అవినీతి భూతానికి బలైన యువ పోలీసుల వాస్తవ కథనాలు ప్రజలముందుంచిన తెలుగు దిన పత్రిక. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో తెలంగాణ గ్రామాలనావహించిన ఆధిపత్య శక్తుల అక్రమాలను, బలహీన వర్గాలపైన గ్రామ బహిష్కరణలూ, వెలివేతలను ఎండగట్టిన పత్రిక. ప్రశ్నించే గొంతుకలకు అండదండగా నిలిచిన వార్తా పత్రిక. నయీం నేర సామ్రాజ్యంలో కనిపించని కోణాలు, పాలకుల కుప్పిగంతులు వెల్లడించింది. మల్లన్నసాగర్ రైతుల హృదయ ఘోష వినిపించింది. వెన్నుతట్టి కదిలించింది. వారి పోరాట పాలికైంది. రోహిత్ వేముల ఆత్మహత్య వెనుక వాస్తవాలు వెలికితీసింది. వెలివాడ గుట్టురట్టు చేసింది. పాలకుల విధానాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తున్నది. ప్రజల కోణంలో పరిశీలిస్తున్నది. ప్రజల సమస్యలు పాలకుల దృష్టి దాటిపోకుండా చూస్తున్న అక్షర క్షేత్రం, ప్రజల కోసం ప్రయోగిస్తున్న అక్షరాయుధం. అయినా ఇది కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది. నిప్పులాంటి నిజాలను తట్టి లేపుతున్నందుకే తిప్పలు కూడా తప్పడంలేదు. అవినీతిపరుల బెదిరింపులు, అవకాశవాదుల బ్లాక్‌మెయిలింగ్‌లు, ఆగ్రహాలు, సహాయ నిరాకరణలూ నిత్యకృత్యమైనాయి. ఆర్థిక ఇబ్బందులు వెన్నాడుతున్నాయి. అయినా ఇవన్నీ నవతెలంగాణకు అభినందన సుమాలే సుమా! తప్పులు చేసేవారు పత్రికను మెచ్చుకుంటే.. అది ఈటెలాగా గుండెల్లో గుచ్చుకుంటుంది. ఆగ్రహం ప్రదర్శిస్తే.. అది తప్పకుండా అభినందన మందారమాల. ప్రజల, శ్రేయోభిలాషుల ఆశీర్వాద బలమే నవతెలంగాణను నిలబెడుతున్నది. పత్రికారంగంలో ప్రబలుతున్న పెడధోరణులు కూడా ఒక సమస్యే. అవలక్షణాల మధ్య పనిచేస్తూనే అంటకుండా చూసుకోవటం ఒక పరీక్ష. పత్రికలు ప్రజలను భ్రమల్లో ముంచాలనీ, జోకొట్టాలనీ లేదా తప్పుదారి పట్టించాలనీ కొందరి కోరిక. ప్రజలను చైతన్యపరచడం, కదిలించటం, కదనరంగంలోకి ఉరికించటమే లక్ష్యంగా పని చేస్తోంది ఈ పత్రిక. పరుల కోరికలు తీర్చడం కాదు.. ప్రజల కోరిక మన్నించటమే బాధ్యతగా భావిస్తున్నది. ప్రజా క్షేత్రంలో వెలుగు దివ్వెగా నిలుస్తున్నది. ఎదురీదుతున్న పత్రికను నిలబెడుతున్నది పాఠకుల ఆదరణా, సిబ్బంది నిబద్ధత, శ్రేయోభిలాషుల ఆశీర్వాదాలే. సొంతలాభం కొంత మానుకొని జనం కోసం కలం పట్టిన పాత్రికేయ బృందమే ఈ పత్రిక వెన్నెముక. పాఠకులకూ, మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ, ప్రకటన కర్తలకూ, కష్టనష్టాలకోర్చి పట్టుదలతో పని చేస్తున్న సిబ్బందికీ అందరికీ వందనాలు.

ఎస్. వీరయ్య

సంపాదకీయం

కాకులను కొట్టి..

దళితులు, బలహీనవర్గాల భూమికి సర్కార్ ఎసరు

- అసైన్‌మెంట్ భూమి కొనుగోలు చేసిన వారికే క్రమబద్ధీకరణ
- రాష్ట్ర సర్కార్ మరో వివాదాస్పద నిర్ణయం

దళితులు, గిరిజనులు బలహీనవర్గాల పొట్టకొట్టే మరో వివాదాస్పద నిర్ణయాన్ని రాష్ట్ర సర్కార్ తీసుకుంటున్నది. అసైన్‌మెంట్ భూమిని కొనుగోలు చేసినవారి పేరుతో ఆ భూమిని క్రమబద్ధీకరించేందుకు చట్టాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నది. భూమిలేని నిరుపేద దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమిని ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చక పోగా గతంలో కేటాయించిన భూమిని కూడా వారికి దక్కకుండా చేయటం వెనుక భూమాఫియా, రియల్టర్ల హస్తం ఉన్నట్టు తెలుస్తున్నది.



వివరాలు 9లో

ఉద్యోగాల కోసం రైల్‌రోకో

- స్తంభించిన ముంబయి లోకల్ రైలు రాకపోకలు
- అప్రెంటీస్ పూర్తిచేసి ఏండ్లైనా ఉద్యోగాల్లేవ్..



వివరాలు 9లో

ఇరాక్‌లో భారతీయుల కిడ్నాప్ విషాదాంతం

- 39 మంది అపహరణ, హత్య
- నాలుగేండ్ల క్రితం బందీలుగా చేసుకున్న ఐఎస్ : రాజ్యసభలో సుష్మాస్వరాజ్ వెల్లడి

వివరాలు 2లో



రోదిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

పది వరకే తెలుగు తప్పనిసరి

- ఇంటర్‌లో అమలుకు పలు ఇబ్బందులు
- ఈ అసెంబ్లీలోనే చట్టం తెస్తాం : ముఖ్యమంత్రి కేసీఆర్
- తమిళనాడులో పర్యటించిన అధికారులతో భేటీ

వివరాలు 9లో

ఎంబీసీ నిధులు క్యారీఫార్వర్డ్ చేయండి..



అసెంబ్లీలో సున్నం రాజయ్య డిమాండ్

- బీసీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి
- ఈటల సమాధానంపై అసంతృప్తి
- సభ నుంచి సీపీఐ(ఎం),టీడీపీ, బీజేపీ వాకౌట్

వివరాలు 11లో

భూములకు పట్టా హక్కు కల్పించాలి

- భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట అన్నదాతల ధర్నా


వివరాలు 9లో



మరొక పెరియార్ విగ్రహం ధ్వంసం



చెన్నై: త్రిపురలో లెనిన్ విగ్రహంతో మొదలైన విధ్వంస దుశ్చర్యలు దేశంలో ఇంకా తగ్గటం లేదు. తాజాగా ప్రముఖ ద్రవిడ నాయకుడు ఇ.వి రామస్వామి(పెరియార్) విగ్రహాన్ని తమిళనాడులో గుర్తు తెలియని కొందరు దుండగుల ధ్వంసం చేశారు. విగ్రహం నుంచి తలను వేరు చేశారు. ఈ ఘటన పుదుకొట్టాయ్ జిల్లాలోని అలంగుడిలో మంగళవారం చోటుచేసుకున్నది. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగుల పై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మోహరించారు. వీహెచ్‌పీ చేపట్టిన రామరాజ్య రథయాత్ర రాష్ట్రంలోకి చేరిన రోజే పెరియార్ విగ్రహం ధ్వంసం కావడం గమనార్హం. పెరియార్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగుల దాడికి పాల్పడటం ఇది నాలుగోసారి. బీజేపీకి చెందిన సీనియర్ నేత హెచ్ రాజా సామాజిక మాధ్యమంలో చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల అనంతరం ఈ నెల 6న వెల్లూరులోని మున్సిపల్ కార్యాలయంలో పెరియార్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, విగ్రహ విధ్వంస ఘటనను ప్రముఖ నటుడు రజనీ కాంత్ తీవ్రంగా ఖండించారు. అలాగే దాడి వెనుక బీజేపీ హస్తం ఉందన్న ఆరోపణల్ని ఆయన తోసిపుచ్చారు.



జేఎన్‌యూలో ప్రొఫెసర్ అరెస్ట్.. విడుదల

న్యూఢిల్లీ: విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన జేఎన్‌యూ ప్రొఫెసర్ అతుల్ జోహ్రీని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం జోహ్రీని మంగళవారం ఉదయం అదుపులోకి తీసు కున్న పోలీసులు కొద్దిసేపటి తర్వాత అతడిని అరెస్టు చేసినట్టుగా ప్రకటిం చారు. ఈ విషయాన్ని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అజయ్ చౌదరి నిర్ధారించారు. కాగా, అరెస్టయిన కొద్దిసేపటికి ఢిల్లీ హైకోర్టు జోహ్రీకి బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. అరెస్టు విష యంలో పోలీసుల జాప్యాన్ని నిరసిస్తూ అతడిని తక్షణం అదుపులోకి తీసుకోవా లంటూ ఢిల్లీలోని వసంత్‌కుంజ్ పోలీస్ స్టేషన్ ఎదుట జేఎన్ యూ విద్యా ర్థులు, ప్రొఫెసర్‌లు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు సోమవారం పెద్ద ఎత్తున నిరసనకు దిగిన విషయం తెలిసిందే. భారీ సంఖ్యలో విద్యార్థులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తమపై జోహ్రీ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ తొమ్మిది మంది విద్యార్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ప్రొఫెసర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం విచారణకు హాజరవ్వాలని నోటీసులు జారీ చేశారు.

శశికళ భర్త నటరాజన్ మృతి



చెన్నై: కొంతకాలంగా అనారోగ్యానికి గురైన ఏఐఏడీఎంకే నాయకురాలు వి.కె. శశికళ భర్త నటరాజన్(76) చెన్నైలో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా ఛాతి సంబంధిత వ్యాధితో బాధప డుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఛాతిలో తీవ్ర నొప్పి రావడంతో ఆయనను చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. భర్త మరణ వార్త తెలియగానే బెంగళూరు పరప్పన్ అగ్రహారా జైలులో ఉన్న శశికళ.. పెరోల్‌పై విడుదలకు దరఖాస్తు చేసుకోగా అధికారులు 15 రోజులు మంజూరు చేశారు. దీంతో జైలు నుంచి విడుదలైన ఆమె నేరుగా చెన్నైకి వెళ్ళారు.

ఆర్టీఐ కార్యకర్త హత్య



షిల్లాంగ్: సామాజిక కార్యకర్త, సమాచార హక్కు (ఆర్‌టీఐ) ప్రచారకుడు మేఘాలయ రాష్ట్రానికి చెందిన పొయ్‌ఫైన్‌హున్ మజ హత్యకు గురయ్యారు. ఈ ఘటన మేఘాలయలోని ఖిలెహ్రియెట్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకున్నది. జైన్షియా యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు అయిన మజ మృతదేహం ఈస్ట్ జైన్షియా హిల్స్ జిల్లా కేంద్రమైన ఖిలెహ్రియెట్‌లోని ఒక బ్రిడ్జి వద్ద లభ్యమైంది. తలకు బలమైన గాయం కావడం వల్లే ఆయన మరణించారని డీఐజీ ఎఆర్ మాథోహ్ తెలిపారు. ఆయన హత్యకు దారి తీసిన పరిస్థితులను మాత్రం పోలీసులు వెల్లడించలేదు. కాగా, జైన్షియా హిల్స్ జిల్లా కౌన్సిల్‌లోని ప్రజాధనం దుర్వినియోగం కావడం పై ఆయన ఆర్‌టీఐలో ఇటీవలే దరఖాస్తు చేశారు. ఆర్టీఐ కార్యకర్త, పౌర సమాజ మహిళా సంఘం అధ్యక్షురాలు ఆగ్నస్ ఖార్షింగ్ హత్యను తీవ్రంగా ఖండించారు.

ఇరాక్‌లో భారతీయుల కిడ్నాప్ విషాదాంతం

అపహరణకు గురైన 39 మంది హత్య

- నాలుగేండ్ల క్రితం బందీలుగా చేసుకున్న ఐఎస్ : రాజ్యసభలో విదేశాంగ మంత్రి సుష్మా వెల్లడి



న్యూఢిల్లీ: ఇరాక్‌లో నాలుగేండ్ల క్రితం అపహరణకు గురైన 39 మంది భారతీయులు హత్య గావించబడినట్టు కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్.. రాజ్యసభలో మంగళవారం ప్రకటించారు. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, బీహార్, బెంగాల్‌కు చెందిన పలువురు ఉపాధి కోసం ఇరాక్ వెళ్లారు. కాగా.. వీరిలో 40 మందిని ఇరాక్‌లోని మోసుల్‌లో 2014 జూన్‌లో ఐఎస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. 2015లో ఉగ్రవాదుల చెర నుంచి హర్జిత్ మాసీ అనే భారతీయుడు చాకచక్యంతో తప్పించుకున్నాడు. తనతో పాటు కిడ్నాపైన 39 మంది ఓ ఎడారి ప్రాంతంలో హత్యకు గురయ్యారని హర్జిత్ చెప్పినా ప్రభుత్వం పట్టించుకోకుండా.. ఆధారాలుంటేనే ధ్రువీకరిస్తామని చెప్పింది. ఇదిలా ఉంటే.. మోసుల్ నగరంలోని ఓ చోట వందల సంఖ్యలో సామూహిక సమాధులను భారతీయ, ఇరాకీ అధికారుల బృందం గుర్తించినట్టు సుష్మ తెలిపారు. సమాధుల్లో నుంచి మృతదేహాలను వెలికితీసి డీఎన్ఏ పరీక్షల నిమిత్తం బాగ్దాద్‌కు తరలించారన్నారు. అనంతరం తప్పిపోయిన వారి బంధువుల డీఎన్ఏ నమూనాలను కూడా బాగ్దాద్‌కు పంపించినట్టు వివరించారు.

పరీక్షల్లో బంధువుల డీఎన్ఏతో 38 మృతదేహాల డీఎన్ఏ పూర్తిగా సరిపోయిందని ఇరాక్ అధికారులు సోమవారం సమాచారం పంపినట్టు ఆమె వెల్లడించారు. మరొకరి డీఎన్ఏ 70 శాతం సరిపోయినట్టు చెప్పారు. భౌతికకాయాలను దేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి వికె సింగ్.. ప్రత్యేక విమానంలో ఇరాక్ వెళ్తారని తెలిపారు.

కుటుంబాలకు చెప్పకుండా పార్లమెంటులో ప్రకటిస్తారా? : కేంద్రంపై సీపీఐ(ఎం) విమర్శ

ఇరాక్‌లో భారతీయుల మృతి విషయాన్ని వారి కుటుంబాలకు ముందుగా తెలియజేయకుండా పార్లమెంటులో ప్రకటించడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా తప్పుబట్టింది. మోడీ సర్కారు అమానుషంగా ప్రవర్తిస్తోందనడానికి ఇదే నిదర్శనమని ఆ పార్టీ ఎంపీ మహమ్మద్ సలీం అన్నారు. అపహరణకు గురైన వారి కుటుంబీకులతో నిత్యం టచ్‌లో ఉంటున్నామని చెబుతున్న కేంద్రం.. ముందుగా పార్లమెంటులో ప్రకటన ఎందుకు చేసిందని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలను పార్లమెంటు వెలుపల(సమావేశాలు నడుస్తోన్నా) వెల్లడిస్తుండగా.. భారతీయుల మృతి విషయాన్ని వారి కుటుంబాలకు తెలియజేస్తే ఇబ్బందులు ఏముంటాయని కేంద్రాన్ని నిలదీశారు.

భారతీయుల ఉద్యోగాలకు చేటు చేసే అమెరికా చట్టం

వాషింగ్టన్: అమెరికాలోని ట్రంప్ సర్కారు తాజాగా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన బిల్లు అక్కడి భారతీయుల కాల్ సెంటర్ ఉద్యోగాలకు చేటు చేయనున్నదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ బిల్లు ప్రకారం విదేశాలకు చెందిన కాల్ సెంటర్ ఉద్యోగులు తమ ప్రాంతాన్ని తెలియచేయాల్సి వుంటుంది. దీనితో పాటు తమ కాల్‌ను అమెరికాలోని ఓ సర్వీస్ ఏజెంట్‌కు బదిలీ చేయమని కోరే హక్కు వారి వినియోగదారులకు లభిస్తుంది. ఓహియోకు చెందిన సెనేటర్ షెర్రాడ బ్రౌన్ ప్రవేశపెట్టి ఈ బిల్లు కాల్ సెంటర్ ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ ఇచ్చిన సంస్థల జాబితాను ప్రభుత్వానికి సమర్పించాలని, ఇతర దేశాలకు ఉద్యోగాలివ్వకుండా అమెరికన్‌లకు ప్రాధాన్యతనిచ్చే ఫెడరల్ కాంట్రాక్ట్‌లకు ప్రాధాన్యతనివ్వాలని ప్రతిపాదించారు. దీర్ఘకాలంగా అమెరికా వాణిజ్య, పన్నుల విధానం దేశీయ వ్యాపారానికి గండి కొడుతూ అమెరికన్లకు రావాల్సిన ఉద్యోగాలను పన్ను క్రెడిట్‌ల రూపంలో అమ్ముకుంటున్నారని, ఉత్పత్తులను రెనోసా, మెక్సికో, వుహాన్, చైనా వంటి దేశాలకు తరలిస్తున్నారని బిల్లు ప్రవేశపెట్టిన బ్రౌన్ విమర్శించారు. ఔట్‌సోర్సింగ్ విధానం అమెరికన్ ఉద్యోగుల మెడపై కత్తిలా వేలాడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనికేషన్ వర్కర్స్ ఆఫ్ అమెరికా అనే కమ్యూనికేషన్, మీడియా కార్మిక సంఘం నిర్వహించిన అధ్యయనం ప్రకారం అమెరికన్ సంస్థలు తమ ఉద్యోగాలను ఎక్కువగా భారత్, ఫిలిప్పైన్స్‌లకు ఔట్‌సోర్సింగ్ చేస్తున్నాయని వెల్లడయినట్లు తెలిపింది. అమెరికన్ కంపెనీలు ఈజిప్ట్, సౌదీ అరేబియా, చైనా, మెక్సికో వంటి దేశాలలో కూడా కాల్ సెంటర్లు ప్రారంభించినట్లు ఈ అధ్యయనంలో వెల్లడయింది.

ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సత్వర అరెస్టులొద్దు

- భారత సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీలపై దురాగతాల నిరోధక చట్టం–1989 దుర్వినియోగం కాకుండా ఉండేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ చట్టం కింద తప్పుడు ఆరోపణలతో అమాయకులను ఇరికించడం, అనవసరంగా అరెస్టులు చేయడం తగదని అభిప్రాయపడింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదయితే నిందితులను వెంటనే అరెస్టు చేయడం తప్పనిసరి కాదని న్యాయమూర్తులు ఆదర్శ్ గోయల్, యుయు లలిత్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. ఈ చట్టం కింద ప్రభుత్వ అధికారిపై ఫిర్యాదులు వస్తే.. ముందుగా డీఎస్పీ, ఆపై ర్యాంకు అధికారి నేతృత్వంలో ప్రాథమిక విచారణ చేసి, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అర్హత ఉందో లేదో తేల్చాలని వెల్లడించింది. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదైనా నిందితులను వెంటనే అరెస్టు చేయడం తప్పనిసరి కాదని తెలిపింది. ప్రభుత్వోద్యోగిని అరెస్టు చేయాలంటే సంబంధిత నియామక అధికారి అనుమతి తప్పక తీసుకోవాలని తెలిపింది. నిందితుడు ప్రభుత్వ ఉద్యోగి కానట్లయితే.. అతడిని అరెస్టు చేయడానికి సీనియర్ ఎస్పీ అనుమతి తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయడానికి గల కారణాలు, అనుమతుల వివరాలను నిందితుడికి, అతడిని హాజరుపర్చబోయే న్యాయస్థానానికి తెలియజేయాలని సూచించింది.

ముందస్తు బెయిల్‌పై నిషేధం లేదు

మరోవైపు అట్రాసిటీ కేసు నమోదయితే నిందితులు ముందస్తు బెయిల్ పొందడంపై ఎలాంటి నిషేధమూ లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. తన మీద తప్పుడు ఆరోపణలు చేసినట్టు నిందితుడు నిరూపించిన ఎడల ముందస్తు బెయిల్ పొందేందుకు అర్హుడేనని తేల్చి చెప్పింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో సుభాశ్ కాశీనాథ్ మహజన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. సుభాశ్ కాశీనాథ్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేందుకు ముంబయి హైకోర్టు నిరాకరించడంతో.. దానిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

రూ.1000 నోటు రద్దు

శిశుహత్యతో సమానం : యశ్వంత్‌సిన్హా

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రూ.1000 కరెన్సీ నోటును రద్దు తన సంతానం హత్యకు గురైనంత బాధ కలిగించిందని మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ రచించిన "డీమానిటైజేషన్ అండ్ ద బ్లాక్ మనీ" అనే గ్రంథాన్ని మంగళవారం ఇక్కడ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యశ్వంత్ మాట్లాడుతూ భారతదేశంలో పెద్ద నోట్ల రద్దు ప్రభావంపై సమగ్రంగా వచ్చిన తొలి పుస్తకం ఇదేనన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి నవంబరు 8, 2016న పెద్ద నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం నల్లధనాన్ని వెనక్కి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఏ మాత్రం నెరవేర్చలేక పోయిందని తీవ్రంగా విమర్శించారు.

వీసీ.. వర్సిటీ సంస్కృతిని దెబ్బతీస్తున్నారు

జేఎన్‌యూ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆందోళనకు మాజీ ప్రొఫెసర్ల మద్దతు

- జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి



న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) పాలనా యంత్రాంగానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మాజీ అధ్యాపకులు మద్దతు తెలిపారు. విశ్వవి ద్యాలయ 'ప్రవర్తనా నియమావళిని' మార్చేయాలని వైస్ చాన్సలర్ ఎం. జగదీశ్ కుమార్ ప్రయత్నిస్తున్నారనీ, ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలకు అందరూ విధేయులై ఉండాలని భావిస్తున్నారని వారు విమర్శించారు. ఈ మేరకు 18 మంది మాజీ ప్రొఫెసర్లు, రెక్టార్ల సంతకాలతో కూడిన ఒక ప్రకటనను మంగళవారం విడుదల చేశారు. 'జేఎన్‌యూలో ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడేందుకు అధ్యాపకులు, విద్యార్థులు చేస్తున్న ప్రస్తుత ఆందోళనకు మేం మద్దతు తెలుపుతున్నాం' అని పేర్కొన్నారు. సంస్థను నాశనం చేయ కుండా వైస్ ఛాన్సలర్ కుమార్‌ను అడ్డుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వారు విజ్ఞప్తి చేశారు. లైంగిక వేధిం పుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయాలనీ, తప్పనిసరి హాజరు విధానానికి వ్యతిరేకంగా, విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపిన డిపార్టుమెంట్ హెడ్స్ తొలగింపు వంటి పలు సమస్యలపై క్యాంపస్ లోపల, వెలుపల వారు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. రిజర్వే షన్లు తగ్గించడం, అధ్యాపక పదవుల్లో రాజకీయ నియామ కాలు, మెస్ ఫీజుల పెంపు, వర్సిటీ విద్యార్థులకు షోకాజ్ నోటీసులు, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు తదితర సమస్యలపై కూడా విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమా లను చేపట్టారు.

'జేఎన్‌యూ ప్రారంభ మైన నాటి నుంచి మూడు ప్రధాన భాగాలైన విద్యార్థులు, అధ్యాపకులు, పాలనా యంత్రాంగం మధ్య పరస్పర సహకారంతో ప్రజాస్వామ్య ధోరణితో సాగుతున్నది' అని ప్రకటన పేర్కొంది. 'అప్పుడప్పుడూ ఏర్పడిన ఘర్షణలను ప్రజాస్వామ్యయుతంగా పరిష్కరించ బడ్డాయి' అని మాజీ ప్రొఫెసర్లు తెలిపారు. వివిధ అకాడమిక్ సంస్థల్లో సరైన చర్చ లేకుండానే తప్పనిసరి అటెండెన్స్ నిర్ణయం, డీన్స్, చైర్‌పర్సన్ల నియామకం, డిపార్టుమెంట్ హెడ్‌లను తొలగిస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వంటివి వివాదాస్పద నిర్ణయాలేనని వారు తెలిపారు.

సిరియాలోని పాఠశాలపై వైమానిక దాడి : 15 మంది మృతి



డమాస్కస్ : సిరియాలో గౌటా నగరంలోని ఓ పాఠశాలపై వైమానిక దాడి జరిగింది. ఈ ఘటనలో 15 మంది విద్యార్థులు మృతి చెందా రు.మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న ఆఫ్రిన్ నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా బలగాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సిరియా సైన్యానికి, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న భీకర పోరులో 1400 మంది మృతి చెందారు. వేలాది మంది ప్రాణ భయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. సిరి యాలోని హక్కు ల పర్యవేక్షణ సంస్థ తెలిపిన వివరాల ప్ర కారం... ఆర్ఫిన్ నగరంలోని మూడు పాఠశాలలపై వైమా నిక దాడి జరిగింది. ఈ మూడు దాడుల్లో 20 మంది మృతిచెం దగా, 50 మంది గాయపడ్డారు. కాగా, సిరియాలో 2011 లో అంత ర్యుద్ధం ప్రారం భమైంది. ఈ యుద్ధంలో 3,50, 000 మంది చని పోయారు. 11 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు.



అమెరికాలో ప్రవాస భారతీయుల నిరసనలు



వాషింగ్టన్: అమెరికాలోని ప్రవాస భారతీయులు ఆందోళన బాటపట్టారు. మంగళవారం వాషింగ్టన్ నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో వేలాది మంది భారతీయ ఉద్యోగులు, నిపుణులు పాల్గొన్నారు. అమెరికా పౌరసత్వమైన గ్రీన్‌కార్డుల జారీకి బాగా జాప్యం జరుగుతోందని, వీటి జారీకి దేశాల వారీ పరిమితి ఎత్తేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమెరికాలో ఉంటున్న భారత సంతతి వ్యక్తులు చాలా మంది గ్రీన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుని వేచి చూస్తున్నారు. దేశాల వారీ కోటా వల్ల పెద్ద ఎత్తున వీరి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా హెచ్1–బీ వీసాలపై అమెరికా వెళ్లి గ్రీన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి నష్టం కలుగుతోందని, సంవత్సరాల తరబడి గ్రీన్‌కార్డుల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

దేశాల వారీ కోటాను ఎత్తేయాలని అక్కడి భారతీయులు ఆయా ప్రాంతాల్లోని ఎంపీల మద్దతు కోరుతూ ర్యాలీలు చేశారు. ముఖ్యంగా అర్కాన్సాస్, కెంటుస్కీ, ఓరెగావ్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. దేశాల వారీ కోటా వల్ల ప్రవాస భారతీయులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయంపై అమెరికన్లకు, ఎంపీలకు అవగాహన కల్పించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్టు ర్యాలీ నిర్వహకులు తెలిపారు. ఎప్పుడో లిండన్ జాన్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ నిబంధనను పెట్టారని, ఈ కాలానికి ఇది ఏమాత్రం సరిపోదని అభిప్రాయపడ్డారు.

లిండన్ జాన్సన్ 1963 నుంచి 1969వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. కెంటుస్కీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ర్యాలీలో దాదాపు 300మంది గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న భారతీయ నిపుణులు పాల్గొన్నారు.

'సూడాన్' అస్తమయం



జుబా : ప్రపంచంలో చిట్టచివరగా మిగిలిన మగ తెల్ల ఖడ్గ మృగం 'సూడాన్' కన్నుమూసింది. 45 ఏండ్ల వయసున్న ఈ అరుదైన జీవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం ఉదయం సూడాన్ మృతి చెందినట్టు ఓఎల్ పెజెటా పార్క్ నిర్వాహకులు ప్రకటించారు.


వేటగాళ్ల బారి నుంచి కంటికి రెప్పలా కాపాడుకోవడానికి మూడేండ్ల నుంచి సూడాన్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. దీని పరిరక్షణ కోసం కెన్యా ప్రభుత్వం ఇప్పటిదాకా కోట్లలో ఖర్చు చేసి మరీ భద్రతను ఏర్పాటు చేయించింది. వీవీఐపీ వైట్‌రైనోగా ఇది బాగా పాపులర్ అయ్యింది.ప్రపంచంలో అంతరించి పోతున్న జంతువులలో తెల్ల ఖడ్గ మృగాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటిదాకా మిగిలినవి మూడు మాత్రమే. అందులో సూడాన్ ఒకటి కాగా.. మిగిలిన రెండూ ఆడవి.

వెనిజులా డిజిటల్ కరెన్సీ

లావాదేవీలపై అమెరికా నిషేధం

వాషింగ్టన్: వెనిజులా ఇటీవల ప్రవేశపెట్టిన డిజిటల్ కరెన్సీ లావాదేవీలపై తమ దేశంలో నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా మార్కెట్‌లోకి వెనిజులా ప్రవేశాన్ని అడ్డుకునేందుకే ట్రంప్ ఈ ఆదేశాలు జారీ చేశారని విశ్లేషకులు చెబుతున్నారు. గత జనవరి 9 నుంచి వెనిజులా ప్రభుత్వం జారీ చేసిన డిజిటల్ కరెన్సీ, డిజిటల్ నాణాలు, డిజటల్ టోకెన్ల వంటి వాటితో అన్ని రకాల లావాదేవీలను అమెరికా నిలిపివేసిందని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వివరించింది. అమెరికా ఆంక్షలను ధిక్కరించేందుకు మదురో సర్కారు ప్రయత్నించినందునే ఈ చర్య తీసుకున్నట్టు అమెరికా ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

శత్రువులపై రక్తసిక్త పోరుకైనా సిద్ధమే... : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



బీజింగ్: శత్రువులపై రక్తసిక్త పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తెలిపారు. తమ దేశానికి చెందిన అంగుళం భూభా గాన్ని కూడా దురాక్రమణకు గురికాకుండా చూసుకుం టామని అన్నారు. పార్లమెంట్ ముగింపు సమావేశంలో జిన్‌పింగ్ మాట్లాడారు. చైనాను విభజించడానికి జరిగే ఏ ప్రయత్నమైనా విఫలం కాక తప్పదని అన్నారు. దేశం ముక్కలు కాకుండా చూడడమే ప్రజాభిమతం అని తెలిపారు. చైనా ప్రజలు తమ శత్రువులకు వ్యతిరేకంగా రక్తసిక్త పోరాటాలు సాగించడానికి సైతం సిద్ధంగా ఉన్నారని అన్నారు. జిన్‌పింగ్ ప్రసంగం – చైనా నుంచి వేరు పడాలని తైవాన్, హాంకాంగ్‌లాంటి ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయత్నాలకు గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు. అభివృద్ధి విషయంలో ఉపేక్షించబోమని తన ప్రసంగంలో జిన్‌పింగ్ పేర్కొన్నారు. కేవలం సోషలిజం మాత్రమే చైనాను రక్షించగలదని చరిత్ర నిరూపించిందని ఆయన తెలిపారు.

తైవాన్‌కు పరోక్ష హెచ్చరిక!

చైనా లక్ష్యాల గురించి చెబుతూ జిన్‌పింగ్, తమ దేశం బలోపేతం కావా లనుకుంటున్నా, అది దౌర్జన్యంతో కానీ ఇతర ప్రపంచాన్ని పణంగా పెట్టి కానీ కాదన్నారు. దేశాన్ని ముక్కలు చేయడానికి జరిగే ఏ ప్రయత్నమైనా విఫలం కాక తప్పదని, అలాంటి ప్రయత్నాలను చరిత్ర శిక్షిస్తుందని హెచ్చరించారు.

టర్కీలో ఎమర్జెన్సీ ఎత్తివేయాలి : ఐరాస అభ్యర్థన

న్యూయార్క్ : టర్కీలో ప్రస్తుతం కొనసాగుతున్న అత్యవసర పరిస్థితులను తక్షణమే ఎత్తేయాలని ఐక్యరాజ్యసమితి టర్కీ అధ్యక్షుడు రిస్సెప్ తయ్యిబ్ ఎర్డోగన్‌ను కోరింది. టర్కీలో హక్కుల ఉల్లంఘన ఘటనలు పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంతో ప్రజల్లో అభద్రతాభావం పెరిగిపోయే ప్రమాదముందని హెచ్చరించింది. కాగా,టర్కీలో 2016, జులై15న సైనిక తిరుగుబాటు చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ తిరుగుబాటును అణచివేయాలని దేశ ప్రజలకు ఎర్డోగన్ పిలుపునిచ్చారు. దీంతో, దేశ ప్రజలు వీధుల్లోకి చేరుకొని సైనికులను చితకబాదారు. ఫలితంగా సైనిక తిరుగుబాటు విఫలమైంది. అయితే, ఈతిరుగుబాటు వెనుక పెన్సిల్వేనియాలో ప్రవాసముంటున్న ఇస్లాం మత గురువు ఫెతుల్లా గులెన్ హస్తముందని ఎర్డోగన్ అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో గులెన్‌కు మద్దతిచ్చారనే ఆరోపణలపై పలు వర్సిటీల వీసీలను, సైనిక ఉన్నతాధికారులను, జడ్జీలను, సైనికులను, ప్రభుత్వ ఉపాధ్యాయులను, పోలీసు అధికారులను అరెస్ట్ చేశారు. 2016, జులై నుంచి దాదాపు లక్షా 60వేల మంది అరెస్ట్ అయ్యారు. దీంతో, పాలన కుంటుపడింది. టర్కీలో ఎమర్జెన్సీ ఎత్తివేయాలని ఐరాస కోరింది.

This is only an advertisement for information purpose and not a Prospectus announcement. This does not constitute an invitation or offer to acquire, purchase or subscribe for securities. Not for publication or distribution, directly or indirectly outside India)

SS Infrastructure™

S.S. INFRASTRUCTURE DEVELOPMENT CONSULTANTS LIMITED

Our company was originally incorporated as "S.S. Infrastructure Development Consultants Private Limited" as a Private Limited Company under the provisions of the Companies Act, 1956 vide Certificate of Incorporation dated June 8, 2007 bearing Corporate Identity Number U45400AP2007PTC054360 issued by the Registrar of Companies, Andhra Pradesh. Subsequently, our company was converted into a Public Limited Company pursuant to shareholders resolution passed at Extra-ordinary General Meeting of our Company held on November 25, 2017 and the name of our Company was changed to S.S. Infrastructure Development Consultants Limited vide a fresh certificate of incorporation consequent upon conversion of Private Limited Company to Public Limited Company dated December 12, 2017 was issued by Registrar of Companies, Hyderabad. The Corporate Identification Number of our Company is U45400TG2007PLC054360. For Further Details of Incorporation, Change of Name and Registered office of our company, please refer to chapter titled "General Information" and "Our History and Certain Other Corporate Matters" beginning on page 55 and 129 of the Red Herring Prospectus.

Registered Office: Flat No. 15, Jabbar Building, Begumpet, Hyderabad, Telangana – 500 016, India **Tel. No.:** +91 040 66310224; **Fax No.:** +91 040 66310223 **E-mail:** info@ssidcon.org; **Website:** www.ssidcon.org **Corporate Identification Number:** U45400TG2007PLC054360 **Contact Person:** Payal Jain, Company Secretary and Compliance Officer

PROMOTERS OF OUR COMPANY: SATYANARAYANA SUNDRA & SESHAGIRI RAO PALLE

INITIAL PUBLIC OFFER CONSISTING OF FRESH ISSUE OF UPTO 42,80,000* EQUITY SHARES OF FACE VALUE OF ₹ 10/- EACH FULLY PAID FOR CASH AT A PRICE OF ₹ [•] PER EQUITY SHARE (THE "ISSUE PRICE") (INCLUDING A SHARE PREMIUM OF ₹ [•] PER EQUITY SHARE) AGGREGATING UP TO ₹ [•]LAKHS (THE "ISSUE"), OF WHICH UP TO 2,22,000* EQUITY SHARES OF FACE VALUE OF ₹ 10/- EACH FOR CASH AT A PRICE OF ₹ [•]/- PER EQUITY SHARE, AGGREGATING ₹ [•] LAKHS WILL BE RESERVED FOR SUBSCRIPTION BY THE MARKET MAKERS TO THE ISSUE (THE "MARKET MAKERS RESERVATION PORTION"). THE ISSUE LESS MARKET MAKERS RESERVATION PORTION I.E. ISSUE OF UP TP 40,56,000* EQUITY SHARES OF FACE VALUE OF ₹ 10/- EACH FOR CASH AT A PRICE OF ₹ [•]/- PER EQUITY SHARE, AGGREGATING ₹ [•] LAKHS IS HEREINAFTER REFERRED TO AS THE "NET ISSUE". THE ISSUE AND THE NET ISSUE WILL CONSTITUTE [•]% AND [•]% RESPECTIVELY OF THE FULLY DILUTED POST ISSUE PAID UP EQUITY SHARE CAPITAL OF OUR COMPANY.**

In terms of Rule 19(2(b(i of the Securities Contracts (Regulation Rules, 1957, as amended (the "SCRR" the Issue is being made for at least 25% of the post-Issue paid-up Equity Share capital of our Company. The Issue is being made through the Book Building Process, in accordance with chapter XB of the Securities and Exchange Board of India (Issue of Capital and Disclosure Requirements) Regulations, 2009, as amended the ("SEBI ICDR Regulations") wherein 35.06% of the Issue will be allocated on a proportionate basis to Qualified Institutional Buyers ("QIBs")(the "QIB Category"), 5% of the QIB Category shall be available for allocation on a proportionate basis to Mutual Funds only and the remainder shall be available for allocation on a proportionate basis to QIBs including Mutual Funds, subject to valid Bids being received from them at or above the Issue Price. Further, not less than 15% of the Issue will be available for allocation on a proportionate basis to Non-Institutional Investors and not less than 35% of the Issue will be available for allocation to Retail Individual Investors, in accordance with the SEBI ICDR Regulations, subject to valid Bids being received at or above the Issue Price.

Further Details please refer the section titled 'Issue Procedure' beginning on page 205 of the RHP.

Price Band: ₹ 37/- to ₹ 40/- per Equity Share of Face Value of ₹ 10 each.
The Floor Price is 3.7 times the Face Value and the Cap Price is 4.0 times the Face Value.
Bids can be made for a minimum of 3000 Equity Shares and in multiples of 3000 Equity Shares.

RISKS TO INVESTORS:

I. This being the first public Issue of our Company, there has been no formal market for the Equity Shares. The face value of the Equity Shares is ₹ 10 each. The Floor Price is 3.7 times the face value and the Cap Price is 4.0 times the face value. The Issue Price (determined and justified by our Company in consultation with the BRLM as stated in "Basis for Issue Price" on page 92 should not be taken to be indicative of the market price of the Equity Shares after the Equity Shares are listed. No assurance can be given regarding an active or sustained trading in the Equity Shares or regarding the price at which the Equity Shares will be traded after listing.

II. As on date of the Red Herring Prospectus, the average cost of acquisition per Equity Share by our Promoters viz. Satyanarayana Sundra is ₹ 0.01 and Seshagiri Rao Palle is ₹ 0.01.

BASIS FOR ISSUE PRICE

The Issue Price will be determined by our Company in consultation with the Book Running Lead Manager, on the basis of assessment of market demand for the Equity Shares issued through the Book Building Process and on the basis of quantitative and qualitative factors as described below. The face value of the Equity Shares is ₹ 10 each and the Issue Price is 3.7 times the face value at the lower end of the Price Band and 4.0 times the face value at the higher end of the Price Band. Investors should also refer to the sections "Our Business", "Risk Factors" and "Financial Statements" on pages 117, 20 and 157, respectively, to have an informed view before making an investment decision.

Qualitative Factors

Some of the qualitative factors, which form the basis for computing the price, are:

1. Experienced Promoters 2. Wide range of services 3. Well established relationship with clients.

For further details, refer to heading "Our Competitive Strengths" under chapter titled "Our Business" beginning on page 117 of this Red Herring Prospectus.

Quantitative Factors

The information presented below relating to the Company is based on the restated financial statements of the Company for Financial Year 2017, 2016, 2015 and for the period ended September 30, 2017 prepared in accordance with Indian GAAP. Some of the quantitative factors, which form the basis or computing the price, are as follows:

1. Basic and Diluted Earnings per Share (EPS) as per Accounting Standard 20 as adjusted for changes in capital based on restated financials

Year/Period Ended	Basic & Diluted EPS (₹)	Weight
March 31, 2015	4.78	1
March 31, 2016	4.27	2
March 31, 2017	4.75	3
Weighted Average		**4.60**
September 30, 2017 *		**2.83**

**Not annualised*

Note: The earnings per share has been computed by dividing net profit as restated, attributable to equity shareholders by restated weighted average number of equity shares outstanding during the period / year. Restated weighted average number of equity shares has been computed as per AS20. The face value of each Equity Share is Rs. 10/-. Basic EPS is Net profit attributable to equity shareholders divided by Weighted average number of Equity Shares outstanding during the year / period.

EPS has been calculated after adjusting the Weighted Average Number of Shares for issuance of 800 fully paid bonus equity shares for every 1 equity share held affected on September 30, 2017, on proportionate basis. For details, see the chapter titled "Capital Structure" on page 66 of this Red Herring Prospectus.

2. Price to Earnings (P/E) ratio in relation to Issue Price of ₹ [•] per Equity Share of ₹ 10 each fully paid up

Based on Restated Financials		
Particulars	**P/E at the lower end of Price band (no. of times)**	**P/E at the higher end of Price band (no. of times)**
P/E ratio based on Basic & Diluted EPS for FY 2016-17	7.79	8.42
P/E ratio based on Weighted Average Basic & Diluted EPS	8.04	8.70
Industry		
Highest		**142.86**
Lowest		**11.89**
Average		**66.24**

*Industry Composite comprises of Mold Tek Technologies Limited, ATV Projects India Limited & Artefact Projects Limited.

3. Return on Net worth (RoNW)

Return on Net Worth ("RoNW") as per restated financial statements

Year/Period Ended	RoNW (%)	Weight
March 31, 2015	34.49	1
March 31, 2016	23.58	2
March 31, 2017	20.76	3
Weighted average		**23.99**
September 30, 2017*		**11.41**

**Not annualized*

Note: The RoNW has been computed by dividing net profit after tax as restated, by Net Worth as at the end of the year/period

4. Minimum Return on Total Net Worth post Issue needed to maintain Pre-Issue EPS for the year ended March 31, 2017 based on restated financial statements

To maintain pre-issue Basic & Diluted EPS

a. At the floor price –17.92%

b. At the cap price –17.33%

5. Net Asset Value (NAV)

NAV per Equity Share	Based on Restated Financial Statements
Net Asset Value per Equity Share as of March 31, 2017	22.87
Net Asset Value per Equity Share as of September 30, 2017	24.80
Net Asset Value per Equity Share after the Issue-At Floor Price	28.48
Net Asset Value per Equity Share after the Issue-At Cap Price	29.39
Issue Price per equity share	[•]

Net Asset Value per Equity Share has been calculated as net worth as per Restated Financial Statements divided by number of equity shares outstanding at the end of the period.

Net worth has been computed as the aggregate of share capital and reserves and surplus (excluding revaluation reserves, if any) of our Company. Issue Price per Equity Share will be determined on conclusion of the Book Building Process.

NAV is calculated after adjusting for issuance of 800 bonus share for every 1 share held affected on September 30, 2017, on proportionate basis. For details, see the section "Capital Structure" on page 66 of this Red Herring Prospectus.

6. Comparison with other listed companies

(Rs. in Lakhs)

Companies	CMP*	EPS (Basic and Diluted)	PE Ratio	RONW %	NAV (Per Share)	Face Value	Total Income (In Lakhs)
SS Infrastructure Development Consultants Limited	[•]	4.75	[•]	20.76	22.87	10.00	2,467.66
Peer Group**							
Mold Tek Technologies limited	70.35	1.60	43.97	12.55%	12.60	2.00	5,909.72
ATV Projects India Limited	11.30	0.95	11.89	4.79%	19.87	10.00	6,046.06
Artefact Projects Limited	50.00'	0.35	142.86	0.54%	64.17	10.00	2,533.06

**CMP for our Company is considered as Issue Price*

***Source: www.bseindia.com*

Notes:

1. Considering the nature and size of business of the Company the peer are not strictly comparable. However same have been included for broad comparison;
2. The figures for SS Infrastructure Development Consultants Limited are based on the restated financial results for the year ended March 31, 2017;
3. The figures for the peer group are based on standalone audited results for the year ended March 31, 2017;
4. Current Market Price (CMP) is the closing prices of respective scripts as on January 30, 2018;
5. 'CMP of Artefact Projects Limited is closing price of last trading session till January 30, 2018;
6. In Calculation of EPS for ATV Projects India Limited, Extraordinary items have not been considered as part of Profit After Tax as the same were income items;
7. NAV is computed as the closing net worth divided by the closing outstanding number of equity shares;
8. P/E Ratio has been computed based on the closing market price of equity shares on January 30, 2018, divided by the Basic EPS. However, PE Ratio of Artefact Projects Limited has been computed as its closing price of last trading session till January 30, 2018 divided by the Basic EPS;
9. RoNW is computed as net profit after tax divided by closing net worth. Net worth has been computed as the aggregate of share capital and reserves and surplus (excluding Revaluation Reserves);
10. The Issue Price of SS Infrastructure development Consultants Limited will be ₹ [•] per Equity Share. SS Infrastructure development Consultants Limited is a Book Built issue and price band for the same shall be published 5 working days before opening of the Issue in English and Hindi national newspapers and one regional newspaper with wide circulation;
11. The Issue Price of ₹ [•] will be determined by our Company, in consultation with the Book Running Lead Manager, on the basis of assessment of market demand from investors for Equity Shares through the Book Building Process and, is justified in view of the above qualitative and quantitative parameters. Investors should read the above mentioned information along with —Risk Factors and —Financial Statements, as Restated beginning on pages 20 and 157, respectively, to have a more informed view. The trading price of Equity Shares could decline due to factors mentioned in —Risk Factors beginning on page 20 and you may lose all or part of your investments.

For further details see section titled "Risk Factors" beginning on page 20 and the financials of the Company including profitability and return ratios, as set out in the section titled "Financial Statements" beginning on page 157 of the Red Herring Prospectus for a more informed view.

BID/ISSUE PROGRAMME

ISSUE OPENS ON: WEDNESDAY MARCH 28, 2018
ISSUE CLOSES ON: THURSDAY APRIL 05, 2018

ASBA* **Simple, Safe, Smart way of Application – Make use of it !!!**
*** Application Supported by Blocked Amount (ASBA) is a better way of applying to issues by simply blocking the fund in the bank account, investors can avail the same. For details, check section on ASBA below.**
Mandatory in public issues from January 01, 2016. No cheque/demand draft will be accepted.

In case of any revision to the Price Band, the Bid/Issue Period will be extended by at least three additional Working Days after such revision of the Price Band, subject to the Bid/Issue Period not exceeding 10 Working Days. Any revision in the Price Band and the revised Bid/Issue Period, if applicable, will be widely disseminated by notification to EMERGE Platform of National Stock Exchange of India Limited ('NSE EMERGE') by issuing a press release, and also by indicating the change on the website of the BRLM and at the terminals of syndicate member and by intimation to the SCSBs, Registrar to the Issue and Share Transfer Agent(s), Collecting Depository Participants and the Registered Brokers.

In terms of Rule 19(2(b(i of the Securities Contracts (Regulation Rules, 1957, as amended (the "SCRR" the Issue is being made for at least 25% of the post-Issue paid-up Equity Share capital of our Company. The Issue is being made through the Book Building Process, in accordance with chapter XB of the Securities and Exchange Board of India (Issue of Capital and Disclosure Requirements) Regulations, 2009, as amended the ("SEBI ICDR Regulations") wherein 35.06% of the Issue will be allocated on a proportionate basis to Qualified Institutional Buyers ("QIBs")(the "QIB Category"), 5% of the QIB Category shall be available for allocation on a proportionate basis to Mutual Funds only and the remainder shall be available for allocation on a proportionate basis to QIBs including Mutual Funds, subject to valid Bids being received from them at or above the Issue Price. Further, not less than 15% of the Issue will be available for allocation on a proportionate basis to Non-Institutional Investors and not less than 35% of the Issue will be available for allocation to Retail Individual Investors, in accordance with the SEBI ICDR Regulations, subject to valid Bids being received at or above the Issue Price.

Bidders / Applicants should note that on the basis of PAN, DP ID and Client ID as provided in the Bid cum Application Form, the Bidder may be deemed to have authorized the Depositories to provide to the Registrar to the Issue, any requested Demographic Details of the Bidder as available on the records of the depositories. These Demographic Details may be used, among other things, for unblocking of ASBA Account or for other correspondence(s) related to an Issue. Bidders / Applicants are advised to update any changes to their Demographic Details as available in the records of the Depository Participant to ensure accuracy of records. Any delay resulting from failure to update the Demographic Details would be at the Bidders' sole risk. Bidders should ensure that PAN, DP ID and the Client ID are correctly filled in the Bid cum Application Form. The PAN, DP ID and Client ID provided in the Bid cum Application Form should match with the PAN, DP ID and Client ID available in the Depository database; otherwise, the Bid cum Application Form is liable to be rejected. Bidders should ensure that the beneficiary account provided in the Bid cum Application Form is active.

Contents of the Memorandum of the Company as regards its Objects: Investors are requested to refer to clause III of the Memorandum of Association of the Company for the main objects to provide and other objects of the Company. The Memorandum of Association of the Company is a material document for inspection in relation to the Issue. For details, see the section "Material Contracts and Documents for Inspection" on page 315 of the RHP.

Liability of the members of the Company: Limited by shares.

Amount of share capital of the Company and Capital structure: The authorised, issued, subscribed and paid up share capital of the Company as on the date of the RHP is as follows: The authorised capital of the Company is ₹15,00,00,000 divided into 1,50,00,000 Equity Shares of ₹ 10 each. The issued, subscribed and paid - up share capital of the Company is ₹ 9,89,23,500 divided into 98,92,350 Equity Shares of ₹ 10 each. For details, see the chapter "Capital Structure" on page 66 of the RHP.

Names of signatories to the Memorandum of Association of the Company and the number of Equity Shares subscribed by them Satyanarayana Sundara and Seshagiri Rao Palle subscribed 5,000 equity shares each, Total Equity Shares = 10,000

Listing: The Equity Shares of our Company issued through the Red Herring Prospectus are proposed to be listed on the EMERGE Platform of National Stock Exchange of India Limited ('NSE EMERGE') in terms of the Chapter XB of the SEBI (ICDR) Regulations, 2009 as amendeded from time to time. Our Company has received an In-principle approval letter dated March 13, 2018 from National Stock Exchange of India Limited for using its name in the Issue document for listing of our shares on the EMERGE Platform of National Stock Exchange of India Limited. For the purpose of this Issue, National Stock Exchange of India Limited shall be the Designated Stock Exchange.

DISCLAIMER CLAUSE OF SEBI: Since the Issue is being made in terms of Chapter XB of the SEBI (ICDR) Regulations, 2009, the Red Herring Prospectus was not filed with SEBI. In terms of the SEBI Regulations, the SEBI shall not issue any observation on the Offer Document. Hence, there is no such specific disclaimer clause of SEBI. However, investors may refer to the entire "Disclaimer Clause of SEBI" on page 184 of the Red Herring Prospectus.

DISCLAIMER CLAUSE OF EMERGE PLATFORM OF NATIONAL STOCK EXCHANGE OF INDIA LIMITED (DESIGNATED STOCK EXCHANGE): It is to be distinctly understood that the permission given by National Stock Exchange of India Limited should not in any way be deemed or construed that the Red Herring Prospectus has been cleared or approved by National Stock Exchange of India Limited nor does it certify the correctness or completeness of any of the contents of the Red Herring Prospectus. The investors are advised to refer to the Red Herring Prospectus for the full text of the "Disclaimer Clause of the EMERGE Platform of National Stock Exchange of India Limited" on page 189 of the Red Herring Prospectus.

GENERAL RISK : Investments in equity and equity-related securities involve a degree of risk and investors should not invest any funds in this Issue unless they can afford to take the risk of losing their entire investment. Investors are advised to read the risk factors carefully before taking an investment decision in the Issue. For taking an investment decision, investors must rely on their own examination of our Company and the Issue including the risks involved. The Equity Shares issued in the Issue have not been recommended or approved by the Securities and Exchange Board of India ("SEBI"), nor does SEBI guarantee the accuracy or adequacy of the Red Herring Prospectus. Specific attention of the investors is invited to the section "Risk Factors" beginning on page 20 of the Red Herring Prospectus.

BOOK RUNNING LEAD MANAGER TO THE ISSUE

PANTOMATH Advisory Services Group

PANTOMATH CAPITAL ADVISORS PRIVATE LIMITED
406-408, Keshava Premises, Behind Family Court, Bandra Kurla Complex, Bandra East, Mumbai 400051, Maharashtra, India **Tel:** +91 22 6194 6700; **Fax:** +91 22 2659 8690;
Investor Grievance Email: ipo@pantomathgroup.com;
Email Id:- ipo@pantomathgroup.com; **Website:** www.pantomathgroup.com;
Contact Person: Lokesh Shah
SEBI Registration No.: INM000012110

REGISTRAR TO THE ISSUE

Bigshare Services Private Limited
1st Floor, Bharat Tin Works Building ,Opp, Vasant Oasis, Makwana Road Marol, Andheri (East) Mumbai - 400059, Maharashtra ,India **Tel:** +91 22 62638200; **Fax** :+91 22 62638299
Email: ipo@bigshareonline.com
Website: www.bigshareonline.com; **Investor Grievance Id :** investor@bigshareonline.com
Contact Person: Babu Rapheal
SEBI Registration Number:INR000001385

COMPANY SECRETARY AND COMPLIANCE OFFICER

PAYAL JAIN
S.S. Infrastructure Development Consultants Limited
Flat No.15,Jabbar Building,Begumpet, Hyderabad-500016, Telangana
Tel: +9104066310224; **Fax:** +91 04066310223
Email: compliance@ssidcon.org;
Website: www.ssidcon.org

Investors may contact our Company Secretary and Compliance Officer and / or the Registrar to the Issue and / or the Book Running Lead Manager, in case of any pre-Issue or post-Issue related problems, such as non-receipt of letters of allotment, credit of allotted Equity Shares in the respective beneficiary account, or unblocking of ASBA etc.

AVAILABILITY OF RED HERRING PROSPECTUS: Investors should note that Investment in Equity Shares involves a high degree of risk and investors are advised to refer to the Red Herring Prospectus and the Risk Factors contained therein, before applying in the Issue. Full copy of the Red Herring Prospectus will be available at the website of SEBI at www.sebi.gov.in the website of Stock Exchange at www.nseindia.com the website of Book Running Lead Manager at www.pantomathgroup.com and the website of our Company at www.ssidcon.org

AVAILABILITY OF BID CUM APPLICATION FORMS: Bid-cum-Application Forms can be obtained from the registered office of **S.S. INFRASTRUCTURE DEVELOPMENT CONSULTANTS LIMITED**, BRLM to the Issue: Pantomath Capital Advisors Private Limited, Tel: +91 22 6194 6700; Fax: +91 22 2659 8690; Syndicate member viz. Pantomath Stock Brokers Private Limited Tel: +91 22 4257 7000; Fax: +91 22 2659 8690; Bid-cum-application Forms will also be available at selected location of registered brokers, RTA participating in this Issue, DP and on the website of National Stock Exchange of India Limited and at the designated branches of SCSBs, the list of which is available on the website of National Stock Exchange of India Limited and SEBI.

APPLICATIONS SUPPORTED BY BLOCKED AMOUNT (ASBA): Investors (except Anchor Investors) have to compulsorily apply through the ASBA process. The investors are required to fill the application form and submit the same to the relevant SCSB at the specified location or registered brokers at the broker centres or RTA or DP. The SCSB will block the amount in the account as per the authority contained in application form. On allotment, amount will be unblocked and account will be debited only to the extent required to be paid for allotment of shares. Hence, there will be no need of refund. The application forms can also be downloaded from the website of National Stock Exchange of India Limited. Application forms can be obtained from the list of banks that are available on website of SEBI at www.sebi.gov.in. For more details on the ASBA process, please refer to the details given in application forms and Red Herring Prospectus and also please refer to the chapter titled "Issue Procedure" on page 205 of the Red Herring Prospectus.

Banker to the Issue: Axis Bank Limited

Refund Banker: Axis Bank Limited

All capitalized terms used herein and not specifically defined shall have the same meaning as ascribed to them in the Red Herring Prospectus dated March 20, 2018 ("RHP").

For S.S. Infrastructure Development Consultants Limited
On behalf of the Board of Directors
Sd/-
Satyanarayana Sundra
Managing Director

Date: March 20, 2018
Place: Hyderabad

S.S. INFRASTRUCTURE DEVELOPMENT CONSULTANTS LIMITED is proposing, subject to market conditions, public issue of its equity shares and has filed the Red Herring Prospectus with the Registrar of Companies, Hyderabad. The Red Herring prospectus is available on the website of SEBI at www.sebi.gov.in, the website of the Book Running Lead Manager at www.pantomathgroup.com, website of the National Stock Exchange of India Limited at www.nseindia.com and Website of Issuer Company at www.ssidcon.org .Investors should note that investment in Equity Shares involves a high degree of risk. For details, investors shall refer to and rely on the Red Herring Prospectus including the section titled "Risk Factors" beginning on page no. 20 of the Red Herring Prospectus, which has been filed with ROC. The Equity Shares have not been and will not be registered under the US Securities Act (the "Securities Act") or any state securities law in United States and may not be issued or sold within the United States or to, or for the account or benefit of, "U.S. persons" (as defined in the Regulations under the Securities Act), except pursuant to an exemption from, or in a transaction not subject to, the registration requirements of the U.S. Securities Act and applicable state securities laws. Accordingly, such Equity Shares are being offered and sold outside of the United States in offshore transactions in reliance on Regulation S under the U.S. Securities Act and the applicable laws of the jurisdiction where those offers and sales occur.

CONCEPT



త్రిపురలో విషం కక్కుతున్న రామ్‌మాధవ్




టి.ఎన్.వి.రమణ

త్రిపుర ఎన్నికలలో కమలం విజయం సందర్భంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌ను ఆర్‌ఎస్‌ఎస్ అధికారిక పత్రిక ఇంటర్వ్యూ

రాష్ట్రం	2014	2015	2016	క్రైమ్‌రేటు 2016లో..
గుజరాత్	1,31,385	1,26,935	1,47,122	4.9శాతం
హర్యానా	79,947	84,446	88,527	3.0శాతం
మధ్యప్రదేశ్	2,72,423	2,68,614	2,64,418	8.9శాతం
మహారాష్ట్ర	2,49,834	2,75,414	2,61,714	8.8శాతం
త్రిపుర	5,499	4,692	3,933	0.1శాతం

చేసినప్పుడు త్రిపురలో హింస ఎక్కువ ఉన్నదనీ, నేరాల సంఖ్య కూడా ఎక్కువనీ, మీడియాకి కూడా రక్షణ లేదనీ వక్రభాష్యం చేసారు. అందుకే తమ పార్టీ శాంతీ ఐక్యతా అభివృద్ధి ఎజెండాతో ఎన్నికల్లో దిగామని చెప్పారు. త్రిపురలో శాంతి భద్రతల పరిస్థితి తెలుసుకోవడానికి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో - మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ విడుదల చేసిన క్రైమ్ ఇన్ ఇండియా-2016 పరిశీలిస్తే నిజానిజాలు తెలుస్తాయి.

త్రిపురలో 2014 నుండి వరుసగా నేరాల సంఖ్య తగ్గుతున్నది. కేవలం 0.1శాతంగా ఉన్న నేరాల రేటు తెలిసి కూడాఅక్కడ హింస రాజ్యమేలుతున్నట్టు ఆరోపించడం ఘోరం. త్రిపుర వామపక్ష ప్రభుత్వం పదేండ్ల క్రితమే విచ్ఛిన్నకర శక్తులు సృష్టిస్తున్న హింసను పూర్తిగా అరికట్టింది. వామపక్ష ప్రభుత్వ విజయమది. అందరూ అంగీకరిస్తున్న అంశం. ఈశాన్య రాష్ట్రాలలో పర్యాటకులకు ప్రశాంతంగా ఉండే రాష్ట్రం త్రిపుర అని ఎంతోమంది ప్రకటించారు. మరి రామ్‌మాధవ్‌కి హింస ఎక్కడ కనపడింది. అదే కాలానికి బీజేపీ పాలిత రాష్ట్రాలలో నేరాల సంఖ్య పెరిగిందని పై పట్టిక చూస్తే తేటతెల్లమవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మార్చి 2017 నుంచీ ఇప్పటికి 921 ఎన్‌కౌంటర్లు జరిగాయి. 33 మందిని ప్రభుత్వమే చంపింది. వాళ్లు చెప్పడం ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారు నేరగాళ్లనీ..నిజంగా నేరగాళ్లే అయితే చంపే హక్కు ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ఎవరిచ్చారు. చట్టం, కోర్టులు ఎందుకున్నాయి? దీనికి రామ్‌మాధవ్ సమాధానం ఏమిటి?



మీడియాకు రక్షణ లేకుండా పోయిందనినేది ఆయన ఆరోపణ. గత అక్టోబర్‌లో ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) ఒక విలేకరిని చంపేసింది. అదే ఐపీఎఫ్‌టీతో బీజేపీ ఎన్నికల పొత్తు పెట్టుకున్నది. మరి ఈ ద్వంద్వ ప్రమాణాలు ఎందుకు? అంటే అమాయకులైన పత్రికా ప్రతినిధులను చంపడం కూడా బీజేపీ గెలుపు వ్యూహాల్లో భాగమే. జనం దృష్టి ఆకర్షించి చర్చను, దారి మళ్లించటమే బీజేపీ పన్నాగమని మరోసారి రుజువైంది. అభివృద్ధి జరగాలం టే కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు సకాలంలో విడుదల చేయాలి. కానీ, అలా చేయకపోగా త్రిపురకు రావాల్సిన నిధులలో పెద్దఎత్తున కేంద్రం కోత పెట్టింది. ఈ లెక్కల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. 14వ ఫైనాన్స్ కమిషన్ నుండి రావాల్సిన నిధులూ విడుదలైనవీ ఇలా ఉన్నాయి.

అదీగాక, 13వ ఫైనాన్స్ కమిషన్ నుండి రావాల్సినది రూ.10,000 కోట్ల బకాయి ఉంది. దీనికి 14వ ఫైనాన్స్

సం॥	రావాల్సినవి	ఇచ్చినవి	బకాయి (కోట్లల్లో)
2014-15	4,837	2,330	2,507
2015-16	5,306	4,355	951
2016-17	6,552	5,189	1,363
		మొత్తం	4,821 కోట్లు

కమిషన్‌లో రావాల్సిన మొత్తం రూ.4821 కోట్లూ కలిపితే దాదాపు రూ.15,000 కోట్లు. త్రిపుర వార్షిక బడ్జెట్‌తో ఇది సమానం. దీని అర్థం ఏమిటి? త్రిపురకు న్యాయంగా రావాల్సిన నిధులివ్వకుండా కేంద్రప్రభుత్వం ఆర్థిక దిగ్బంధనం చేసింది. రెండోవైపు అభివృద్ధి జరగట్లేదని దుమారం లేపి బదనాం చేసి సీపీఐ(ఎం)ను ఓడించాలనేది బీజేపీ పన్నాగం. ఈకుట్ర గత మూడేండ్లుగా జరుగుతున్నది.

ఇన్ని ఇబ్బందులు పెడుతున్నా తమ వద్ద ఉన్న పరిమిత నిధులతో విద్య, వైద్యం, సేద్యం, రహదారుల అభివృద్ధి వంటి ఎన్నో పనులు మాణిక్ సర్కార్ కొనసాగించారు. స్వచ్ఛమైన పాలన అందించారు. రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా త్రిపురను రూపుదిద్దారు. ఇవన్నీ మరుగుపరిచేందుకే ఈ అబద్ధ ప్రచారం. ఎన్నికల అనంతర హింస గురించి అడిగితే అసలక్కడ హింసే జరగలేదు. జరిగి ఉంటే వివరాలివ్వండని రామ్‌మాధవ్ ఎదురు ప్రశ్న. త్రిపురలో ఇద్దరు సీపీఐ(ఎం) కార్యకర్తల్ని చంపేశారు. 134 సీపీఐ(ఎం) ఆఫీసుల్ని తగలబెట్టారు. 208 ఆఫీసుల్ని కబ్జా చేశారు. 196 ఇండ్లకు నిప్పు పెట్టారు. 1580మందిని చితక్కొట్టారు. ఈ వివరాలన్నీ దిన పత్రికలలో ఫొటోలు సహా ప్రముఖంగా వచ్చాయి. ఇవన్నీ రామ్‌మాధవ్‌కి కనిపించలేదా? కల్పిత వార్తలూ తప్పుడు ప్రచారాలు మాత్రమే చూసిన రామ్‌మాధవ్‌కి నిజమైన వార్తలు ప్రచురించే మీడియాపట్ల యింతటి అంధత్వం ఆయన నైజమా?

లెనిన్ విగ్రహం కూల్చిన విషయంలో ఆయన నిజస్వరూపం బయట పడుతున్నది. "కొందరు ప్రయివేటు వ్యక్తులు లెనిన్ విగ్రహాన్ని పెట్టుకున్నారు. వారే ఇప్పుడు అవసరం లేదని భావించి తొలగించారు. ఇందులో బీజేపీకి ఏమి సంబంధం? నాకు కమ్యూనిజం నచ్చితే లెనిన్ ఫొటో నా దగ్గర పెట్టుకుంటా. కొంతకాలం తరువాత నాకు కాంగ్రెస్ నచ్చితే లెనిన్ ఫొటో తొలగించి ఇందిరాగాంధీ బొమ్మ పెట్టుకుంటా. ఇది ఎంత సాధారణమో లెనిన్ బొమ్మ తొలగించడం కూడా అంతే సాధారణం" అన్నది ఆయన వాదులాట. ఎవరి మీద పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు రాలేదని కూడా అన్నారు. జేసీబీ డ్రైవర్ ఆశిష్‌పాల్‌ను, రాజునాథ్ అనే మరొకరిని పోలీసులు అరెస్టు చేసిన విషయం పత్రికలలో వచ్చింది. అబద్ధాలకు హద్దులు లేవని రామ్‌మాధవ్ మాటలే నిరూపిస్తున్నాయి. రామ్‌మాధవ్ "చలో పల్టో" అనే వాట్సప్ మెసేజ్ ద్వారా లెనిన్ విగ్రహ కూల్చివేతను ప్రోత్సహించారని కూడా వార్తలొస్తున్నాయి. ఎదురుదాడి కాషాయంబరులకు వెన్నతోపెట్టిన విద్య. ఇది దొంగే దొంగ, దొంగ అని అరిచినట్టు ఉంది. నిజాలను నిగూఢపరిచి సత్యాలను సమాధి చేయటం కమలనాధులకు అలవాటే..

సెల్ :9494731091

పుతిన్ అధ్యక్ష ఎన్నిక ఓ ప్రహసనం!




ఎం.కోటేశ్వరరావు

బద్ధకంగా కలలు కనేవారికి నియంతృత్వం కూడా ఒక పాలనా విధానం మాదిరే కనిపించి మాయ చేస్తుంది. వారికి మరొక ప్రత్యామ్నాయం కనిపించదు. ఇది ఆదివారం నాడు జరిగిన రష్యన్ ఎన్నికల్లో మరోమారు ఎన్నికైన వ్లాదిమిర్ పుతిన్ విజయం గురించి ఒక వ్యాఖ్యాత చేసిన వర్ణన వాస్తవానికి ఎంతో దగ్గరగా వుంది. అసలు ఎన్నికలే జరపని నియంతలు కొందరైతే

> **ఎన్నికల ప్రచారమంతా తమ అభ్యర్థిపై బురదజల్లే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమంతో చేసినట్టుగా వుంది అని కమ్యూనిస్టు పార్టీ ఫిర్యాదు చేసింది. ఇప్పటికే 14ఏండ్లు అధికారంలో వున్న పుతిన్ అనూహ్య పరిణామాలు, సంక్షోభాలేవీ సంభవించకపోతే 2024వరకు అధికారంలో కొనసాగుతారు. రాబోయే రోజుల్లో రష్యా మనుగడ కోసమైనా పుతిన్ పశ్చిమ దేశాల వ్యతిరేక వైఖరిని అనుసరించటం అనివార్యంగా కనిపిస్తోంది.**

ప్రత్యర్థులకు అవకాశాలు లేకుండా చేసి అప్రజాస్వామికంగా యంత్రాంగాన్ని పూర్తిగా తనకు అనుకూలంగా మలచుకొనే తరగతికి చెందిన వ్యక్తి పుతిన్. అందుకే అతగాడు తప్ప మరొకరు విజయం సాధించలేరని, ఎన్నిక లాంఛనప్రాయమే అని పరిశీలకులు ముందుగా వూహించినట్టుగానే ఫలితాలూ వచ్చాయి. ఎన్నికల్లో అవినీతి, అక్రమాల ఆరోపణల మధ్య పుతిన్‌కు 77, కమ్యూనిస్టుపార్టీ బలపరిచిన అభ్యర్థి గ్రడనిన్‌కు 12, మితవాది జిరినోవస్కీకి 5.65శాతం ఓట్లు వచ్చాయి. మరో ఆరేండ్లు రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ కొనసాగేందుకు వీలు కల్పించిన ఏకపక్ష ఎన్నికల గురించి నిజానికి ఎవరికీ పెద్ద భ్రమలు లేవు. సోవియట్ విచ్ఛిన్నంతో మిగిలిపోయే రష్యా గురించి సామ్రాజ్యవాదులు వేసిన అంచనాలు తలకిందులయ్యాయి. గత రెండు ప్రపంచ యుద్ధాల్లో ఏదో ఒక పెద్ద సామ్రాజ్యం కూలిపోయి అది బలహీనపడటం చరిత్ర. ఉదాహరణ టర్కీ, బ్రిటన్, జపాన్, అయితే ప్రచ్ఛన్న యుద్ధంలో సోవియట్ యూనియన్ను కూల్చేసిన తరువాత ప్రపంచ రాజకీయ రంగంలో తమకు పోటీదారుగా రష్యా ముందుకు రావటాన్ని సామ్రాజ్యవాదులు వూహించి వుంటే పరిణామాలు మరోవిధంగా వుండేవి. పుతిన్ హయాంలో రష్యా ప్రపంచ అగ్రరాజ్యంగా ముందుకు వచ్చింది. తన సత్తా నిరూపించేందుకు నాటో కూటమిని సవాలు చేస్తూ తన పక్కలో బల్లెంగా మారకుండా చూసుకొనేందుకు ఉక్రెయిన్‌లోని క్రిమియాను ఆక్రమించుకుంది. సిరియాలో అసద్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి సామ్రాజ్యవాదుల వెన్నుదన్నుగా వున్న శక్తులను దెబ్బతీయటంలో రష్యా పాత్ర బహిరంగం. ఇదే సమయంలో మొత్తం మీద చూసినప్పుడు సోవియట్, తూర్పు ఐరోపా సోషలిస్టు వ్యవస్థలను కూల్చేసిన సామ్రాజ్యవాద, ధనిక పెట్టుబడి దారీ దేశాలన్నీ తరతమ తేడాలతో అభివృద్ధి గిడసబారటం లేదా తగ్గటం వంటి సంక్షోభాలకు గురయ్యాయి.

అందువలన ఈ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు వచ్చాయి, వాటి మంచి చెడ్డల గురించి అంతగా విశ్లేషించటం కంటే ఎన్నికలకు ముందు, తరువాత పర్యవసానాల గురించి చర్చించుకోవటం ఉత్తమం. సోషలిస్టు వ్యవస్థను కాలదన్నుకున్న తరువాత రష్యాలో పరిస్థితులు అన్ని రంగాల్లో దిగజారాయి తప్ప ఏ మాత్రం మెరుగుపడలేదు. అయినా సరే రెండు దశాబ్దాలుగా పుతిన్ ఎలా అధికారంలో వుండగలుగుతున్నాడు అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. దానిని వేరే సందర్భంలో చర్చించొచ్చు. 2016 ఏప్రిల్ 12న బ్రిటన్ పత్రిక గార్డియన్ అధికారిక అంకెలను పేర్కొంటూ వెల్లడించిన వివరాల ప్రకారం.. జనాభాలో 13.4శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువ ఆదాయాలతో బతుకుతున్నారు. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే ఇది 20శాతం ఎక్కువ. పద్దెనిమిది సంవత్సరాల కిందట ఇది 29శాతం వుంది.



చమురు మార్కెట్లో ధరల పతనం అనేక మందిని దారిద్ర్యంలోకి నెట్టింది. అభివృద్ధి రేటు విషయానికి వస్తే 2015లో మైనస్ 2.8, 2016లో మైనస్ 0.2, 2017లో 1.7, 2018లో 1.7, 2019లో 1.8శాతంగా ప్రపంచబ్యాంకు వెల్లడించింది. 2008 ఆర్థిక సంక్షోభం రష్యాను వదల్లేదు. దాని పర్యవసానాలు అనుభవిస్తున్నది. 2014లో చమురు రేటు పీపా 96డాలర్లు వున్నపుడు రష్యా అభివృద్ధి రేటు 0.7శాతం వుండేది. అది తరువాత కనిష్టంగా 2016లో 43డాలర్లకు పడిపోయింది. ప్రపంచబ్యాంకు అంచనా ప్రకారం ఈ ఏడాది 56, 2019లో 59 డాలర్లకు పెరగొచ్చని అంచనా. అందువలన ఆర్థిక రంగంలో అద్భుతాలను పుతిన్ పాలనలో ఊహించలేము. ఇప్పటికీ దానికి వున్న సహజవనరులు, ఆయుధ తయారీ వంటి అంశాలు మిగతా ధనిక దేశాలతో మార్కెట్ కోసం పోటీబడేట్టు చేస్తున్నాయి. ఇతర ధనిక దేశాల అభివృద్ధి రేట్లు కూడా ఇదే ధోరణితో వున్నాయి. నాటోను నిలువరించేందుకు ఐరోపాలో చేయాల్సిన అదనపు మిలిటరీ ఖర్చు తప్ప చైనాతో వున్న పెద్ద సరిహద్దులో సాధారణ మిలిటరీ నిర్వహణ రష్యాకు కలసి వచ్చే అంశం.

అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమను సవాలు చేస్తున్న పుతిన్‌ను ఒక విధంగా అమెరికా నాయకత్వంలోని ధనిక దేశాలే రాజకీయంగా నిలబెడుతున్నాయన్నది ఒక అభిప్రాయం. పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా జాతీయవాదా న్ని రెచ్చగొట్టి పుతిన్ దానిని తమకు అనుకూలంగా మార్చుకోవటంలో సిద్ధహస్తుడయ్యాడు. క్రిమియా ప్రాంతాన్ని రష్యాలో విలీనం చేయడం దానిలో భాగమే. గత ఎన్నికల్లో అక్రమాలతో పుతిన్ విజయం సాధించాడని అప్పుడు విదేశాంగ మంత్రిగా వున్న హిల్లరీ క్లింటన్ చేసిన వ్యాఖ్యకు, 2016 అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకొని హిల్లరీకి వ్యతిరేకంగా డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరించాడన్నది పుతిన్‌పై పశ్చిమ దేశాల వ్యాఖ్యాతల అభిప్రాయం. ఈ విషయంలో ట్రంప్ అవునని, కాదని అనలేక ఏడాది కాలంగా ట్రంప్ కొంత మేరకు ఊగిసలాడిన పుటికీ ఎన్నికలకు ముందు ట్రంప్ తన రాజకీయాన్ని ప్రారంభించాడు. మాజీ రష్యన్ గూఢచారి, అతని కుమార్తెపై బ్రిటన్‌లోని శాలిస్ బరీలో ప్రాణాంతక గ్యాస్‌ను రష్యా ప్రయోగించినట్టు సరిగ్గా పోలింగ్‌కు మూడు రోజుల ముందు బ్రిటన్, ఇతర ఐరోపా దేశాలు చేసిన ఆరోపణలతో అమెరికా గొంతు కలిపింది. 2016 అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకున్నందుకు ప్రతీకారంగా అదే రోజు కొంత మంది రష్యన్లపై, కొన్ని సంస్థలపై అమెరికా ఆర్థికశాఖ ఆంక్షలు విధించింది. ఈ చర్యల పట్ల ఆగ్రహం చెందిన రష్యన్లు పుతిన్‌కు ఓటు వేశారని కొందరు సూత్రీకరించారు.

రష్యాలో ఎన్నికల పట్ల జనంలో పెద్ద ఆసక్తి లేదని వార్తలు వచ్చినప్పటికీ 67శాతంపైగా పోలింగు నమోదైనట్టు ప్రకటించారు. పుతిన్ రాజకీయ ప్రత్యర్థుల్లో ఒకడైన అలెగ్జీ నవల్నీపై ఒక కేసు వున్న కారణంగా పోటీకి అనర్హుడిగా ప్రకటించారు. దాంతో ఎన్నికలను బహిష్కరించామని అతగాడు పిలుపునిచ్చాడు. అసోసియేటెట్ ప్రెస్ వార్తా కథనం ప్రకారం అనేక చోట్ల బ్యాలెట్ బ్యాక్సులను పుతిన్ మద్దతుదారులే ఓట్లతో నింపారు. అనేక చోట్ల ఆ విధంగా వేయించిన వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమంలో పెద్దఎత్తున దర్శనమిచ్చాయి. కొన్ని చోట్ల బలవంతంగా ఓట్లు వేయించారు.

కంపెనీల యజమానులు బలవంతంగా కార్మికులను బస్సుల్లో తరలించి ఓట్లు వేయించారని నవల్నీ విమర్శించాడు. గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం తగ్గితే తన బహిష్కరణ పిలుపు ప్రభావమే అని నవల్నీ నోరెత్తకుండా వుండేందుకు వీలుగా అంతకంటే ఎక్కువ శాతం బ్యాలెట్ బాక్సుల్లో వేయించే జాగ్రత్త తీసుకున్నట్టుగా భావిస్తున్నారు. అసలు ఎన్నికలే ప్రహసనమైతే ఇలాంటివి జరగటంలో ఆశ్చర్యం లేదు. ఎన్నికల్లో సరైన అభ్యర్థులు, నిజమైన పోటీ లేదని, విమర్శనాత్మక గళాలను అణచివేశారని ఐరోపా భద్రత, సహకార సంస్థ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. ఈ ఎన్నిక రోతపుట్టించిందని కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పావెల్ గ్రడనిన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాల గురించి కమ్యూనిస్టు పార్టీ చైర్మెన్ జుగనోవ్ మాట్లాడుతూ అనేక విశ్వవిద్యాలయాలు, సహకార సంస్థల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థికి 25-30శాతం ఓట్లు పడ్డాయని.. ఇది నిజమైన మద్దతు, భవిష్యత్‌లో ప్రజలు తమ కార్యక్రమాన్ని బలపరుస్తా రని ఆశిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. మాకు ఒక కార్యక్రమం వుంది, మా వద్ద సమస్యలకు పరిష్కారాలున్నాయి, అనుభవం వుంది కనుక అధికారంలో వున్న వారు ప్రతిపక్షం చెప్పేది వినాలని జుగనోవ్ చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి గ్రడనిన్ ఎన్నికల రోజున ఒక ప్రకటన చేస్తూ వామప క్ష, దేశభక్త శక్తులు దేశం ముందు 20అంశాల నిర్దిష్ట కార్యక్ర మాన్ని వుంచాయి. దేశ రాజ్యాంగం ప్రకారం ప్రజలే సర్వశక్తి మంతులు. ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థులు, వారి కార్యక్రమాలు, దేశ భవిష్యత్ గురించి వారి అవగాహనను జనానికి తెలియజేయాల్సి వుంది. ఇటువంటి స్థితిలో అభ్యర్థుల చర్చలకు అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున సమయాలు నిర్ణయించటం, జనం చూసే చోట్ల నాసిరకంగా కార్యక్రమా లను ప్రసారం చేయటం వంటి పనులు చేశారు. అభ్యర్థుల చర్చలను ప్రత్యక్ష ప్రసారం కాకుండా రికార్డు చేయటంతో సెన్సార్‌కు అవకాశం కలిగింది. ఎక్కువ మంది చూసే సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పోటీలో వున్న అభ్యర్థులు, ఎన్నికల సంఘానికి కూడా ఈ మేరకు తాను సూచించానని గ్రడనిన్ పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో నిబంధనావళిని ఎలా తుంగలో తొక్కింది వివరిస్తూ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి 70 ఫిర్యాదులు చేసింది. పోటీ చేసే అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించలేదు. కమ్యూనిస్టు అభ్యర్థి గ్రడనిన్‌కు వ్యతిరేకంగా ఒక యుద్ధమే ప్రకటించారు. తప్పుడు, కల్పితాలను గుప్పించారు. తొంభైశాతం సమాచారం అసహ్యంగా, రెచ్చగొట్టే విధంగా వుంది. ఇది ఒక విధంగా బహిరంగంగా వేధించటమే. ఇది 1990దశకం కంటే దిగజారింది. మొత్తం ఎన్నికల ప్రచారమంతా తమ అభ్యర్థిపై బురదజల్లే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమంతో చేసినట్టుగా వుంది అని కమ్యూనిస్టు పార్టీ ఫిర్యాదు చేసింది. ఇప్పటికే 14ఏండ్లు అధికారంలో వున్న పుతిన్ అనూహ్య పరిణామాలు, సంక్షోభాలేవీ సంభవించకపోతే 2024వరకు అధికారంలో కొనసాగుతారు. రాబోయే రోజుల్లో రష్యా మనుగడ కోసమైనా పుతిన్ పశ్చిమ దేశాల వ్యతిరేక వైఖరిని అనుసరించటం అనివార్యంగా కనిపిస్తోంది. ■

ఆర్టీసీ విస్తరణ సాధ్యమేనా ?



వి.ఎస్. రావు

ప్రజల ఆశలకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తన చివరి బడ్జెట్‌లోనైనా ఆర్టీసీకి తగినన్ని నిధులు కేటాయిస్తుందని ప్రజలు ఆశించారు. కానీ ఈ బడ్జెట్‌లోనూ రెవెన్యూ పద్దు కింద రాయితీల రీ-ఎంబర్స్‌మెంట్‌కు రూ.520 కోట్లు, క్యాపిటల్ పద్దు కింద ప్రభుత్వ గ్యారెంటెడ్ లోన్స్ ద్వారా రూ.334 కో ట్లు, బస్‌ల కొనుగోలుకు రూ.140 కోట్ల రుణం ఇప్పిస్తామని బడ్జెట్ పద్దులలో చూపి, బాగా నిధులిచ్చినట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటు న్నది. రాయితీల భారాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి తిరిగి చెల్లించాలనే డిమాం డ్‌తో 2001లో ఆర్టీసీ కార్మికులు చేసిన సమ్మె ద్వారా 50శాతం రాయితీ సొమ్మును చెల్లిస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వం, 2005లో చేసిన సమ్మె ద్వారా 100శాతం రీ-ఎంబర్స్‌మెంట్ చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించి, అమలు చేస్తున్నాయి. ఈ క్రెడిట్ కార్మికులది, కార్మిక సంఘాలది తప్ప ఏ రాజకీయ పార్టీదీ కాదు. ఇప్పుడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం రీ-ఎంబర్స్‌మెంట్ సొమ్మును బడ్జెట్‌లో కేటాయించి, అదేదో గత ప్రభుత్వాలు ఇవ్వకున్నా, ఇప్పుడే ఇస్తున్నట్టు బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించినట్టు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. తక్షణమే బడ్జెట్ సవరించి ఆర్టీసీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.


2017-18లో రాయితీల రీ-ఎంబర్స్‌మెంట్ కింద రూ.520 కోట్లు కేటాయించినప్పటికీ మార్చి 12, 2018 నాటికి విడుదల చేసింది రూ.230 కోట్లేనని, ప్రభుత్వం పూచీకత్తు రుణం ద్వారా కొంత మొత్తం ఇప్పించామని, బస్సుల కొనుగోలు కోసం రూ.140 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ రూ.70కోట్లే విడుదల చేసినట్టు శాసన మండలిలో రవాణా మంత్రి రాతపూర్వక సమాధానమిచ్చారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి రూ.685 కోట్లు ఆర్టీసీకి చెల్లించాల్సి వుందని సమాచారం. ఇంకొక 15 రోజుల్లో ఈ బడ్జెట్ కాలం అయిపోతుంది. మరి ఈ నిధుల విడుదల మాటేమిటి? ప్రభుత్వం జవాబు చెప్పాల్సి వుంది. ఆర్టీసీకి నష్టాలొస్తున్నాయని, ఉద్యోగుల జీతాలు పెంచడం, కార్మికుల రెగ్యులరైజేషన్, డీజిల్ ధరలు పెరగడం, అప్పులపై వడ్డీల చెల్లింపు, గ్రామీణ ప్రాంత సర్వీసుల నిర్వహణ వల్ల ఆ నష్టాలొస్తున్నాయని రవాణా మంత్రి ప్రకటన చేశారు. 80వేలుగా ఉన్న ఎంఎల్‌ఏల జీతాలు రూ.2,50,000కు పెంచుకున్నారు. అలవెన్సులు, సౌకర్యాలూ పెంచుకున్నారు. ఆర్టీసీ కార్మికులు అనేక ఆందోళనలు, 2015లో 8 రోజుల సమ్మె అనంతరమే ప్రభుత్వం దిగి వచ్చి 44శాతం ఫిట్‌మెంట్ ప్రకటించింది. అలాగే డీఏ పెంపు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపు అనేది స్టాట్యుటరీ ప్రొవిజన్స్, ఆర్టీసీ కార్మికుల జీతాలతో నష్టమని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. ఆర్టీసీ సంస్థను లాభనష్టాల ప్రాతిపదికన చూస్తారా? ఇది సేవా సంస్థనా లేక వ్యాపార సంస్థనా? ఆర్టీసీ యాక్ట్ ప్రకారం ఇది సేవా సంస్థ. వ్యాపార సంస్థ అయితే లాభమే పరమావధిగా తన సర్వీసులను నడపాలి. వ్యాపారి అరటిపండ్లపై ఆదాయం రాకపోతే లాభం వచ్చే మరే పండ్లనైనా అమ్ముతాడు. అది అతడికున్న స్వేచ్ఛ. మరి లాభాలొచ్చే రూట్లలో మాత్రమే తన బస్‌లను నడిపే స్వేచ్ఛ ఆర్టీసీకి వుందా? కనీస ఆదాయం రాకపోయినా, ప్రభుత్వం నిర్దేశించిన రూట్లలో తన బస్‌లను నడపాల్సిన స్థితి ఆర్టీసీది. అందుకని ఆ బస్‌ల నిర్వహణ వల్ల వస్తున్న వ్యత్యాసాన్ని (నిర్వహణ ఖర్చు, ఆదాయానికి మధ్య వున్న తేడా) ప్రభుత్వమే రీ-ఎంబర్స్ చేయాలి. అసోసియేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్‌ఆర్‌టీయూ) కూడా ఇదే డిమాండ్ చేసింది. ఈ బడ్జెట్‌లో ఇందుకు ఒక్క రూపాయి కేటాయించ లేదు.

డీజిల్ ధరల పెరుగుదల నష్టాలకు ఒక కారణంగా మంత్రి అంగీకరించారు. జూన్ 2017న హైదరాబాద్‌లో లీటర్ డీజిల్ రూ.58.72గా వుంది. (టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన రోజున డీజిల్ ధర 51.91గా వుంది). మార్చి 2018లో లీటర్ డీజిల్ రూ.68.31గా వుంది. అంటే, నికరంగా రూ.9.59 పైన ధర పెరిగింది. ఒక్క ఏడాదిలో పెరిగిన డీజిల్ ధరల భారం రూ.191 కోట్లుగా వుంది. ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు సకాలంలో ఇవ్వనందున, సంస్థ అవసరాల కోసం తెస్తున్న అప్పులకు వడ్డీ చెల్లించాల్సి వస్తున్నది. ఇవన్నీ ప్రభుత్వ విధానాల వలన వస్తున్నవే తప్ప మరొకటి కాదు. నగర రవాణాలు ప్రపంచంలో ఎక్కడా లాభాలలో లేవని, అనేక దేశాలలో నగర రవాణాలో వస్తున్న భారాన్ని స్థానిక సంస్థలే భరిస్తున్నాయని, హైదరాబాద్‌లో వచ్చే నష్టాన్ని జీహెచ్ఎంసీ భరిస్తుందని 2015లో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ ఒక్క సంవత్సరమే జీహెచ్ఎంసీ నుండి నిధులు ఇచ్చారు. 2016-17, 2017-18లో ఒక్కపైసా కూడా ఆర్టీసీకి ఇవ్వలేదని మంత్రి సెలవిచ్చారు. అలాగే అక్రమ రవాణాపైన చర్యలు తీసుకుంటామని కూడా మంత్రి చెప్పారు. నిజానికి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రయివేటు బస్సుల అక్రమ రవాణా విపరీతంగా పెరిగింది. ఆ అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకోకపోగా, ప్రభుత్వమే వారిని ప్రోత్సహించింది. ఆర్టీసీ నష్టాలకు ఏవి కారణమని ప్రభుత్వం చెబుతున్నదో వాటిని అరికట్టడానికి గాను, ఆర్టీసీని దేశంలో అగ్రభాగాన నిలబెట్టడానికి గాని టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

2017-18లో కేరళ లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఆ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు కేటాయిస్తామని తెలిపింది. అంతేకాక అతితక్కువ వడ్డీ రేటుతో రూ.3000 కోట్లు రుణాలు ప్రభుత్వం ఇప్పిస్తుందని, 2000 బస్‌లు కొనుగోలుకు నిధులు ఇస్తామని కేరళ ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఆ రాష్ట్రంలో ఆర్టీసీ బస్‌లు 6400 మాత్రమే. కానీ మన రాష్ట్రంలో బస్‌ల సంఖ్య 10,400. ధనిక రాష్ట్రం అని చెప్పుకుంటున్న తెలంగాణలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, కేరళలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ప్రభుత్వానికీ ఎంత తేడానో గమనించవచ్చు. ఇప్పటికైనా టీఆర్‌ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌ను సమీక్షించి ఆర్టీసీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి. లేకపోతే గత ప్రభుత్వాలు, నేటి టీఆర్‌ఎస్ ప్రభుత్వానికీ ఎటువంటి తేడాలేదని ప్రజలు, ఆర్టీసీ కార్మికులు అర్థం చేసుకుంటారు. తెలంగాణలో గడచిన 40 నెలల్లో ఆర్టీసీలో ఒక్క కొత్త ఉద్యోగం రాలేదు. ఉన్న వారిలోనే 4000 మంది వరకు తగ్గిపోయారు. పనిభారం విపరీతంగా పెరిగింది. చట్టాలు అమలు చేయడం లేదు. ఇవన్నీ కూడా కార్మికులలో తీవ్ర అశాంతి రేకెత్తిస్తున్నాయి. అందుకని ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం, నూతన వేతన ఒప్పందం సాధించుకోవడం కోసం అన్ని కార్మిక సంఘాలు ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.

సెల్ : 9490098890

గెలుపు కాదు.. విశ్వసనీయతే ప్రధానం!



డాక్టర్ చుక్కా రామయ్య,

గత సాధారణ ఎన్నికల్లో మెజార్టీతో గెలిచిన బీజేపీకి ప్రస్తుతం దేశంలో ఎదురుగాలి వీస్తోంది. ఇటీవల దేశంలోని రాజకీయ పరిస్థితులను, ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలను గమనిస్తుంటే ఇదే అర్థమవుతోంది. గెలుపు అనేదికొత్త ఉత్సాహాన్నిస్తుంది. తమ ఆశయాలను మరింత స్ఫూర్తితో, నూతనోత్తేజంతో కొనసాగించేందుకు ఆ విజయం ఇంధనంగా పనికొస్తుంది. అందువల్ల గెలుపును ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలి. ఆ గెలుపులో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలి. రాజకీయ పార్టీలైతే ప్రజానుకూలమైన నిర్ణయాలను తీసుకుంటూ అందరికీ చేరువయ్యేందుకు ప్రయత్నించాలి. మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రజల

> **ప్రజలు ఎవరినైనా ఒకేసారి నమ్ముతారు. వారి గుండెలకు తగిలిన గాయాలపై కారం చల్లే విధంగా ప్రవర్తిస్తే మాత్రం తప్పకుండా గుణపాఠం చెబుతారు. సమయం వచ్చినప్పుడు తమ ఓటు అస్త్రంతో సమాధానం చెబుతారు.**

కష్టాలను తీర్చే దిశగా వడివడిగా అడుగులు వేయాలి. ఇందుకు బదులుగా.. గెలుపు మనిషిలోనైనా, రాజకీయ పార్టీలోనైనా గర్వాన్ని, నియంతృత్వ పోకడల్నీ నింపితే అది వారి మనుగడకే ప్రమాదం. ఈ రోజు రాజకీయ పార్టీలను గమనిస్తుంటే గెలుపు కోసం ఎందాకైనా వెళ్తుండటం చూస్తున్నాం.. రాజకీయ, సైద్ధాంతిక ఆరోపణలే కాకుండా వ్యక్తిగతంగా పరస్పర ఆరోపణలు చేసుకుంటూ సరికొత్త సంస్కృతికి నేటి రాజకీయ నాయకులు తెరలేపుతున్నారు. ఇలాంటి పోకడలు ప్రజాస్వామిక వ్యవస్థ మనుగడకు మంచిది కాదనేది గమనించాలి.

విజయ గర్వంతో ఉన్న బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీల మాటను పెడచెవిన పెట్టి పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి సొంత ఎజెండాలను ముందుకుతీసుకొచ్చి ప్రజలపై బలవంతంగా రుద్దింది. ప్రజలు తీవ్ర అవస్థలకు గురైనారు. ఇప్పటికీ నోటు కష్టాలు ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాయి. జీఎస్టీ పోటు సామాన్యుడికి ఇంకా సలుపుతూనే ఉంది. అవినీతి రహిత, నల్లధనం లేని దేశమే తన స్వప్నమని దేశమంతా సభలు, సమావేశాలు పెట్టి, అపూర్వ విజయం సొంతం చేసుకున్న ప్రధాని నరేంద్ర మోడీ వల్ల తమకు ఒరిగిందేమిటని ఓటేసిన ప్రజలు సూటిగానే ప్రశ్నిస్తున్న పరిస్థితుల్ని మనం చూస్తున్నాం. విచ్చలవిడిగా సాగుతున్న అవినీతిని, నల్లధనాన్ని నియంత్రించడంలో ఘోర వైఫల్యం చెందారు. విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ, చోక్సీలాంటి వ్యక్తులు బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు చెక్కేసిన వైనం ప్రజలను మరింత ఆగ్రహానికి గురిచేసింది.

రామయ్యమాట



అలాగే, ఇచ్చిన మాటకు, చేసిన పనికి కట్టుబడి ఉండటంలోనూ ఎన్డీయే ప్రభుత్వం తన విశ్వసనీయత చాటుకోలేకపోతోంది. ఉదాహరణకు.. దేశంలో అతిపెద్ద ఆర్థిక సంస్కరణగా జీఎస్టీని తీసుకొస్తున్నామంటూ అర్ధరాత్రి ప్రకటించిన కేంద్రం.. తీరా దానిపై ప్రజల్లో పెద్దఎత్తున నిరసన వెల్లువెత్తేసరికి అది తామొక్కరం తీసుకున్న నిర్ణయం కాదని, అన్ని రాజకీయ పార్టీలను, రాష్ట్రాలను సంప్రదించే ఈ పన్నుల సంస్కరణ తీసుకొచ్చామని చెబుతుండటం గమనార్హం. అంతేకాదు, ఎన్డీయేలోని మిత్ర పక్షాలు సైతం కొత్త స్నేహితుల్ని వెతుక్కొనే పరిస్థితి వచ్చింది. మన దేశ రాజకీయాల్లో అస్థిరత చోటుచేసుకుంది. తమ పాలనా తీరుతో ఓ వైపు ప్రజల విశ్వాసం పోగొట్టుకోగా. మరో వైపు మిత్రపక్షాల విశ్వాసం కూడా బీజేపీ పోగొట్టుకునేలా వ్యవహరిస్తోంది. ఇలాంటి రాజకీయ సంక్షోభం రాజకీయ పార్టీలకే కాదు దేశ ప్రజలకు ప్రజాస్వామిక వ్యవస్థపై నమ్మకం పోయే పరిస్థితిలోకి నెడుతుంది. ఎన్నికల వల్ల వ్యవస్థ పటిష్టం కావాలి గానీ.. భ్రష్టుపట్టకూడదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిన బీజేపీ ఆ తర్వాత ప్యాకేజీతోనే సరిపెట్టుకొని.. దాన్నీ సరిగ్గా అమలుచేయకపోవడంతో మరో ఉద్యమం మొదలైంది. విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఏపీకి ఇవ్వాల్సినంతగా నిధులు కూడా ఇవ్వని పర్యవసానంగా ఇటీవల టీడీపీ బయటకు వచ్చింది. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ ప్రభుత్వంపై తమకు విశ్వాసం లేదంటూ టీడీపీ, వైసీపీ అవిశ్వాస తీర్మానాలు సభలో పెట్టాయి. మరోవైపు, ప్రత్యేక హోదా, రిజర్వేషన్ల కోసం పోరాటం, తదితర అంశాలపై విపక్షాల పోరాటంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు స్తంభించిపోతున్నాయి. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చే పరిస్థితులు దేశంలో లేకపోతే ఇంకా ప్రజలు ఎవరిని నమ్మాలి? తమ సమస్యల్ని పరిష్కరించాలని ఇంకెవరిని అడగాలి? అందువల్ల ఇది దేశంలో తీవ్ర ఆందోళనకరమైన పరిణామం. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయడం రాజకీయ నాయుకుడి నిబద్ధతకు, నిజాయితీకి సంబంధించినది. దాన్ని విస్మరిస్తే నాయకుడి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రజలు ఎవరినైనా ఒకేసారి నమ్ముతారు. వారి గుండెలకు తగిలిన గాయాలపై కారం చల్లే విధంగా ప్రవర్తిస్తే మాత్రం తప్పకుండా గుణపాఠం చెబుతారు. సమయం వచ్చినప్పుడు తమ ఓటు అస్త్రంతో సమాధానం చెబుతారు.

ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు



రాణీ ముఖర్జీ
(21 మార్చి 1978)

ఏడు ఫిలింఫేర్ పురస్కారాల గ్రహీత

భారతీయ సినీరంగంలో ప్రముఖ బాలీవుడ్ నటిగా అందరికీ సుపరిచితమైన పేరు రాణీముఖర్జీ. ఆమె నటించిన ఎన్నో సినిమాలకు ఫిలింఫేర్ వంటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు అందుకున్నారు. తన అద్భుతమైన నటనకు గాను ఇప్పటికి ఏడు ఫిలింఫేర్ పురస్కారాల అందుకున్న నటీగా రికార్డు సొంతం చేసుకున్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్న ఆమె సామాజికకార్యకర్తగా ఎన్నో సేవాకార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

ముంబాయిలో ముఖర్జీ-సమర్థ్ కుటుంబంలో రాణీ జన్మించారు. ఆమె తండ్రి రామ్ ముఖర్జీ సినీదర్శకుడు, తల్లి కృష్ణ ముఖర్జీ ప్లేబ్యాక్ సింగర్. ఆమె పెద్దన్నయ్య రాజా ముఖర్జీ దర్శకనిర్మాత. ఒక విధంగా చెప్పాలంటే ఆమెది సినీ కుటుంబం.

WOMEN of the day

జుహులో మనెక్ జీ కూపర్ హై స్కూల్ లో పదోతరగతి వరకు చదువుకున్న ఆమె ఎస్.ఎన్.డి.టి మహిళా విశ్వవిద్యాలయంలో హెూం సైన్స్ లోడిగ్రీ అందుకున్నారు. ఆమె చిన్నతనం నుంచే ఒడిస్సీ న త్యం నేర్చుకున్నారు. చిన్నతనం నుంచే సినీ వాతా వరణంలో పెరిగిన ఆమె మాత్రం నటీ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇంట్లోని వారంతా సినీరంగానికే చెందినవారు కావడంతో ఆమె మరో రంగాన్ని ఎంచుకోవాలను కున్నారు. అయితే తండ్రి తీసిన బెంగాలీ చిత్రం 'బియర్ ఫూల్ '(1996) లో సహాయ నటిగా, 'రాజా కీ ఆయేగీ బారాత్'(1997)లో తల్లి కోరిక మేరకు హీరోయిన్‌గా నటించారు. తన నటనకు ప్రేక్షకులు ప్రశంసలు లభించడంతో ఇక సినిమా రంగంలోనే కొనసాగేందుకు నిర్ణయించుకుని.. రోషన్ తనీజాస్ యాక్టింట్ ఇనిస్టిట్యూట్‌లో కొద్దిరోజులు ట్రైనింగ్ తీసుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన 'కుచ్ కుచ్ హెూతా హై '(1998) సినిమా భారీ హిట్ కావడంతో మంచి క్రేజ్ వచ్చింది. యశ్ రాజ్ ఫిలింస్ నిర్మాణంలో ఆమె నటించిన 'సాథియా'2002 సినిమాతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు వచ్చింది. 2004లో ఆమె నటించిన 'హమ్ తుమ్', 'యువ', 'వీర్-జారా' సినిమాలతో బాలీవుడ్ లో హీరోయిన్ గా తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్నారు రాణీ. 2005లో 'బ్లాక్' చిత్రంలో చెవిటి, గుడ్డి, మూగ అమ్మాయిగా ఆమె నటించిన తీరు ప్రేక్షకులనే కాక, విమర్శకులనూ ఆకట్టుకుంది. ఈ సినిమాలోని నటనకు ఆమెకు ప్రశంసల జల్లు కురిసింది అంటే అతిశయోక్తి కాదు. 2011లో 'నో వన్ కిల్డ్ జెస్సికా' సినిమాతో కెరీర్ లో మరో భారీ హిట్ అందుకున్నారు రాణీ. ఆ తరువాత తలాష్: ది ఆన్సర్ లైస్ వితిన్ (2012), మర్దానీ (2014) వంటి హిట్ సినిమాల్లో నటించారు.

నటిగానేకాక, సామాజిక అవగాహన ఉన్న వ్యక్తిగా రాణీ గుర్తింపు పొందారు. మహిళలపై వివక్ష, పిల్లలు ఎదుర్కొంటున్న కష్టాలపై ఎన్నోసార్లు మాట్లాడిన ఆమె వారి కోసం ఎన్నో టూర్లు, స్టేజ్‌షోలు చేశారు. ఆమె సినీ నిర్మాత ఆదిత్య చోప్రాను వివాహం చేసుకున్నారు. ❄



కమలమ్మ గారిని జ్ఞాపకం చేసుకోవడమంటే, తలుచుకోవడమంటే నైజాం ప్రభుత్వ ఏలుబడిలో దొరల దౌర్జన్యాలు, వెట్టి చాకిరి, బానిసత్వం , గడీల్లో జరిగిన అరాచకాలు, వాటికి వ్యతిరేకంగా ఆంధ్ర మహా సభ , ఆ పై కమ్యూనిస్టు ఉద్యమం, మట్టి మనుషుల త్యాగాలు ... ఓ మహోన్నత పోరాటాన్ని మననం చేసుకోవడమే. 92 ఏండ్ల వయసులో ఈ నెల 11వ తేదీన కన్ను మూసిన కమలమ్మగారి జ్ఞాపకాలు ఉద్యమాల్లో పని చేసేవారికి స్ఫూర్తి దాయకం.

ఆమె త్యాగం అమర జ్ఞాపకం

వడ్డించిన విస్తరి కాదు కమలమ్మ గారి జీవితం. ఆవిడ నాయన పేరు చెరకు రంగారావు. అప్పట్లో ఆయన వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం నేనాల గ్రామంలో కరణం దొరల దగ్గర గుమస్తా. ఆనాటి దొరల పాలనలో ప్రజలకు ఏ హక్కులు ఉండక పోయేవి. ఇక స్త్రీల కష్టాలు చెప్పనలవి కావు. వారికి నచ్చిన అమ్మాయిని తీసుకొచ్చి గడీల్లో పెట్టుకున్నా అడిగే పరిస్థితి ఆరోజుల్లో లేదు. అలా తెచ్చుకున్న అమ్మాయిలను గడీల్లో పెట్టుకున్న వారిని ఆడబాపలనేవారు. వాళ్ళు తమ బతుకంతా గడీల్లో బానిసలుగా ఉండే వారు. పుట్టిన పిల్లలకు తల్లి మాత్రమే తెలిసేది. తండ్రి ఎవరో తెలియక పోయేది. అక్కడ పుట్టినావిడే రంగమ్మ. గుమస్తా పనిచేస్తున్న చెరుకు రంగా రావు అక్కడే పరిచయమైన రంగమ్మతో సహా జీవనం చేసాడు. రంగారావు, రంగమ్మ గార్లకు 5 మంది సంతానం. అందులో నాలుగో సంతానమే కమలమ్మ. సహజంగా పిల్లలకు తండ్రి తరపునే ఇంటి పేర్లను పెట్టుకుంటారు. కానీ వీరి పుట్టిన పిల్లలకు తల్లి తరుపున ఉన్న "మందాటి" అన్న ఇంటిపేరు స్థిరపడింది. దానికి ప్రధాన కారణం, ఆనాటికి కరణం దొరలను ఎదిరించి నిలబడే శక్తి రంగారావుకు లేదు. ఒకవేళ ఇంటిపేరు పిల్లలకు పెడితే దొరలు ఊరుకోరు. అందుకే పిల్లలకు భార్య ఇంటిపేరునే ఉంచేశారు. పెద్దవాడు మందాటి వెంకటయ్యకు పెండ్లి చేద్దామంటే కరుణాల పిల్లను ఇవ్వలేదు. ఆ క్రమంలోనే మరిపెడ మండలం చిల్లంచర్ల రాంపురం గ్రామానికి చెందిన చక్రపాణమ్మ బిడ్డ చిత్తారమ్మను వెంకటయ్య చేసుకుంటే, ఆవిడ కొడుకు ముకుందాన్ని కమలమ్మ చేసుకుంది. పెండ్లి సమయానికి కమలమ్మ వయసు 7 ఏండ్లు. ముకుందానికి 18 ఏండ్లు.

ఉద్యమంలోకి...

తెలంగాణా ప్రాంతం ఆనాడు నైజాంల ఏలుబడిలో ఉండేది.వారి మద్దతుతో గ్రామాల్లో దొరలు, భూస్వాముల పెత్తనాలు చెప్పతరం కాదు. అన్ని కులాల ప్రజలు దొరలకు వెట్టి చేసేవారు. భారత దేశానికి1947 లో స్వాతంత్రం వచ్చినా, తెలంగాణ ప్రాంతానికి మాత్రం రాలేదు.1946 నుండే కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో ఈ అన్యాయాలను వ్యతిరేకిస్తూ ఉద్యమం మొదలైంది. దొరలకు మద్దతుగా నైజాం ఏర్పాటు చేసిన ప్రైవేట్ సైన్యం రజాకార్లు రంగంలోకి దిగారు. ఎక్కడ చూసినా అరాచకాలు. పోరాడితే తప్ప బతకలేని పరిస్థితి. ఆ పోరులోకి ముందుగా పోయినవాడు కమలమ్మ పెద్దన్న వెంకటయ్య. ఆయన పార్టీలో దళ కమాండర్. అతడే కమలమ్మను, ముకుందాన్ని ఉద్యమంలోకి తీసుకొని పోయాడు. పోరాటంలోకి పోయినప్పుడు కమలమ్మ గారి వయసు 18 ఏండ్లు. ఆరోజుల్లో ఉద్యమం జరుగుతున్నప్పుడు నాయకులు మారు పేర్లతో పిలవబడ్డా, కమలమ్మ గారి పేరు మార్చలేదు. ఆమె పేరుతోనే దళాల్లో తిరిగింది. భర్త మాత్రం రహస్యజీవితంలో అప్పన్నగా పేరు మార్చుకొని చివరి వరకు ఆ పేరుతోనే బతికాడు.

> **ఉద్యమంలోకి పోతున్నప్పుడు కమలమ్మకు ఎనిమిది నెలల బాబు. తన ఎనిమిది నెలల బాబును అప్పన్న చెల్లెలుకిచ్చి దళాల్లోకి వెళ్లిపోయింది. ఒక మామూలు స్త్రీ కమలమ్మ.. సిద్ధాంతాన్ని చదవలేదు. పుస్తకాల జ్ఞానం లేదు. కానీ ఒక సంక్షుభిత సమయంలో సమస్యల పరిష్కారం కోసం తన పిల్లవాడిని వదిలేసి ఉద్యమంలోకి దూకడం ఎర్రజెండా ఇచ్చిన చైతన్యమే.**

మాతృత్వం మెలిపెట్టినా

ఉద్యమంలోకి పోతున్నప్పుడు కమలమ్మకు ఎనిమిది నెలల బాబు. తన ఎనిమిది నెలల బాబును అప్పన్న చెల్లెలుకిచ్చి దళాల్లోకి వెళ్లిపోయింది. ఒక మామూలు స్త్రీ కమలమ్మ.. సిద్ధాంతాన్ని చదవలేదు. పుస్తకాల జ్ఞానం లేదు. కానీ ఒక సంక్షుభిత సమయంలో సమస్యల పరిష్కారం కోసం తన పిల్లవాడిని వదిలేసి ఉద్యమంలోకి దూకడం ఎర్రజెండా ఇచ్చిన చైతన్యమే. పిల్లవాడిని పంపేసినా పాలు తాగే వయసు కనుక మాతృత్వ మమకారం నిరంతరం మెలిపెట్టేది. ఆ రెండేళ్లలో వాడిని చూడాలని అనుకున్నా నిర్బంధంలో సాధ్యం కాలేదు

కన్నీళ్లు ఆగలేదు...

అడివిలోకి పోయినపుడు అక్కడ గిరిజనులను ఆర్గనైజ్ చేయడానికి బుర్రకథలు, పాటలు పాడడం, గొల్లసుద్దులు చెప్పడం చేసే వారు. దళాల్లో వైజ్ఞానిక రంగంలో అంటే నర్సుగా దెబ్బలు తాకినప్పుడు కట్లు కట్టడం, సూదులు ఇవ్వడం చేసేది. ఎప్పుడైనా ప్రజాయుద్ధం త్యాగాన్నే కోరుకుంటుంది. త్యాగం చేయలేనివాళ్లు అక్కడ నిలబడ లేరు.ఇద్దరు కలిసే పోరాటంలోకెళ్ళినా అప్పన్న మంతెన మహాదేవపూర్ అడివిలో ఉంటె, కమలమ్మ ఖమ్మం, మానుకోట ఏరియాల్లో ఎక్కువగా పని చేసింది. కొంతకాలం తర్వాత భార్య భర్తలు ఒకే చోట పనిచేసే అవకాశం వచ్చినప్పుడు, గర్భం ధరించిన కమలమ్మ ఎక్కడా వెనకడుగు వేయకుండా దళంలోనే 9 నెలలు అనేక పనులు చేసింది. కాన్పు జరిగిన తీరును చెప్పినప్పుడు మాకైతే కన్నీళ్లు ఆగలేదు. కాన్పు జరిగే సమయం వరకు కూడా దళంలో ఒకచోటనుండి ఇంకొకచోటుకు తిరుగుతూనే ఉందట. నొప్పులొస్తున్నాయని అన్నప్పుడు చుట్టూ దళాల్ని కాపలాగా పెట్టి, గుట్ట లోపల సొరంగంలో మంత్రసానిని పిలిపించి కాన్పు చేయించినట్లు, అప్పుడు అప్పన్న గుట్టపైన కావలి కాసినట్లు చెప్పింది. ఆమెను కాపాడుకోవడానికి దళం ఎంత కష్ట పడిందో. 'నీవెంత బాధలు అనుభవించినవమ్మా' అని అన్నప్పుడు, అంత కష్టాన్నైనా భరించే ధైర్యాన్నిచ్చిన దళ సభ్యులను, వారు చేసిన సాయాన్ని ఎంతసేపు తలుచుకుందో. పుట్టిన బాబుకు, అప్పటికే వరంగల్ జిల్లా మానుకోట తాలూకా పిండిపోలు గ్రామంలో పోలీసుల కాల్పుల్లో మరణించిన కామ్రేడ్ సీత రామారావు అని పేరు పెట్టుకున్నారు.



> **ఒకచోట క్లాసులు జరుగుతున్నప్పుడు పిల్లవాడు ఏడవడం మొదలేసిండు. ఎంతకు ఏడవడం ఆపడం లేదు.దళాల ఉనికే ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో కమలమ్మ గారి ముందు రెండే ప్రశ్నలు. . ఒకటి మాతృత్వాన్ని త్యాగం చేయాలా? రెండు ఉద్యమాన్ని వదిలేయాలా? మాతృప్రేమ కావాలనుకుంటే మంచి తల్లి అవుతుంది. ఉద్యమమే కావాలనుకుంటే ఊరందరి తల్లి అవుతుంది.**

నిర్ణయం గొప్పది

నైజాం లొంగిపోయాక యూనియన్ సైన్యాలు వచ్చాయి. దాడి తీవ్రమైంది. పోరాటంతో పాటు పిల్లోడు పెరుగుతున్నాడు. అడవిలోనే 6 నెలలు సాదుకుంది. పిల్లోడిని ఎత్తుకొని అనేక పనులు చేసేది. ఒకచోట క్లాసులు జరుగుతున్నప్పుడు పిల్లవాడు ఏడవడం మొదలేసిండు. ఎంతకు ఏడవడం ఆపడం లేదు.దళాల ఉనికే ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో కమలమ్మ గారి ముందు రెండే ప్రశ్నలు. . ఒకటి మాతృత్వాన్ని త్యాగం చేయాలా? రెండు ఉద్యమాన్ని వదిలేయాలా? మాతృప్రేమ కావాలనుకుంటే మంచి తల్లి అవుతుంది. ఉద్యమమే కావాలనుకుంటే ఊరందరి తల్లి అవుతుంది. కమలమ్మ గారు ఊరందరి తల్లి అవడానికే నిశ్చయించుకొంది. తెలిసిన వారికి ఇవ్వడానికి, బయటకు పోయే పరిస్థితి లేదు. అడవిలో ఉన్న కోయ వారిని కలిసి పిల్లోడిని సాదుకొమ్మని అడిగింది. 'పిల్లోడు ఎర్రగా ఉన్నాడు. మా కోయ వాళ్లలో కలిసి పోయినట్లు ఉండడు. మాపై పోలీస్ దాడులు పెరగవచ్చు. అదీగాక ఇక్కడ దళ సభ్యురాలి పిల్లవాడిని తెలిస్తే, ఈ ఏరియాలో దళాలకు ప్రమాదం' అని వాళ్ళు వద్దన్నారు.

నిర్ణయం అసమాన్యం

ఈ ఏరియాలో తీసుకోవడం లేదు కనుక బాబు మెడలో ఒక కాగితం రాసి ' పిల్లవాడిని సాదలేక పోతున్నాను. దయ గల్లవారు సాదుకొమ్మని' అందులో రాసి ఇల్లెందు బొగ్గుట్ట ఏరియాలో ఎవ్వరికైనా ఇచ్చేసి రావాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు పార్టీ కేటాయించిన ఎంకన్న అనే దళ సభ్యుడి సహకారంతో ఒక రాత్రి, ఒక పగలు నడిచి బొగ్గుట్టకు చేరుకున్నారు. అక్కడ ఎర్ర గోపన్న అనే ఆర్గనైజర్ ఉండేవాడు. అతని సహాయంతో ఒకతనికి పిల్లోన్ని ఇచ్చేసి అతని చేతులో పిల్లవాడి కోసమంటూ తన దగ్గరున్న 10 రూపాయలు ఇచ్చిందట. తిరిగొస్తుంటే పిల్లవాడు నాకోసం చూసిన చూపు మరువలేకున్నానంది. పిల్లవాడిని వదిలేయడమంటే... దారిన పోయే ఒక మనిషి పిల్లోడిని తీసుకుపోతుంటే ఏ తల్లికైనా సాధ్యమేనా? అయినా తను ఎత్తుకున్న ఎర్రజెండా కోసం. తననే నమ్మిన కష్టజీవుల కోసం ఆ నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కరి జీవితం ఇంకొకరి త్యాగంతో పోల్చలేకున్నా, ఒక చారిత్రక దశలో వారు తీసుకున్న నిర్ణయాలు, ఎర్రజెండా కోసం నిలబడ్డ తీరు వారిని అసమాన్యులుగా చేస్తుంది. ఆనాటి పరిస్థితుల్లో ఒక సామాన్య స్త్రీగా కమ్యూనిస్టు దళాల్లో కొచ్చి పార్టీ ఇచ్చిన జ్ఞానంతో వారు తీసుకున్న నిర్ణయం మనల్ని విపరీతంగా కదిలించి వేస్తుంది.

తెచ్చుకునే అవకాశం ఉన్నా

1952 లో అజ్ఞాత జీవితం వీడి బయటకొచ్చాక పిల్లవాడిని ఏ ఏరియాలో ఏ బొగ్గుగని కార్మికునికి ఇచ్చి వచ్చారో తెలిసే అవకాశం ఉంది కొద్దిగా కష్టపడితే పిల్లవాడిని దొరకపట్ట వచ్చని అందరూ చెప్పినా, కమలమ్మ ఆవిడ భర్త అప్పన్న(చివరి వరకు కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఉండి చనిపోయాడు) అలాంటి ప్రయత్నాలు వద్దన్నారు.గుండె దిటవు చేసుకొని ఇద్దరు ఒక నిర్ణయానికొచ్చారు. 'ఒకవేళ పిల్లవాడు దొరికినా, పిల్లవాడిని ఇచ్చేటప్పుడు తల్లిగా నేనెంత ఏడ్చానో, సాదుకొన్న తల్లికీ అంతే బాధ ఉంటుంది' అని పిల్లవాడిని దేవులాడ వద్దని నిర్ణయించుకున్నారు. ఆ తల్లీ బిడ్డల మమకారం మధ్యన తాను ఒక సమస్యగా మారకూడదని చనిపోయేవరకు ఆ జ్ఞాపకాల్లోనే బతుకుతూ.. కండ్లలో కారే కన్నీటిని తుడ్చుకుంటూ ఆరోజు మాకెన్నో విషయాలు చెప్పింది.

ఉద్యమ జెండాలై ఎగురుదాం

ఆరోజు మాకు చెప్పిన అనేక విషయాలు మదిలో కొస్తుంటే.. వయసులో అలిసిపోయి.. ఆశయంలో ఆకాశాన్ని ఒడిసిపట్టి మెరిసిపోతున్న అమ్మను చూస్తుంటే.. మనం మళ్ళీ ఉద్యమ జెండాలై ఎగురుతాం. అయినా అమ్మ ఎక్కడికెళ్లింది. చివరికంటా ఎత్తుకున్న ఎర్రజెండాను వారసత్వంగా ఇచ్చి వెళ్ళింది. ఏ ఉద్యమం కోసం ఆ తల్లి మాతృత్వాన్ని చంపుకొని ఊరంతా బిడ్డలనుకుందో వారంతా నేడు పోరాటానికి సన్నద్ధం అవ్వడమే ఆ తల్లికి మనమిచ్చే నివాళి. ఈ నెల 22 తేదీ, సాయంత్రం 5 గంll వరంగల్‌లోని పోచంమైదాన్‌లో కమలమ్మ స్మారక సభ జరగబోతున్న సందర్భంగా...

- స్ఫూర్తి,
9490098694

రెజ్యూమ్ ప్రిపరేషన్ !



ఉద్యోగ అవకాశాలకు ప్రస్తుతం రెజ్యూమ్ కీలకం. రెజ్యూమ్ తయారు చేసేటప్పుడు సహజంగా కొన్ని తప్పులు దొర్లుతాయి. ఆ తప్పులు కూడా రాకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు పాటించాల్సిందే!

- ఉద్యోగానికి వెళ్లినప్పుడు ముందుగా అడిగేది మీ రెజ్యూమ్ దాన్ని తప్పులు లేకుండా చూసుకోవాలి. అయితే కొన్నిసార్లు పదాలు అటు ఇటూ రాయడం, లేకుంటే అక్షర దోషాలు రావడం వంటివి జరుగుతాయి. కాబట్టి రెజ్యూమ్ పూర్తికాగానే ఒకసారి చదివి చెక్ చేసుకోవాలి.
- రెజ్యూమ్ పూర్తికాగానే ఇంకా మరిచిపోయినా కాలమ్స్ లేదంటే మిగతా అచివ్‌మెంట్స్ ఇలా అన్నింటిని పూర్తి చేయడం మంచిది. కొన్నిసార్లు సంవత్సరాలు, తేదీలు, నెలలు, ఫలితాలు, పర్సంటేజ్, తక్కువ వేయడం లేదా ఎక్కువ వేయడం వంటి తప్పులు చేస్తారు. ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి.
- అలాగే మీరు ఏ హెూదా కోసం ప్రయాత్నిస్తున్నారో దాన్ని రెజ్యూమ్‌లో స్పష్టంగా రాయాలి. అలాగే మీకున్న హాబీలను, వ్యక్తిగతంగా ఉన్న ఇతర నైపుణ్యాలను కూడా రాస్తే మరీ మంచిది. కొంతమంది ఇది అవసరమా అని వదిలేస్తుంటారు. అది చాలా పొరపాటు. రెజ్యూమ్‌లో ప్రతిదీ ముఖ్యమే. అలాగే ఎక్కువ డేకరేట్ చేయడం కూడా మంచిది కాదు. దీని వల్ల చదవడం ఇబ్బందిగా ఉంటుంది.
- కొంతమంది రెజ్యూమ్‌ను రెండు, మూడు పేజీల్లో తయారు చేసుకుంటారు. అలా తయారు చేసుకోవడం వల్ల చదవడానికి ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి చాలా క్లుప్తంగా, చదవడానికి ఇబ్బంది లేకుండా అన్నీ విషయాలను వివరంగా రాస్తే సరిపోతుంది.
- రెజ్యూమ్ పంపించే ముందు తేదీ విషయంలో జాగ్రత్తగా చుసుకోవాలి. రెజ్యూమ్ ఎప్పుడు రెడీ చేశారో చూడరు. దాన్ని పంపించిన తేదీని ముఖ్యంగా చూస్తారు. కాబట్టి ఇది సరిచేసుకుంటే మంచిది. ❄

మార్పు తెచ్చే వీడియో గేమ్!

పిల్లలు వీడియో గేమ్స్ చూస్తుంటే పెద్దలకు చిరాగ్గా ఉంటుంది. వాటికి బానిసలుగా మారిపోయారని బాధపడతాం. వాటి బారి నుంచి పిల్లలు ఎంత దూరం చేయాలనుకున్నా మన వల్ల కాదు. అయితే బ్రెయిన్ ట్రైనింగ్ అనే కంప్యూటర్ గేమ్ పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంచుతుందట. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉంది కదూ..! కానీ ఇది నిజమంట.

ఈ వీడియో గేమ్ వల్ల పిల్లలు పళ్లు, కూరగాయలు వంటి ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలను తినే చాన్సు ఉందట. అంతేకాదు చాక్లెట్లు, స్వీట్లు వంటి వాటి మీద ఆసక్తి చూపరట. ఇటీవల శాస్త్రవేత్తలు నిర్వహించిన ఒక పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది.

సైకాలజిస్టులు రూపొందించిన ఈ గేమ్‌లో ఆరోగ్యకరమైన ఆహారపదార్థాల చిత్రాలు పిల్లల్ని వెంటనే ఆకర్షిస్తున్నాయి. అదే సమయంలో పిల్లల దృష్టి అనారోగ్యకర ఆహారపదార్థాలపై పడకపోవడం విశేషం. తమ అధ్యయనం ఇంకా తొలి దశలోనే ఉందని, తాము రూపొందించిన గేమ్ సహాయంతో దీర్ఘకాలంలో డయటరీ అలవాట్లను మార్చగలమా..? లేదా..? అనేది ఇంకా వేచి చూడాలన్నారు.

అధ్యయనంలో భాగంగా 4-11 సంవత్సరాల వయసున్న పిల్లలపై ఈ పరీక్ష నిర్వహించారు. వీరికి ఆరోగ్యకరమైన, అనారోగ్యకరమైన ఆహారపదార్థాల చిత్రాలను చూపించారు. ఆరోగ్యకరమైన ఆహారానికి ఆనందంగా ఉన్న కార్టూన్



బొమ్మ, అనారోగ్యకరమైన ఆహారానికి విచారంగా ఉన్న కార్టూన్ బొమ్మను జోడించారు. అయితే పిల్లలకు ఈ గేమ్ ఉద్దేశం వెల్లడించలేదు. ఈ గేమ్‌తో నాలుగేండ్ల పిల్లలు కూడా లాభపడతారట. అంతేకాదు ఇది పెద్దలకు మల్లే పిల్లల్లోనూ ఫుడ్ చాయిస్ సంస్కృతి పెంచుతుందట. ❄

రోజూ కాసేపు...

ప్రతిరోజూ ఉదయం పరుగెత్తడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి దూరమవ్వడమేగాక, నెగిటివ్ ఆలోచనలను కూడా దూరం పెట్టవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. రన్నింగ్, వాకింగ్ అనేది కేవలం ఫిజికల్ ఫిట్‌నెస్ కే కాకుండా మెంటల్ ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో



తోడ్పడుతుంది. నెగిటివ్ ఆలోచనలు రాకుండా మెదడుపై ప్రభావం చూపుతుందని ఇటీవల ఒక పరిశోధనలో తేలింది. రోజూ కాసేపు పరుగెత్తడం వల్ల ఒత్తిడి నుంచి విముక్తి పొందటంతో పాటు మెదడు యాక్టివేట్ కావడం వల్ల నెగిటివ్ ఆలోచనలు రావంటున్నారు.

భారత్ జీడీపీకి దెబ్బే

- బ్యాంకు స్కాంల ప్రభావం: గోల్డ్‌మ్యాన్ శ్యాచెస్ సంచలన నివేదిక

ముంబయి : దేశ ఆర్థిక వృద్ధిపై భారీ ఆశలు పెట్టుకున్న నరేంద్ర మోడీ సర్కారు షాక్ న్యూస్.! భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిపై బ్యాంకుల కుంభకోణాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని పెట్టుబడుల బ్యాంకు గోల్డ్‌మ్యాన్ శాచెస్ అంచనా వేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిపై అంతకుముందు తాను సూచించిన అంచనాను తగ్గించింది. ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు దాదాపు రూ.11,400 కోట్ల మేరకు మోసానికి గురికావడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో రుణాల వృద్ధిని పరిమితం చేసే కఠినమైన నియంత్రణలు అమల్లోకి రావచ్చునని హెచ్చరించింది. జీడీపీ 8 శాతం వృద్ధి చెందే అవకాశం ఉన్నదని గతంలో సూచించిన ఈ సంస్థ తాజాగా దీన్ని 7.6 శాతానికి తగ్గించింది.

బీబీఏ చదువులకు విట్, యుఎండి వర్సిటీల మధ్య ఒప్పందం

అమరావతి : అమరావతిలోని వెల్లూర్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్ డియర్‌బార్న్ (యూఎండీ)తో లెటర్ ఆఫ్ ఇంటెంట్ ద్వారా ఒక అవగాహనకు వచ్చింది. దీంతో అమరావతి విట్‌లో బీబీఏ విద్యార్థులు అమెరికా వెళ్లి చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది. తన సమక్షంలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఒప్పదం గురించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలతో, పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో అమరావతి విట్ విద్యార్థులకు విదేశీ చదువుకు అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. విట్ యాజమాన్యాన్ని సీఎం అభినందించారు. బీబీఏ కోర్సులో చేరే విద్యార్థులు అమరావతి విట్ క్యాంపస్‌లో రెండేళ్లు, మిగిలిన రెండేళ్లు యుఎండిలో చదవాల్సి ఉంటుంది. చదువు పూర్తయ్యాక ఆ యూనివర్సిటీ నుంచి బీబీఏ డిగ్రీ పొందవచ్చు. అలాగే ఇక్కడ విట్‌లో మూడేళ్ల డిగ్రీతోపాటు డిప్లొమా పూర్తి చేశాక యుఎండిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయవచ్చు. విట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి మూడేండ్ల బీబీఏ డిగ్రీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్ చదివిన విద్యార్థులు బిబిఎకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విట్ వైస్ ఛాన్సలర్ శుభాకర్, ఏపి అడ్వయిజర్ వి. రాజు, యుఎండి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


బీఈడీ, డీఈడీ కాలేజీల్లో తనిఖీలు

- ఎన్‌సీటీఈని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న బీఈడీ, డీఈడీ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించి అవకతవకలు వాస్తవమో కాదో తెలియజేయాలని ఎన్‌సీటీఈని హైకోర్టు ఆదేశించింది. ప్రకాశం జిల్లాకు చెందిన నవలూరి మాధవరావు దాఖలు చేసిన రెండు ప్రజాహిత వ్యాజ్యాలను మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మరోసారి విచారించింది. వివిధ జిల్లాల్లో ఆరోపణలు వచ్చిన బీఈడీ, డీఈడీ కాలేజీల్లో తనిఖీలు చేయాలని ఎన్‌సీటీఈని హైకోర్టు ఆదేశించింది. ఆయా కాలేజీల్లో తనిఖీలు నిర్వహించి రెండు వారాల్లో నివేదిక అందజేయాలని ఎన్‌సీటీఈని ఆదేశించింది. ప్రకాశం జిల్లా బ్రాహ్మణపల్లిలో అనుమతి పొంది వినుకొండలో కాలేజీ నడుపుతున్నారు. ఒక్క కాలేజీలోనే చేయాల్సిన అధ్యాపకులు నిబంధనలకు వ్యతిరేకంగా పలు కాలేజీల్లో పనిచేస్తున్నారని పిటిషనర్ లాయర్ వాదించారు. ఆరోపణలు వచ్చిన పది కాలేజీల్లో తనిఖీలు చేయాలని, అందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం పిటిషనర్ ఒక లక్ష రూపాయల్ని ఎన్‌సీటీఈ వద్ద డిపాజిట్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

తెలంగాణకు 17, ఏపీకి 16 టీఎంసీలు

- కృష్ణా జలాల కేటాయింపు: బోర్డు త్రిసభ్య కమిటీ తీర్మానం




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణకు 17, ఏపీకి 16 టీఎంసీల నీటిని కేటాయిస్తూ మంగళవారం ఇక్కడ సమావేశమైన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ తీర్మానించింది. బోర్డు సభ్య కార్యదర్శి ఎ పరమేశం, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ రావు, ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వర రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే నెలాఖరు వరకు ఈ నీటిని వినియోగించుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. శ్రీశైలం నుంచి తెలంగాణకు 1 టీఎంసీ, ఏపీకి 1 టీఎంసీ కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన నీటిని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారాను, ఏపీకి కేటాయించిన నీటిని హంద్రినీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారాను వినియోగించాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్ ద్వారా తెలంగాణకు 16, ఏపీకి 15 టీఎంసీల నీరు కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన నీటిలో హైదరాబాద్ నగరంతో పాటు నల్లగొండ తాగునీటి అవసరాలకు 6టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు 10 టీఎంసీలు కేటాయించారు. నాగార్జున సాగర్ ద్వారా ఏపీకి కేటాయించిన నీటిలో 7టీఎంసీలు కుడి కాలువకు, 4 టీఎంసీలు ఎడమ కాలువకు కేటాయించారు. కృష్ణా డెల్టాకు 4 టీఎంసీలు కేటాయించగా, బుధవారం నుంచి ఈ నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. శ్రీశైలం డ్యాంలో 800 అడుగుల వరకు నీటిని విడుదల చేయాలని, పవర్ జనరేషన్ ద్వారా కిందికి నీరు వదలాలని నిర్ణయించారు.

మోడీ 'పథకాలకు' నిధుల్లేవు

స్మార్ట్‌సిటీలకు ఖర్చు చేసింది 1.8 శాతమే

- మిగిలిన పథకాల తీరూ అదే: పార్లమెంటరీ నివేదిక



న్యూఢిల్లీ: 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా తయారైంది బీజేపీ ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరు. ఆర్భాటంగా తీసుకొచ్చిన చాలా పథకాలు నిధుల్లేక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారాయి. ప్రధాని మోడీ ఆర్భాటంగా ప్రారంభించిన ఆకర్షణీయ నగరాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై), స్వచ్ఛ్ భారత్ వంటి పథకాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో కేవలం 21 శాతం మాత్రమే ఖర్చు పెట్టారని పార్లమెంటరీ కమిటీ నివేదిక వెల్లడించింది. దీని ప్రకారం... గడిచిన రెండేండ్లలో స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు కోసం రూ. 9,750 కోట్లు కేటాయించారు. ఇందులో కేవలం 1.8 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారు. అలాగే ఇతర పథకాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పీఎంఈవై, స్వచ్ఛ భారత్ వంటి వాటిలో కేటాయించిన దానిలో 30 శాతం నిధులే ఖర్చు చేసినట్టు నివేదిక పేర్కొంది. ఇది ఇలాగే కొనసాగితే మోడీ ప్రవేశపెట్టిన పథకాలు కలలు గానే మిగులుతాయని పార్లమెంటరీ నివేదిక ప్రభుత్వాన్ని హెచ్చరించింది.


2022 నాటికి దేశంలో 'అందరికీ ఇండ్లు' అనే నినాదంతో ప్రారంభించిన పథకానికి నిధుల కొరత తీవ్రంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేశామని 'నోటి మాటలు' చెబుతున్నా.. రాష్ట్రాలకు సరైన ప్రాజెక్టుల రూపకల్పన, నిధుల కేటాయింపులు సమగ్రంగా జరగడం లేదని కమిటీ తెలిపింది. ఆకర్షణీయమైన పేర్లు పెట్టి ఇబ్బడి ముబ్బడిగా పథకాలను ప్రారంభించడంలో బీజేపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ వాటి అమలు చేయడంలో మాత్రం లేదంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, బిజు జనతాదళ్ ఎంపీ పినాకీ మిశ్రా తెలిపారు. అయితే దీనిపై ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకునే ధోరణిలోనే మాట్లాడుతున్నది. ప్రాజెక్టుల పని పూర్తి అయ్యాకే నిధులు మంజూరు చేస్తామని.. కొన్ని రోజులుగా పనుల్లో తలెత్తిన జాప్యం కారణంగా పనులు నిలిచిపోవడం వల్లే అవి పూర్తి కాలేదని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రాజీవ్ జైన్ పేర్కొన్నారు. నిధుల విడుదలే పథకాల పనితీరుకు కొలమానం కాదంటూ ప్రభుత్వ లోపాల్ని సమర్థించుకున్నారు. అయితే, సమాఖ్య స్ఫూర్తి కలిగిన భారత్‌లో కేంద్రం రాష్ట్రాలకు సహకరిస్తేనే అభివృద్ధికి సాధ్యమవుతుందని ఐఐటీ ఢిల్లీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తోన్న జైజిట్ భట్టాచార్య అభిప్రాయపడ్డారు.

కోర్టులంటే లెక్కలేదా..?

- ఒక్క ప్రజాప్రతినిధే కోడిపందేలు ఆడారా?: ప్రభుత్వ వివరణపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్: కోడి పందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధుల గుర్తింపుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కార్ ఇచ్చిన వివరణపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి మాత్రమే గుర్తించామని, ఇంకెవరెవరు కోడిపందేలు ఆడారో గుర్తించేందుకు సమయం కావాలని ఎపి సర్కార్ హైకోర్టును కోరింది. భీమవరం మండలం శ్రీరాంపురం, వెంప గ్రామాల్లో సంక్రాంతి పండుగకు కోడి పందేల పేరుతో అశ్లీల డ్యాన్సులు, గుండాట, జూదం, వ్యభిచారం నిర్వహిస్తున్నారని, వీటిని అడ్డుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు మరోసారి విచారించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఎదుట ఎపి అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్ వాదిస్తూ.. టీవీ9 చానల్ మాత్రమే కోడిపందేల వీడియో పుటేజిని అందజేసిందని, అందులో ఒకే ఒక్క ప్రజాప్రతినిధి కోడిపందేలు ఆడినట్లుగా తేలిందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా మొత్తానికి ఒకే ఒక్క ప్రజాప్రతినిధి కోడిపందేలు ఆడారా, ఎమ్మెల్యేలు, ఎంపిటిసి, జెడ్పీటిసి సభ్యులు ఎంతోమంది కోడిపందేలు ఆడినట్లు టీవీల్లో ప్రసారమైందని కొంతమంది పెద్దలైతే టీవీల ముందు కోళ్లు పట్టుకుని గొప్పగా ప్రసంగాలు కూడా చేశారని హైకోర్టు పేర్కొంది. ఎన్‌డిటివి వంటి జాతీయ టీవీ చానల్‌లో కూడా కోడిపందేలు ఆడుతున్నట్లుగా పెద్దలు మాట్లాడినట్లు వచ్చిందన్నారు. కోర్టులంటే లెక్కలేనట్లుగా స్పందన ఉందని, కోడిపందేలు ఆడిన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకుంటే కచ్చితమైన సమాధానాన్ని ఇచ్చినట్లు అవుతుందని హైకోర్టు అభిప్రాయ పడింది. దీనిపై ఎజి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పిం చుకోవడం ప్రభుత్వ ఉద్దేశం కానేకాదని, మరో అవకాశం ఇస్తే పూర్తి వివరాలు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుమతించిన హైకోర్టు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ప్రజాశక్తి సబ్‌ఎడిటర్ చక్రపాణి మృతి



విజయవాడ : ప్రజాశక్తిలో సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్న పి.చక్రపాణి మృతి చెందారు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. చక్రపాణికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు ఆయన భౌతిక కాయానికి బుధవారం ఉదయం స్వగ్రామం గుంటూరు జిల్లాలోని నర్సరావు పేటలో అంత్యక్రియలు జరగనున్నాయి. చక్రపాణి మృతికి ప్రజాశక్తి ఎడిటర్ పాటూరు రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్. వెంకట్రావు, సీజీఎం ఎంవిఎస్ శర్మ తీవ్ర సంతాపాన్ని,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

ప్రజాశక్తి సబ్ ఎడిటర్ చక్రపాణి మృతికి పలువురు జర్నలిస్టు సంఘాల నేతలు సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్ఎజె) జాతీయ కార్యదర్శి ఒ.శాంతి, ఉపాధ్యక్షులు కోటి శ్రీనివాస్, ఏపీడబ్ల్యూజేఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.శ్రీరామ్మూర్తి, షేక్ ఖాజావలి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

కూలిన ఐఏఎఫ్ విమానం

- పైలట్ సేఫ్

భువనేశ్వర్ : భారత వైమానికి దళానికి చెందిన చిన్నపాటి శిక్షణా విమానం జార్ఖండ్, ఒడిషా సరిహద్దులో కుప్పకూలింది. ప్రమాదంలో పైలట్ క్షేమంగా బయటపడ్డారు. రోజువారీ శిక్షణలో భాగంగా బెంగాల్‌లోని కలైకుండా ఎయిర్‌బేస్ నుంచి ఐఏఎఫ్ ఎయిర్‌క్రాఫ్ట్ మంగళవారం బయలు దేరింది. కాగా.. కొద్దిసేపటి తర్వాత అది సుబర్నారేఖ ప్రాంతంలో కుప్పకూలింది. పైలట్ అరవింద్ అభిషేక్‌కు స్వల్ప గాయాలు కాగా అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఎయిర్‌క్రాఫ్ట్ పూర్తిగా దగ్ధమైంది.

జమ్మూకాశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో కుప్వార జిల్లాలోని ఆరాంపోరాలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో నలుగురు గుర్తు తెలియని ఉగ్రవాదులు మరణించారు. ఈ ఆరాంపోరా ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని భద్రత అధికారి వెల్లడించారు. పహారా కాస్తున్న ఆర్మీపై కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవానులు వారిని వెతికేందుకు ఆపరేషన్ మొదలుపెట్టారు. ఈ ఆపరేషన్ చేపడుతుండగానే ఎన్‌కౌంటర్ సంభవించిందని అధికారి తెలిపారు.

మంత్రివర్గపునర్వ్యస్థీకరణకు లైన్ క్లియర్ !

- పంచాంగశ్రవణం నోట కేసీఆర్ మాట
- ఆయన అనుమతితోనే పండితుడి చెప్పారంటూ గుసగుసలు
- ముఖాలు చూసుకుంటున్న మంత్రులు
- పదవులు పోయేది ఆ ఆరుగురేనా..?



నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

అటు ప్రతిపక్షాలను ఎదుర్కొనే విషయంలో కానీ, ఇటు తన పార్టీలోని నేతలను కట్టడి చేయడంలో గానీ ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడ తన చేతికి మట్టి తగలకుండా కార్యాన్ని చేసుకుంటూ పోతున్నారు. ఎన్నాళ్లనుంచో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు(పునర్ వ్యవస్థీకరణ) చేయడానికి ప్రయత్నించి, ఆ తర్వాత వెనక్కితగ్గిన విషయం తెలిసిందే. తాజాగా ఉగాదినాడు తాను ప్రత్యేకంగా జరిపించుకున్న పంచాంగశ్రవణంతో లైన్ క్లియర్ చేయించుకున్నారు. ఐదారుగురు మంత్రులకు పదవీగండం ఉందని, వారికి భవిష్యత్తులో పదవులు కష్టమేనని సంతోష్‌కుమార్ అనే పండితుడి చెప్పడం వెనుక సీఎం కేసీఆర్ హస్తం లేకుండా పోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దానికితోడు సైన్సే పంచాంగం అని చెప్పడం కూడా ఇందులో భాగమేనని అంటున్నారు. ప్రభుత్వంలో అవినీతి జరుగుతున్నదని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ. సాగునీటిశాఖల్లో అవినీతి చోటు చేసుకుందని ప్రతిపక్షపార్టీలు విమర్శిస్తుంటే, ముఖ్యమంత్రి కేసీఆర్ సహా టీఆర్ఎస్‌పార్టీ నేతలు ఎదురుదాడికి దిగుతున్న సందర్భాలు అనేకం. రాష్ట్రంలో అవినీతే లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. మంత్రులు బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. ఇప్పుడు సాక్షాత్తూ తాను నిర్వహించుకున్న పంచాంగశ్రవణంలోనే అవినీతి చోటు చేసుకుందని, మంత్రుల పనితీరు బాగాలేదని చెప్పడం వెనుక చాలా తతంగమే నడిచి ఉంటుందని తెలుస్తోంది. త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవడానికి సంకేతాలు అని అంటున్నారు. కేసీఆర్ చెప్పాల్సిన మాటను పండితుడి నోట చెప్పించి ఉంటారని, మంత్రులెవరు ఎదురుతిరిగే అవకాశం లేకుండా పంచాంగశ్రవణాన్ని ప్రయోగించి ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇది టీఆర్ఎస్‌పార్టీలో ఒక చర్చనీయాంశంగా మారింది.

ఇబ్బందులు తలెత్తకుండా..

పార్టీలో గానీ, ప్రభుత్వంలో గానీ ఏ పని చేయాలన్నా సీఎం కేసీఆర్ ఇతరులకు నొప్పి కలిగించకుండా పరిష్కరించడంలో దిట్ట అని గులాబీ నేతలు అంటున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం వెనుక కూడా చాలా పెద్ద కథే నడిచిందని అప్పట్లో ప్రతి ఒక్కరూ చర్చించుకున్నదే. టీఆర్ఎస్‌పార్టీలోని ఎమ్మెల్యేలందరూ కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉండాలంటూ వారం పది రోజుల పాటు మీడియా ముందు మాట్లాడారు. కేసీఆరే పెద్ద దళితుడు అని ఆ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి వ్యతిరేకత రాకుండా కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన విషయం తెలిసిందే. దళితుడు ముఖ్యమంత్రి అన్న నినాదం టీఆర్ఎస్‌పార్టీలో లేకుండా పోయింది. తెలంగాణ పునర్‌నిర్మాణం పేరిట ఇతర పార్టీల ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకుని, ఆ తర్వాత ప్రతిపక్షాలను చిన్నాభిన్నం చేయడానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. తాజాగా ఎప్పట్నుంచో ఎటూ తేలకుండా ఉన్న మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణను కూడా వ్యతిరేకత లేకుండానే పూర్తి చేయడం ఖాయం అని తెలుస్తోంది. అయితే తమలో ఎవరికి పదవి పోతుందోనని మంత్రులు ముఖాలు చూసుకుంటున్నారు. పైకి మాత్రం గంభీరంగా ఉన్నా లోలోపల మాత్రం భయంభయంగానే ఉన్నారు. కేసీఆర్‌ను మాట అనడానికి కూడా సాహసం చేయడం లేదు.

ఎవరా మంత్రులు..?

పంచాంగశ్రవణంలో చెప్పినట్టుగా పదవీగండం ఎదుర్కొనే మంత్రులు ఎవరై ఉంటారబ్బా అని చర్చలు మొదలయ్యాయి. చందూలాల్, జగదీశ్వర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, జూపల్లి కృష్ణారావు, పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, పద్మారావు పేర్లు వినిపిస్తున్నాయి. తనతో పాటు మంత్రుల్లో సమర్థులైన వారిని ఢిల్లీకి తీసుకెళతానని కేసీఆర్ గతంలో చెప్పిన విషయం తెలిసిందే. ఈ లెక్కన చూస్తే కడియం శ్రీహరి, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి పేర్లు చర్చకు వచ్చాయి. ఢిల్లీకి వెళ్లేందుకు మంత్రులు కొంతమంది నిరాకరిస్తున్నట్టు తెలిసింది.

థర్డ్ ఫ్రంట్‌పై విధివిధానాలను స్పష్టం చేయాలి : చాడ



నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని చెబుతున్న కేసీఆర్ మొదటగా తమ విధివిధానాలను స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తన పాలనా విధానాన్ని మార్చుకుని బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా మంచి ఆలోచనతో ఐక్య కూటమి ఏర్పాటు చేస్తే కలిసి పనిచేయడానికి ఆలోచిస్తామన్నారు. కానీ, కేసీఆర్ తన ధోరణి మార్చు కుంటారనే నమ్మకం తమకు లేదన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుస్థిరమైన పాలన సాగడం లేదన్నారు. మొదటగా రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన సాగించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి అనంతరం థర్డ్ ఫ్రంట్ గురించి ఆలోచించాలన్నారు. భూ ప్రక్షాళన పేరిట కాలయాపన చేయడం తప్ప ఒరిగిందేమీ లేదని చెప్పారు. సర్పంచ్ స్థాయి వ్యక్తి భూ ప్రక్షాళనలో న్యాయం జరగక ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం రాష్ట్ర పరిపాలనకు అద్దం పడుతోందన్నారు. దేశంలో ప్రజా సమస్యలపైన సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తోందని చెప్పారు. స్ఫూర్తి మిలియన్ మార్చ్‌ని అణిచివేయడానికి ప్రభుత్వం ప్రదర్శించిన ధోరణి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామంటున్న కేసీఆర్, మరి రాష్ట్రంలో ప్రతిపక్షాలు పోరాటం చేస్తే చేస్తే ద్రోహమా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై అణచివేత ధోరణిని మానుకోవాలన్నారు. సీపీఐ మహాసభల అనంతరం తమ విధానాలను ప్రకటిస్తామని చెప్పారు. సిద్దిపేట ఎంసీహెచ్‌లో పని చేస్తున్న సిబ్బంది పేద రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ పరుష పదజాలంతో దూషించడం సరికాదన్నారు. వెంటనే మంత్రి స్పందించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు మచ్చ శ్రీనివాస్, శంకర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సర్కారు సానుకూలం

- టీఎమ్‌యూ నేతల వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో మంత్రులు టీ హరీశ్‌రావు, పి మహేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లతో టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్ ఎస్ సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావులతో పాటు తమ సంఘం నాయకులు అశ్వత్థామరెడ్డి, వి తిరుపతి, ఎం థామస్‌రెడ్డిలు భేటీ అయినట్టు తెలిపారు. ఆర్టీసీ సమస్యలు, స్థితిగతులపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 2017 ఏప్రిల్ 1నుంచి ఆర్టీసీ కార్మికులకు రావల్సిన జీతభత్యాల సవరణపై వారంలోగా మళ్లీ ఓ సమావేశం నిర్వహించి, సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు మంత్రులు అంగీకరించినట్టు తెలిపారు. కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లతో పాటు మిగతా అన్ని కేటగిరిల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు కూడా మంత్రులు అంగీకరించారని వివరించారు. సకల జనుల సమ్మె కాలాన్ని స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా పరిగణించేందుకు కూడా అంగీకరించారని, ఉద్యోగ భద్రతకు సంబంధించి యూనియన్ ప్రతినిధులతో పాటు యాజమాన్యంతో కూడిన కమిటీని వేసి, మార్గదర్శకాలు తయారు చేసేందుకు కూడా మంత్రులు అంగీకరించినట్టు ప్రకటనలో తెలిపారు. అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లాల్లో మరియు రాష్ట్రంలోని యూనియన్ ప్రతినిధులతో పాటు రవాణాశాఖ సిబ్బందిని నియమిస్తారని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రాజ్యసభ మాక్ పోలింగ్

- అభ్యర్థులకు జిల్లాల కేటాయింపు

హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికల్లో ఓట్లు ఎలా వేయాలన్న దానిపై తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాక్ పోలింగ్ నిర్వహించారు. మూడు స్థానాలకు గాను టీఆర్ఎస్‌పార్టీ తరపున జోగినపల్లి సంతోష్‌కుమార్, బండాప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, కాంగ్రెస్‌పార్టీ తరపున బలరాంనాయక్ నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యప్రకారం టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించనున్నారు. ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. దీనికి సంబంధించి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఎమ్మెల్యేలకు ఓటుపై అవగాహన కల్పించారు. ముగ్గురు అభ్యర్థులకు ఓట్లను కేటాయించారు. 32,32,33 చొప్పున ముగ్గురు సభ్యులకు కేటాయించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఎమ్మెల్యేలతో పాటు ఫిరాయించిన కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే ఓటును సంతోష్‌కుమార్‌కు వేసేలా ఏర్పాట్లు చేశారు. బండ ప్రకాశ్‌కు వరంగల్, మెదక్, ఖమ్మం, బడుగుల లింగయ్య యాదవ్‌కు నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్యేలు ఓట్లు వేయనున్నారు. ఈ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరుగురు మంత్రులను ఇన్‌ఛార్జీలుగా నియమించారు. సంతోష్‌కుమార్‌కు కేటీఆర్, రాజేందర్, బండ ప్రకాశ్‌కు తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, బడుగుల లింగయ్య యాదవ్‌కు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిలు నియమితులయ్యారు. బీజేపీ మద్దతు తీసుకునేందుకు టీఆర్ఎస్‌పార్టీ నిరాకరించింది.

స్వామిగౌడ్‌కు తగిన దెబ్బలపై ఏజీ ప్రస్తావించలేదు


- కుట్రపూరితంగానే సర్కారు సభ్యత్వాలు రద్దు చేసింది
- సీసీ పుటేజీలను బహిర్గతం చేయాలని డిమాండ్
- అసెంబ్లీ ఘటనపై ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గవర్నర్ ప్రసంగ సమయంలో మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌పై దాడి చేశామన్న ఆరోపణలతో తమ పార్టీ సభ్యుల సభ్యత్వాలను రద్దు చేసిందని, ఇదే అంశాన్ని హైకోర్టులో అడ్వకేట్ జనరల్ ప్రస్తావించలేదని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్వామిగౌడ్‌కు తగిలిన దెబ్బలకు సంబంధించిన ఆధారాలను ఏజీ కోర్టులో సమర్పించలేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలారన్న కారణంతోనే సభ్యత్వాలు రద్దు చేసినట్టు ఏజీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే ఆ ఇద్దరి సభ్యత్వాలను రద్దు చేసిందన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ప్రతిపక్ష నేత కె జానారెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్, రేవంత్‌రెడ్డి, మాజీ స్పీకర్లు కె ఆర్ సురేష్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, టి రామ్మోహన్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, బలరాంనాయక్, న్యాయవాది జంధ్యాల రవిశంకర్‌లతో ఆయన భేటీ అయ్యారు. హైకోర్టు తీర్పు, తాజా పరిణామాలపై వారు చర్చించారు. తదుపరి తీర్పు వెలువడేదాక ఆరువారాలపాటు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకూడదంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలివ్వడాన్ని స్వాగతించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి కారణం లేకుండా సభ్యత్వాలు రద్దు చేయడం పార్లమెంటులో చరిత్రలో జరగలేదన్నారు. స్వామిగౌడ్‌కు దెబ్బతగిలిందంటూ పదే పదే టీఆర్ఎస్ ప్రచారం చేసిందని, అందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే వారి సభ్యత్వాలను రద్దు చేసినట్టు చెప్పిందని, ఆ విషయాన్ని కోర్టులో ఎందుకు చెప్పలేదన్నారు. న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు కోమటిరెడ్డి, సంపత్‌లకు ఓటు వేసే అవకాశం న్యాయపరంగా ఉంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యసభ ఎన్నికలల్లో బలరాంనాయక్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజ్‌భవన్ కుట్రలకు నిలయం : రేవంత్‌రెడ్డి ఆరోపణ

గత బడ్జెట్ సమావేశాల్లో తనను, టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సభ నుంచి సస్పెండ్ చేసిందని, ఈ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ను ఏకపక్షంగా సభ్యత్వాలను రద్దు చేసిందని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. గవర్నర్ సమక్షంలో జరిగినా ఆయన నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్‌భవన్ కుట్రలు, కుతంత్రాలకు నిలయంగా మారిందన్నారు. గవర్నర్‌ను కలిసేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం లేదని, ఏ సభలో సభ్యుడు కానీ పవన్ కళ్యాణ్‌కు ఆయన అపాయింట్‌మెంట్ ఇచ్చారని చెప్పారు. 63 మంది ఎమ్మెల్యేలు ఉన్న టీఆర్ఎస్‌కు ఇద్దరు అభ్యర్థులే సరిపోతారని, మూడో అభ్యర్థిని ఎందుకు బరిలోకి దింపారని ప్రశ్నించారు.



మమతతో కేసీఆర్ భేటీ తుస్సు : కోమటిరెడ్డి

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావు భేటీ తుస్సుమన్నదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. మోడీ సర్కారుపై అన్ని పార్టీలు ఏకమై అవిశ్వాసం పెడితే...టీఆర్ఎస్ సభ్యులు అడ్డుకోవడంలో మతలబు ఏమిటని కేసీఆర్‌ను మమత ప్రశ్నించినట్టు తనకు తెలిసిందన్నారు. నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా విపక్షాలు ఇచ్చిన అవిశ్వాసంపై చర్చకు పట్టుబడుతుంటే టీఆర్ఎస్ పోడియం వద్దకు వెళ్లి అడ్డుకోవడంతో సభను వాయిదా పడుతుందని చెప్పారు. దీని ఫలితంగా మోడీ వైఫల్యాలపై చర్చ జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు.

కాంగ్రెస్ విప్‌గా టి రామ్మోహన్‌రెడ్డి

ఆలంపూర్ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్ సభ్యత్వం రద్దు కావడంతో ఆయన నిర్వహిస్తున్న విప్ పదవిని ఆ పార్టీకి చెందిన పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డికి అప్పగించారు. సోమవారం ఈమేరకు అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారికి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు ప్రతిపక్ష నేత కె జానారెడ్డి లేఖ రాశారు.

ప్రముఖ వైద్యులు వల్లూరి వెంకటరత్నం మృతి

నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వివేకానంద హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ డాక్టర్ వల్లూరి వెంకటరత్నం (70) మృతి చెందారు. 14 నెలలుగా ఆయన శ్వాసకోశ వ్యాధితో బాధ పడుతూ సోమవారం రాత్రి మరణించారు. బుధవారం ఉదయం 11గంటలకు పంజాగుట్టలోని మహాప్రస్థానం శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయి. డాక్టర్ వెంకటరత్నం రెండేండ్లు ఐర్లండ్, 10 ఏండ్లు ఇంగ్లండ్‌లో ఈఎన్‌టీ వైద్యులుగా పని చేశారు. పేదలకు వైద్య సేవలందించేందుకు 1995లో వివేకానంద ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, 10టీవీ సీఈఓ సజ్జ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు

మొబైల్ ద్వారానే డిగ్రీ ప్రవేశాలకు నమోదు!

- ఆధార్ నెంబర్‌తో అనుసంధానం
- బయోమెట్రిక్‌తో వేలిముద్ర తప్పనిసరి కాదు
- డిగ్రీ కాలేజీలకు జియోట్యాగింగ్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు రిజిస్ట్రేషన్ (నమోదు)ను సులభమైన పద్ధతిని ప్రవేశపెట్టాలని ఉన్నత విద్యామండలి సమాలోచన చేస్తున్నది. గత విద్యాసంవత్సరం డిగ్రీలో ప్రవేశం పొందే విద్యార్థులందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర నమోదు చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముంది. వచ్చే విద్యాసంవత్సరంలో ఈ నిబంధనను సడలించాలని ఉన్నత విద్యామండలి అధికారులు ఆలోచిస్తున్నారు. బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర తీసుకోవాలని ఉన్న నిబంధనను తప్పనిసరి చేయకూడదని నిర్ణయించినట్టు సమాచారం. అందులో భాగంగానే ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్న మొబైల్‌ఫోన్ ద్వారానే డిగ్రీ ప్రవేశాలకు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. విద్యార్థుల ఆధార్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీలన్నింటికీ జియోట్యాగింగ్ చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. విద్యార్థులకు కాలేజీ అడ్రస్, ఆ ప్రాంతం స్పష్టంగా అర్థమయ్యేలా జియోట్యాగింగ్ ఉంటుంది. గతేడాది హైదరాబాద్‌లోని బద్రుకా కాలేజీ అనుకొని రంగారెడ్డి జిల్లాలోని తక్కుగూడలో ఉన్న న్యూబద్రుకా కాలేజీకి ఓ విద్యార్థి వెబ్‌ఆప్షన్ ఇచ్చారు. జియోట్యాగింగ్ వల్ల కాలేజీ అడ్రస్, కోర్సుల వివరాలు దోస్త్ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ మే 8న విడుదల చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించిన విషయం తెలిసిందే. జులై 2వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని ప్రకటించింది.

పాలిటెక్నిక్ విద్యార్థులకు డిగ్రీలో ప్రవేశం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులూ అర్హత సాధించనున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి డిగ్రీ ప్రవేశాలు కల్పించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అర్హతలు, ఒకే సబ్జెక్టులు చదివిన వారికి డిగ్రీ ద్వితీయ సంవత్సరం (లాటరల్ ఎంట్రీ) నేరుగా ప్రవేశాలు కల్పించనున్నారు. అవి లేని పక్షంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. 2016-17, 2017-18 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల సందర్భంగా వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఇంకోవైపు ఇంటర్‌లో సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులకు బీకాంలో 60 శాతం సీట్లు రిజర్వ్ అవుతాయి. సోషల్ సైన్స్ కోర్సులు చదివిన వారికి బీఏలో 50 శాతం సీట్లు రిజర్వ్ చేయబడతాయి. ఇక ఇంటర్ ఎంపీసీ చదివిన వారికే బీఎస్సీ (ఎంపీసీ)లో, బైపీసీ చదివిన వారికే బీఎస్సీ (బీజెడ్‌సీ) సీట్లు అందుబాటులో ఉంటాయి.

సీట్ల తగ్గింపు బాధ్యత విశ్వవిద్యాలయాలకే...

డిగ్రీ కాలేజీల్లో సీట్ల తగ్గింపు బాధ్యత విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యామండలి అప్పగించింది. జీరో ప్రవేశాలున్న కాలేజీలను, 25 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులు చేరిన కాలేజీలను గత మూడేండ్లలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని విశ్వవిద్యాలయాలను ఉన్నత విద్యామండలి కోరింది. కాలేజీలను తనిఖీ చేయాలని నిర్ణయించింది. డిగ్రీ కాలేజీల్లో సీట్లు భారీగా మిగులుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీరో ప్రవేశాలు, 25 శాతం లోపు ప్రవేశాలున్న కాలేజీలను దగ్గరలోని ఇతర కాలేజీల్లో విలీనం చేయలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. 2017-18 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 1,186 ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో 4,48,457 సీట్లున్నాయి. వాటిలో 2017-18 విద్యాసంవత్సరంలో 2,23,427 (49.82 శాతం) మంది విద్యార్థులు చేరారు. ఇంకా 2,25,030 (50.18 శాతం) సీట్లు మిగిలాయి. ఇక డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో 1,092 డిగ్రీ కాలేజీల్లో 4,10,267 సీట్లుంటే, 1,95,555 (47.67 శాతం) మంది చేరారు. ఇంకా 2,14,712 (52.33 శాతం) సీట్లు మిగిలాయి. ఈ ప్రవేశాల ప్రక్రియలో 51 డిగ్రీ కాలేజీల్లో సున్నా అడ్మిషన్లు అయ్యాయి. మరో 150 కాలేజీల్లో 25 శాతం మంది విద్యార్థులు చేరారు. డిగ్రీలో సుమారు 2 లక్షల సీట్లు తగ్గించాలని నిర్ణయించింది.

ఇంటర్ విద్యార్థులకు మెమోతోపాటు దోస్త్ సమాచారం : ఆర్ లింబాద్రి

ఇంకోవైపు ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని నిర్ణయించామని దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి తనను కలిసిన విలేకరులతో చెప్పారు. ఇంటర్ ఫలితాల సమయంలో విద్యార్థులకు ఎస్ఎంఎస్ ద్వారా శుభాకాంక్షలు చెబుతామని అన్నారు. ఇంటర్ విద్యార్థులు మార్కుల మెమో వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నపుడే డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించిన వివరాలు వచ్చేలా సమాచారం వస్తుందని చెప్పారు. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్

ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి

- మే 7 నాటికి కాలేజీల జాబితా సిద్ధం : వేణుగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకరులతో ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండు విడతలు మాత్రమే కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడుతున్నామని వివరించారు. దీనివల్ల విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు మిగులుతున్నాయని చెప్పారు. విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. కొందరు విద్యార్థులు చేరి ఇతర రాష్ట్రాలు, ఇతర కోర్సులకు వెళ్తున్నారని, దీని వల్ల సీట్లు మిగులుతున్నాయని చెప్పారు.

అందుకే మూడో విడత కౌన్సెలింగ్ చేపట్టి ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు భర్తీ చేయాలని నిర్ణయించామని అన్నారు. ఆ తర్వాత మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడతామని చెప్పారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు పూర్తయ్యాయని జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ ఎ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కాలేజీలు లోపాలు సరిదిద్దుకున్నాయని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా ల్యాబ్‌లు, కంప్యూటర్లు ఉన్నాయని, అర్హతలకు అనుగుణంగా అధ్యాపకులున్నారని వివరించారు. నిబంధనలకు అనుగుణంగా లేని కాలేజీలకు ఆ లోపాలు సరిదిద్దుకోవాలని సూచించామని అన్నారు. మే 7వ తేదీ నాటికి ఇంజినీరింగ్ కాలేజీల జాబితా సిద్ధం చేసి ఉన్నత విద్యామండలికి ఇస్తామన్నారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీతో ఆర్ కృష్ణయ్య భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీలోని బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య కోరారు. టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావుతో మంగళవారం బీసీ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదోన్నతుల్లో రిజర్వేషన్ల అంశంపై కృష్ణయ్య వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగబద్ధమైన మండల కమిషన్, చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ చైర్మెన్ నాచియప్పన్ కమిటీ కూడా బీసీలకు ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందని వివరించారు. ఈ మేరకు తక్షణం రాజ్యాంగ సవరణ చేయాలని, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై క్రిమిలేయర్ తొలగించాలని, బీసీ జనాభా ప్రకారం కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని, 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని, సామాజిక భద్రత కోసం బీసీ యాక్ట్‌ను తీసుకురావాలని ఆర్ కృష్ణయ్య కోరారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు హరికిషన్, గుజ్జ కృష్ణ, ఆంజనేయులు, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారంలోకి వస్తే బీసీలకు అధిక ప్రాధాన్యత

- బీజేపీతో కటీఫ్:రమణ వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2019 సాధారణ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు అధిక ప్రాధాన్యతను ఇస్తామని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్.రమణ వ్యాఖ్యానించారు. తమకు బీజేపీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకర్లతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ఎన్నికల పొత్తులు, ప్రభుత్వ పరిపాలన గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది తెలుగుదేశం రాష్ట్ర సమితి(టీడీఆర్‌ఎస్) ప్రభుత్వంగా తాము భావిస్తున్నామని చెప్పారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ప్రథమ లక్ష్యమని అభిప్రాయపడ్డారు. 1983 నుంచి ఎన్నికల్లో ఆయా పార్టీలతో పొత్తుపెట్టుకుంటు వస్తున్నామన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించింది బీజేపీ, కాంగ్రెస్‌లేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో తాను అధికారికంగా ఎప్పుడూ మాట్లాడలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే బీసీలకు తొమ్మిది మంత్రి పదవులు ఇస్తామని తెలియజేశారు. బీసీల పట్ల టీడీపీ విధానాన్ని ప్రకటించాకే, సీఎం కేసీఆర్ వారికి వరాలు ప్రకటిస్తున్నారని అన్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెస్తామని వివరించారు. మోత్కుపల్లి నర్సింహులుపై నిర్ణయం పార్టీ అధినేత చంద్రబాబుదేనని చెప్పారు.

నేటినుంచి జర్నలిస్టుల బస్‌పాస్‌లకు

ఆన్‌లైన్ దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అక్రిటిడేషన్ కలిగిన జర్నలిస్టులకు ఏప్రిల్ 1 నుంచి టీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ ద్వారా బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్విండ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 డిసెంబర్ 31వరకు అక్రిడిటేషన్ కలిగి ఉన్నా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరు మార్చి 21నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఆన్‌లైన్. టీఎస్‌ఆర్టీసీపాస్. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ దర ఖాస్తు చేసుకున్న జర్నలిస్టుల దరఖాస్తులను రాష్ట్రస్థాయి లో సహాయ సంచాలకులు, జిల్లా స్థాయిలో డీపీఆర్‌ఓ ఆమో దం తర్వాత సంబంధిత జర్నలిస్టులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయనున్నట్టు చెప్పారు. ఎంచు కున్న ఆర్టీసీ కౌంటర్‌లో రూ.30చెల్లించి బస్‌పాస్ తీసుకో వాల్సి ఉంటుందన్నారు.

23న యూఎస్‌పీసీ నిరసన ప్రదర్శనలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

2016 వేసవిలో మధ్యాహ్నభోజన పథకం అమలు కోసం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులకు నిబంధనల ప్రకారం 24రోజుల సంపాదిత సెలవులను జమ చేయాలని కోరుతూ ఈనెల 23న అన్ని జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాల ని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపునిచ్చింది. స్పెషల్ సీఎస్‌ను కలిసిన వారిలో యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు సీహెచ్ రాములు, బి కొండల్‌రెడ్డి, రఘుశంకర్‌రెడ్డి, పోచయ్య, షౌకత్‌అలీ, రమేష్, మసూద్ అహ్మద్, రాజన్న, శ్యాంసుందర్‌రెడ్డి, మధుసుధన్‌రావు ఉన్నారు.


గడువులోగా భగీరథ పనులు పూర్తి చేయాలి

- మంత్రులు జోగు, ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

నిర్దేశిత గడువులోగా మిషన్ భగీరథ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, రాష్ట్ర దేవాదాయ, గృహనిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్ష చేశారు. మిషన్ భగీరథ పనుల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న పనుల గడువును తాజాగా నిర్దేశించారు.

ప్రధానంగా మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాల్టీతోపాటు నియోజకవర్గాల్లో నెలకొన్న తీవ్ర మంచినీటి ఎద్దడి నేపథ్యంలో స్థానిక ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలపై మంత్రులు తీవ్రంగా స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులను పూర్తి చేసి మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులకు సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల ఏర్పాటు, మోటర్‌పంపుల బిగింపు, ఇంట్రా విలేజీ పనుల గురించి మంత్రులు ఆరా తీశారు. మిషన్ భగీరథ పనుల వేగవంతం కోసం అవసరాన్ని బట్టి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, వేగంగా పూర్తయ్యేలా చూడాలని అన్నారు.



అవిశ్వాసానికి మద్దతివ్వాలి: జూలకంటి



నవతెలంగాణ-సూర్యాపేట

ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ వైపు ఫెడరల్ ఫ్రంట్ అంటూ మరోవైపు అవిశ్వాసానికి మద్దతునివ్వక పోవడం చిత్తశుద్ధి లేకపోవడమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేటలోని ఎంవీఎన్ భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్‌డీఏ ప్రభుత్వంపై టీడీపీ, వైసీపీ పెట్టిన అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలని సవాల్ విసిరారు. కౌలు రైతులకూ పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.నాలుగు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయమే లక్ష్యంగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను ప్రజలు ఆదరించా లని జూలకంటి కోరారు. సీపీఐ(ఎం) జాతీయ మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభకు 29 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, వేల్పుల వెంకన్న, సిరపంగి నర్సియ్య పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

అధికారంలోకి వస్తాం.. మద్యాన్ని నిషేధిస్తాం..

- ప్రభుత్వపరంగానే విద్యా వైద్యం
- సేద్యానికి రెట్టింపు ప్రోత్సాహం: బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్
- రాష్ట్రంవైపు దేశం చూపు : బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని

నవతెలంగాణ-కరీంనగర్ ప్రతినిధి

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది తామేనని, రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమల్లోకి తెస్తామని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వపరంగానే అందిస్తామని, సేద్యానికి రెట్టింపు ప్రోత్సాహం ఇస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూగార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన బీఎల్ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ రిపోర్టును అమలు చేయాలని తాము డిమాండ్ చేసినప్పటికీ రాష్ట్ర సర్కారు పెడచెవిన పెట్టిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడితోపాటు 50శాతం అదనంగా జోడించి చెల్లిస్తామన్నారు. జిల్లాల్లో దొరల ఆస్పత్రులే ఉన్నాయని, ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ అది వారికి దోచిపెట్టేందుకే ఉపయోగపడుతోందని అన్నారు. కార్పొరేట్ విద్య ధనికులకే పరిమితమైందని వాపోయారు. బీఎల్ఎఫ్ తరపున వచ్చే ఎన్నికల్లో జనాభాప్రాతిపదికన సీట్లను కేటాయిస్తోందన్నారు. సిరిసిల్లలో బినామీ పేర్లతో ఇసుక దందా చేస్తున్న కేసీఆర్ కుటుంబం దళితులను చిత్రహింసలకు గురి చేసిందని విమర్శించారు. నేత కార్మికులకు చేసిన వాగ్దానాలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టడం మినహా చేయగలిగిందేమీ లేదని, అంతా కేసీఆర్ కనుసన్నల్లోనే నడుస్తోందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలను తమ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసి లబ్దిదారుల పేర జాయింట్ అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ శ్రమదోపిడీ విముక్తి సిద్ధాంతకర్త మార్క్స్, కుల నిర్మూలనకు నడుంబిగించిన జ్యోతిబాపూలే, అంబేద్కర్ ఆశయాల పునాదుల మీదే బీఎల్ఎఫ్ నిర్మితమైందని వివరించారు. రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... బీఎల్ఎఫ్ ఆవిర్భావంతో దేశం చూపు తెలంగాణ వైపు మళ్లిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలను కూడా ఒకే తాటిపైకి తీసుకురాగలిగే శక్తి తమకు ఉందన్నారు. అగ్రకుల ఆధిపత్యాన్ని అంతమొందించాలన్న లక్ష్య సాధన కోసం ఏర్పడిన బీఎల్ఎఫ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

సభకంటే ముందు తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ నుంచి సభాస్థలి వరకు భారీ ఎత్తున రోడ్ షో నిర్వహించారు. సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య, జి. రాములు, ఎంసీపీఐ(యూ) నాయకులు అశోక్, టీమాస్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు ఎంవి.రమణ, ఎమ్‌డీ అబ్బాస్, చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్, మహాజన సంఘం నాయకులు వనజ, రేఖ, న్యూ ఇండియా పార్టీ నాయకులు రాజు, పాపులర్ ఫ్రంట్ రాష్ట్ర కోశాధికారి ఎమ్‌డీ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్‌వీ యాక్ట్ సవరణల బిల్లును ఉపసంహరించాలి

- ప్రజారవాణాను పరిరక్షించండి
- బిల్లు ఆమోదం పొందితే ప్రజలందరిపై పెను భారాలు

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధంకండి : రోడ్డు రవాణా కార్మిక సంఘాల కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశ రవాణా రంగాన్ని ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ, డ్రైవర్లను జైలుపాలు చేసే రహదారి భద్రతా సవరణల బిల్లు-2017ను కేంద్రప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా కార్మిక సంఘాల కో-ఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందితే రవాణారంగ కార్మికులకు మాత్రమే నష్టం జరిగదని, ఎడ్లబండ్లు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు, కార్లు నడిపే అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సమస్త ప్రజానీకం కార్మికలోకంతో కలిసి పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది. కార్మిక సంఘాల కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రోడ్డు రవాణారంగాన్ని, ఆర్టీసీలను సర్వనాశనం చేసే ఎమ్‌వి యాక్ట్ బిల్-2017ను ఉపసంహరించాలి' అనే డిమాండ్‌పై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు అధ్యక్షత వహించి, తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రవాణారంగ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, వీఎస్ బోస్ (ఏఐటీయూసీ), శ్రీకాంత్ (ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్-సీఐటీయూ), ఎస్ నర్సింహారెడ్డి (ఐఎన్‌టీయూసీ), కిరణ్ (ఐఎఫ్‌టీయూ), ఎమ్‌కె బోస్ (టీఎన్‌టీయూసీ), రామచంద్రారెడ్డి (తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్), ఎస్ జవహర్‌బాషా(ఏఐఎమ్‌టీసీ), కె హన్మంతు (టీజేఎమ్‌యూ), జి అబ్రహం (ఎస్‌డబ్ల్యుయూ), ఎస్ సురేష్ (బీడబ్ల్యుయూ), బి యాదగిరి (కార్మికపరిషత్), కె వాసుదేవరావు (టీఎస్‌ఆర్టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్) తదితరులు ప్రసంగించారు. ఎమ్‌వి యాక్ట్ సవరణల బిల్లు-2017 అమల్లోకి వస్తే కార్పొరేట్ కంపెనీల గుత్తాధిపత్యంలోకి రోడ్డు రవాణారంగం వెళ్లిపోతుందని చెప్తూ...ఊబర్, ఓలా కంపెనీలను ప్రస్తావించారు. ఈ బిల్లు వల్ల సామాన్య మెకానిక్‌లు మొదలు వాహన విడిభాగాలు అమ్మే వ్యాపారుల వరకు నష్టపోతారని, ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తులు తాకట్టు పెట్టి, బ్యాంకు రుణంతో లారీలు కొంటే ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధన పెట్టి నానా అవస్థలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ బిల్లు చట్టరూపంలోకి రాకముందే రాష్ట్రంలో ఉల్లంఘనల పేరుతో పనిష్మెంట్లు, జరిమానాలను భారీగా పెంచేసి, సామాన్య ప్రజల జేబుల్ని దోచుకుంటూ, జైళ్లపాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజారవాణాను అభివృద్ధి చేయకుండా వ్యక్తిగత వాహనాలు మొదలు అన్నింటినీ ఆదాయమార్గాలుగానే ప్రభుత్వాలు చూస్తున్నాయని చెప్పారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆర్టీఏ కార్యాలయాలు ఉనికిని కోల్పోతాయని, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సహా అన్నీ కార్పొరేట్ ప్రయివేటు సంస్థలే నిర్వహిస్తాయని చెప్పారు. రవాణారంగ కార్మికులకు కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని, బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధులు కేటాయించి పరిరక్షించాలని, రవాణారంగ వెల్ఫేర్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

కార్యాచరణ

రోడ్ సేఫ్టీ బిల్లు-2017ను నిరసిస్తూ దశలవారీ అందోళనలు నిర్వహించాలని రాష్ట్ర సదస్సు తీర్మానించింది. ఈనెల 28న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఏప్రిల్ 5వ తేదీ లోపు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. అఖిలభారత కో-ఆర్డినేషన్ కమిటీ ఎప్పుడు పిలుపిస్తే అప్పుడు సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కార్టూనిజం ఓ కళ

సినీ దర్శకులు బి. నరసింగరావు

- ప్రజావాణిగా నవతెలంగాణ: ఏలె లక్ష్మణ్
- ప్రజాగొంతుకగా నర్సిం, వెంకటేష్ కార్టూన్లు : ఎస్.వీరయ్య
- మీడియా కార్పొరేటీకరణతో తగ్గుతున్న పొలిటికల్ కార్టూనిజం : నర్సిం



కార్టూన్లను తిలకిస్తున్న నరసింగరావు, ఎస్ వీరయ్య, విజయరావు, నర్సిం, వెంకటేష్

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

కార్టూనిజం ఓ కళ అని, పేదల పక్షాన కార్టూన్ గీయాలంటే నిత్యం మెదడుకు పదును పెట్టాల్సిందేనని ప్రముఖ సినీ దర్శకులు బి. నరసింగరావు అన్నారు. నవతెలంగాణ మూడో వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో నవతెలంగాణ కార్టూన్ ఎడిటర్ నర్సిం, కార్టూనిస్టు జె. వెంకటేష్ వేసిన కార్టూన్ల ప్రదర్శనను బి. నరసింగరావు మంగళవారం ప్రారంభించారు. కార్టూన్లను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...సమకాలీన అంశాలపై పట్టులేనిదే కార్టూన్లను చిత్రీకరించలేరన్నారు. ప్రజా సమస్యలపైనా, పాలకుల విధానాలపైనా పాఠకుల్లో ఆలోచన రేకెత్తించే విధంగా వ్యంగ్యాన్ని జోడించి కార్టూన్లు గీయాలంటే మామూలు విషయం కాదన్నారు. రోజువారీగా జరిగే రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై పట్టు ఉండి సామాజిక స్పృహ కలిగిన వారి నుంచే ప్రజల హృదయాలకు హత్తుక్కునే కార్టూన్లు జాలువారుతాయన్నారు. ప్రముఖ చిత్రకారులు ఏలె లక్ష్మణ్ మాట్లాడుతూ.. మీడియా కార్పొరేట్ చేతుల్లో బందీ అయి ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలవాణిని బలంగా వినిపించడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల మీదే వాడిగా, వ్యంగ్యంగా, హాస్యంగా చూపుతూ ప్రభుత్వాలను ప్రశ్నించే రీతిలో నర్సిం కార్టూన్లను గీస్తున్నాడని కొనియాడారు. జేవీ కూడా ప్రతి ఒక్కరూ ఆలోచించే రీతిలో కార్టూన్లను వేస్తున్నాడని అభినందించారు. నవతెలంగాణ ఎడిటర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ..ప్రజా గొంతుకగా నర్సిం, వెంకటేష్ కార్టూన్లు నిలుస్తున్నాయన్నారు. ప్రజలను చైతన్య పరిచేవిధంగా వారు వేస్తున్న కార్టూన్లు పత్రికకు మరింత వన్నె తెస్తున్నాయని కొనియాడారు. నవతెలంగాణ కార్టూన్ ఎడిటర్ నర్సిం మాట్లాడుతూ...మీడియా కార్పొరేటీకరణతో పొలిటికల్ కార్టూనిజం రోజురోజుకీ తగ్గిపోతుందన్నారు. ఎడిటోరియల్‌తో సమాన ప్రాధాన్యత ఇస్తూ పొలిటికల్ కార్టూన్లు వేసేందుకు నవతెలంగాణ ఒక ప్లాట్‌ఫామ్‌గా దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీ ఇన్‌చార్జి గుడిపూడి విజయారావు, నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ గడ్డం రమేష్, ప్రముఖ ఫొటోగ్రాఫర్, ఆర్టిస్టు భరత్ భూషణ్, ఆర్టిస్టు కిరణ్, నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ, జర్నలిస్టు జి.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


28న కలెక్టరేట్ల వద్ద జీపీ కార్మికుల ధర్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్మికులు ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయనున్నారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్ల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, అధ్యక్షులు పి.గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఐ.శ్రీపతిరావు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచి, వాటిని ప్రభుత్వమే బడ్జెట్ నిధుల ద్వారా చెల్లించాలని కోరారు. ఈనెల 28న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త పంచాయతీరాజ్ చట్టంలో గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల వేతనాలకు కూడా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సైతం గతంలో అసెంబ్లీలో మాట్లాడుతూ కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తామని, వచ్చే బడ్జెట్‌లో జనాభా ఆధారంగా ఒక్కో పంచాయతీకి రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు నిధులు కేటాయిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

- వార్డు అభివృద్ధికి నిధులివ్వడం లేదని మనస్తాపం
- ఘటనతో కామారెడ్డి మున్సిపల్ సమావేశంలో ఉద్రిక్తత



నవతెలంగాణ-కామారెడ్డి

తన వార్డులో అభివృద్ధి పనులకు సరిపడా నిధులివ్వడం లేదని ఓ కౌన్సిలర్ ఆత్మహత్యా యత్నం చేశాడు. సమావేశం జరుగుతుండగానే ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించు కునేందుకు యత్నించగా అప్రమత్తమైన తోటి కౌన్సిలర్లు అడ్డుకున్నారు. చైర్‌పర్సన్ పిప్పిరి సుష్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కామారెడ్డి జిల్లా మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన జరిగింది. కామారెడ్డి మున్సిపల్ సమావేశంలో రూ.2కోట్ల 45 లక్షల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సమయంలో 32వ వార్డు కౌన్సిలర్ రామ్మోహన్ (కాంగ్రెస్) తన వార్డు అభివృద్ధికి నిధులివ్వడం లేదని, తనపట్ల వివక్ష చూపుతున్నారని నినదించాడు. వార్డులో సుమారు రూ.కోటీ 50లక్షల వరకు వివిధ రకాల పన్నులు వసూలయ్యాయని, అభివృద్ధికి కావాల్సిన నిధులు మాత్రం కేటాయించడం లేదని వాపోయాడు. మాట్లాడుతూనే ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకున్నాడు. నిప్పంటించుకునేం దుకు యత్నిస్తుండగా తోటి కౌన్సిలర్లు అడ్డుకున్నారు. సమావేశ మందిరం నుంచి బయటకి తీసుకెళ్లారు. కిరోసిన్‌తో ఉన్న శరీరాన్ని నీటితో శుభ్రం చేశారు. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ పిప్పిరి సుష్మ వివరణ కోరగా..'కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని మొత్తం 33 వార్డుల్లో ఏ వార్డుకూ ఇవ్వనన్ని నిధులు ఈ మూడేండ్లలో రూ.కోటీ 61లక్షలను 32వ వార్డుకే ఇచ్చాం. వేరే ఉద్దేశంతోనే కౌన్సిలర్ రామ్మోహన్ ఇలాంటి ప్రయత్నం చేశాడు. ఆత్మహత్యాయత్నం సరిగాకాదు' అని చెప్పారు.

పుస్తకం విలువ వెలకట్టలేనిది

- తిరందాసు గోపి స్మారక గ్రంథాలయం ప్రారంభం

నవతెలంగాణ - భువనగిరి

నాటి స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని నేటి అనేక ఉద్యమాలకు ఊపిరిపోసిన గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాల విలువ వెలకట్టలేనిదని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మెన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్ అన్నారు. కార్మికోద్యమ నాయకులు తిరందాసు గోపి ప్రథమ వర్థంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన తిరందాసు గోపి స్మారక గ్రంథాలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువకులు సెల్‌ఫోన్ల వ్యామోహంలో పడి పుస్తక పఠనానికి దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయాల ద్వారా మేధోశక్తి పెరిగి సమాజ అధ్యయనాన్ని పెంచుతుందన్నారు. ఈ గ్రంథాలయం నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా అభివృద్ధి కావాలని, ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. జీవితాన్ని కార్మిక లోకానికి అంకితమిచ్చిన నాయకుడు గోపి అన్నారు. గోపి ఆశయ సాధన కోసం ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్, బచ్‌పన్ స్కూల్ చైర్మెన్ దిడ్డి బాలాజీ, తిరందాసు గోపి విజ్ఞానకేంద్రం అధ్యక్షులు గద్దె నర్సింహా, ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా మాట్లాడారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ పాటలు పాడారు. కార్యక్రమంలో దుంపల మల్లారెడ్డి ట్రస్టు కార్యదర్శి ఎమ్‌డి.జహంగీర్, తిరందాసు గోపి ట్రస్టు సభ్యులు బట్టుపల్లి అనురాధ, చింతల భూపాల్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, కోశాధికారి అవ్వారు గోవర్ధన్ పాల్గొన్నారు.

మళ్లీ తిష్టవేసేందుకే కుట్రలు

- తెలంగాణకు ఎప్పుడూ అన్యాయమే: విద్యుత్ జేఏసీ నిరసన సభలో వక్తలు



నవతెలంగాణ - సిటీబ్యూరో

'తెలంగాణ ప్రాంతాన్ని, సంపదను ఆంధ్రా ఉద్యోగులు 60 ఏండ్లు దోచుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చినా మళ్లీ ఇక్కడ తిష్టవేసేందుకు కుట్ర పన్నుతున్నారు' అని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు విమర్శించారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఆంధ్రా ఉద్యోగుల చేరికలను వ్యతిరేకిస్తూ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధ లో నిరసన సభ జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మెన్ కారెం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇన్నేండ్లు తెలంగాణ ఆకాంక్షలు, సమస్యలపై ఉద్యోగులు, ప్రజలు నిరంతరం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం వచ్చినా ఇంకా పోరాటం చేయాల్సిన అవసరముందా అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలో రిలీవైన ఆంధ్రా ఉద్యోగుల సమస్యలపై సీఎం కేసీఆర్ ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని కోరారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయడం వల్లే రైతులు, ప్రజలకు 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైందని చెప్పారు. ఈ నెల 25న సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న ఉద్యోగుల మహాగర్జనకు ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. టీ జేఏసీ చైర్మెన్ ఎన్.శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్రం విడిపోయాక ఆంధ్రా ప్రాంతానికి పోతామని ఆప్షన్లు పెట్టుకున్న వారంతా మళ్లీ ఇక్కడికి ఎందు కొస్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల పక్షాన నిలబడాలని కోరారు. జేఏసీ కన్వీనర్ అంజయ్య మాట్లాడుతూ.. 1975 నుంచి 2008 వరకు విద్యుత్ సంస్థలో 371డి అమలు కావడం లేదని, దీని వల్ల ఎందరో ఆంధ్రా ఉద్యోగులు ఇక్కడ రిక్రూట్ అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఈఈఏ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, వీఏవోఏటీ అధ్యక్షులు అశోక్, టీఆర్‌వీకేఎస్ అధ్యక్షులు జాన్సన్, నాయకులు ప్రకాశ్, టీఈఏఈఏ అధ్యక్షులు వినోద్, ముస్లిం మైనార్టీ కార్యదర్శి షరీఫ్, 1104 కార్యదర్శి శంకర్, పీ అండ్ జీ అసోసి యేషన్ అధ్యక్షులు గణేష్, సీజీఎంలు హర ప్రసాద్, మాధురి, శ్రీరామ్‌నాయక్, వివేకానంద పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్‌పై సర్పంచ్ భర్త దాడి

నవతెలంగాణ-దస్తురాబాద్

పింఛన్ విషయంలో జాప్యం చేస్తున్నాడనే ఆగ్రహంతో ఓ పోస్టుమాస్టర్‌పై అధికార పార్టీకి చెందిన సర్పంచ్ భర్త దాడికి దిగాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం...మండల కేంద్రంలోని పోస్టాఫీసులో నవీన్ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, ఇటీవలే రహీం అనే వ్యక్తి మృతిచెందగా ఆయన కుటుంబానికి పింఛన్ రావడంలేదని బాధితులు సర్పంచ్ గంగామణి భర్త రాజేశానికి తెలియజేశారు. దీనిపై నవీన్‌ను నిలదీసిన రాజేశం అనంతరం విచక్షణ కోల్పోయి అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభమైంది. బీపీఎం నవీన్‌పై గ్రామ సర్పంచ్ భర్త దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎన్‌యూజీడీఎస్ నిర్మల్ బ్రాంచ్ కార్యదర్శి నర్సయ్య డిమాండ్ చేశారు. చనిపోయిన వ్యక్తుల పేరుపై డబ్బు లివ్వాలని సర్పంచ్ భర్త రాజేశం వేధించడం సరికాదని తెలిపారు.

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-భీమ్‌గల్


ఆర్థిక సమస్యలు తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రూప్ల తండాలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సుఖేందర్‌రెడ్డి వివరాల ప్రకారం... బడాభీమ్‌గాల్ గ్రామ పరిధిలోని రూప్ల తండాకు చెందిన భూక్యా శంకర్ (33) తన నాలుగెకరాలలో వరి సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయం కలిసి రాక రెండు పంటల్లోనూ నష్టపోయాడు. అలాగే పంట పెట్టుబడి, కుటుంబ పోషణ కోసం అప్పులుచేశాడు. దీనికి తోడు ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తీవ్ర మనోవేదనకు గురై సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నికి తాటి, ఈత వనం ఆహుతి

- 400 చెట్లు దగ్ధం
- మంటలార్పిన ఫైర్ సిబ్బంది

నవతెలంగాణ- చారకొండ

నాగర్‌కర్నూల్ జిల్లాలో సుమారు 400 తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు వనంలో నిప్పు పెట్టారు. ఈ ఘటన చారకొండ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జాతీయ రహదారి సమీపాన సుమారు రెండు వేలకు పైగా తాటి, ఈత చెట్లు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు వనంలో నిప్పు పెట్టడంతో ఆ ప్రాంతమంతా మంటలు వ్యాపించాయి. సుమారు 400 ఈత, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. గీత కార్మికులు మంటలార్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమీప పొలాల రైతులు ఎస్ఐకి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ పోచయ్య సిబ్బందితో ఘటలాస్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలార్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పశుగ్రాసం, చెట్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. కల్వకుర్తి ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.



ఒకే పనికి వేర్వేరు జీతాలా...

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే: మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ డిమాండ్

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చలో అసెంబ్లీ ఉద్రిక్తం
- జె వెంకటేశ్ సహా పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకే పని, ఒకే ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు రెండు రకాల జీతాలు ఇవ్వడం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ అన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018, జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పీఆర్సీతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి అసెంబ్లీకి ప్రదర్శనగా బయలు దేరారు. సుందరయ్య పార్క్ నుంచి కొద్దిదూరం వెళ్లగానే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఉద్యోగులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అసెంబ్లీవైపు వెళ్లాలని ప్రయత్నించడంతో పోలీసులు, ఉద్యోగులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. అసెంబ్లీవైపు వెళ్లడానికి ప్రయత్నించిన ఫెడరేషన్ నాయకులు, ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, నాయకులు భూపాల్, బాల్‌రాం, సైదులు, జె కుమారస్వామి, రమేశ్, జగదీశ్ సహా పలువురిని పోలీసులు అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ఉద్యోగులనుద్దేశించి నాగేశ్వర్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పోరాడుతున్నామని అన్నారు. పాలకులు మారుతున్నారని, పార్టీలు మారుతున్నాయని, అయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ప్రతి పక్షంలో ఉన్నపుడు ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం, అధికారం లోకి వచ్చాక మరిచిపోవడం జరుగుతోందన్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. నాలుగేండ్లయినా ఆ హామీ నెరవేరలేదని అన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తే న్యాయపరమైన ఇబ్బందులొస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఒక రూపాయి ఎక్కువిచ్చినా నష్టం లేదన్నారు. అమెరి కాలో పర్మినెంట్ ఉద్యోగుల జీతాల కంటే కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు ఎక్కువ ఉంటాయని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పాలడు గు భాస్కర్ మాట్లాడుతూ రూ.1.74 లక్షల కోట్ల బడ్జెట్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నయాపైసా కేటాయిం చలేదన్నారు. ధనిక రాష్ట్రం అంటున్నారని, డబ్బంతా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జేబుల్లోకి వెళ్తున్నాయని విమర్శిం చారు. పర్మినెంట్ చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, సెలవులు వర్తింపచేయడం లేదని, మహిళలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయడం లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుటు జె వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెనుకాడొద్దని చెప్పారు. సీఎస్‌ను కలిసి నోటిసులివ్వాలని, ఆ తర్వాత సమ్మెకు దిగాలని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ధాను పోరాటం మరువలేనిది

దున్నేవాడిదే భూమి : మల్లు స్వరాజ్యం



నవతెలంగాణ-దేవరుప్పుల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలిదశ స్ఫూర్తి ధానునాయక్ అని, ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మల్లు స్వరాజ్యం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగినప్పుడు కేసీఆర్‌గానీ, మోడీగా లేరని, ఆ సమయంలో ప్రజలకు అండగా ఉన్నది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ధానునాయక్ 68వ వర్ధంతి ఆయన స్వగ్రామమైన జనగామ జిల్లా దేవరు ప్పుల మండలం ధర్మాపురం గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అంతకు ముందే ధానునాయక్ సోదరుడు ధర్మ్యానాయక్ ఇంటికి వెళ్లి మల్లు స్వరాజ్యం పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో మల్లు స్వరాజ్యం మాట్లాడుతూ ధానునాయక్‌ను చెట్టుకు కట్టేసి అతి కిరాతకంగా తుపాకులతో కాల్చి చంపాన్నారు. అప్పుడు దేశ్‌ముఖ్‌ల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడితే ఇప్పుడు రాజకీయ దొరల పాలనలో రైతులు ఆత్మహ త్యలు చేసుకుం టున్నారన్నారు. ఈ పాలకులు గిరిజనులకు ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలు తున్నదని, భూ కబ్జాలకు కొదవలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లంతా ప్రభుత్వ అను చరులు కావడంతో దోచుకొని దాసుకుంటున్నారన్నారు. ఆనాడు భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడితే నేడు బతుకు దెరువు కోసం పోరాడాల్సి వస్తోందన్నారు. పాలకుల తీరును ఎండగడు తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తరహాలో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంద న్నారు. ట్యాంక్‌బండ్‌పై ధానునాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 'హైదరాబాద్ ధానునాయక్' పేరుతో పోరాట మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మానాయక్ మాట్లాడుతూ గిరిజనుల్ని ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ధానునాయక్ పోరాట స్ఫూర్తితో గిరిజనుల హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, గీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బూడిద గోపి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఇర్రీ అహల్య, జిల్లా కమిటీ సభ్యులు సింగారపు రమేష్, మీట్యానాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టా హక్కు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

నవతెలంగాణ - కొత్తగూడెం

'దొరల కాడ భూమి కొన్నం. సాగు చేసుకుంటున్నాం. కానీ ఇంతవరకూ భూమి మా పేర ఎక్కలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నం. ఎవరూ పట్టించుకోవట్లేదు' అంటూ భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట వెయ్యిమంది రైతులు ఆందోళనకు దిగారు. ఆ భూములకు సంబంధించి వారం రోజుల్లో పట్టాలివ్వకుంటే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజే శారు. ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాటోతు కృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వాంకుడోతు కోబల్ మాట్లాడుతూ... లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ పరిధిలోని సూర్య తండా, దూద్యా తండా, మున్యా తండా, కాల్వ తండా, దుబ్బ తండా, పెద్ద తండా, బావోజీ తండాల కు చెందిన వెయ్యి మంది రైతులు సర్వే నెంబర్ 123/స, 123/ష, 14/ట, 14/ఇ పరిధిలోని సుమా రు రెండు వేల ఎకరాలను అదే ప్రాంతాలకు చెంది న దొర సోమరాజుల వెంకట రామారావు, సోమరా జుల రాంకిషన్ ప్రభు, సోమరాజుల సుశీలబాయి వద్ద కొనుగోలు చేశారన్నారు. కానీ, నేటి వరకూ గిరి జన రైతుల పేరు మీద పట్టాదార్ పాసు పుస్తకాలు రాలేదన్నారు. ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా ఇవ్వ డం లేదన్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహించిన గిరిజన రైతులు ఆందోళన బాటప ట్టారన్నారు. వారం రోజుల్లో అధికారులు స్పందించి పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు నిరాహారదీక్ష దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వాంకుడోత్ అమర్‌సింగ్, భూక్యా వెంకన్న, లక్ష్మా, ధల్‌సింగ్, భూక్యా ధన్‌సింగ్, అజ్మీరా శంకర్, సరిరాము, నూనావత్ అమర్‌సింగ్, బలరాం పాల్గొన్నారు.

'పది' వరకే తెలుగు తప్పనిసరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వరకే తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 12వ తరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తామని గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ నిర్ణయం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. పదో తరగతి వరకే తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మాతృభాష బోధన అమలుకు సంబంధించి తమిళనాడులో విధానాన్ని అధ్యయనం చేసిన అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యారు. పదో తరగతి తరగతి వరకు తెలుగు సబ్జెక్టు బోధించడంపై రూపొందిం చాల్సిన విధివిధానాలపై చర్చించారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం అమలు చేయడం కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తెస్తున్నామని తెలిపారు. మాతృభాష అయిన తెలుగును రక్షించుకోవడం, సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లోనూ తెలుగును సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇంగ్లీషు మీడియంలో చదవడం అందరికీ అని వార్యమవుతున్నదని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దెబ్బ తీయొద్దని పేర్కొన్నారు. అదే క్రమంలో తెలుగు కను మరుగు కావద్దని తెలిపారు. అందుకే ఇంగ్లీష్ మీడియంలో చదివే విద్యార్థులూ తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధన పెడుతున్నామని పేర్కొన్నారు. మొదట ఇంటర్మీడియెట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించామని తెలిపారు. అయితే ఇంటర్ అన్ని విద్యాసంస్థల్లోనూ ఒకే మాదిరిగా లేదని పేర్కొ న్నారు. ఇంటర్‌లో తెలుగును అమలు చేయడం పలు ఇబ్బం దులు వస్తాయని తెలిపారు. తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో మాతృభాష బోధన అమలును పరిశీలించిన తర్వాత మొదటి దశలో పదో తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పని సరి సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

తెలుగు వర్సిటీ, సాహిత్య అకాడమిలకు సిలబస్ రూపొందించే బాధ్యత: తరగతుల వారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్ రూపొందించే బాధ్యతను తెలుగు విశ్వ విద్యాలయం, సాహిత్య అకాడమిలకు అప్పగించామని ముఖ్య మంత్రి కేసీఆర్ తెలిపారు. భాషను కాపాడుకోవడంతోపాటు, మాతృభాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని పేర్కొన్నారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రయివేటు పాఠశాలల్లోనూ తప్పనిసరిగా ఒక తెలుగు పండితుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కెటి రామారావు, జూపల్లి కృష్ణారావు, టి పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, సాహిత్య అకాడమి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, ఎస్‌సీఈఆర్‌టీ అధికారి సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు తలొగ్గిన సర్కార్

- నేటి నుంచి మూల్యాంకనానికి హాజరుకానున్న సంస్కృతం అధ్యాపకులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రభుత్వాలేవైనా కార్పొరేట్ శక్తుల ముందు బలాదూర్. ఇంటర్మీడియట్ వ్యవస్థలో గతంలోనే అనేక మార్పులకు బోర్డు అధికారులు శ్రీకారం చుట్టారు. కానీ ఆ నిర్ణయాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేకపోవడంతో ప్రభుత్వం వారికి అనుకూలంగా విధానాలు మార్చుకుంటూ వస్తోం ది. తెలుగును కచ్చితంగా ఇంటర్మీడియట్ వరకు అమలు చేస్తామని, అందుకు అసెంబ్లీలో చట్ట సవరణ చేస్తున్నామని గతంలో సీఎం కేసీఆర్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ప్రస్తుతం టెన్త్ వరకే తెలుగు అమలు చేస్తామని, ఇంటర్మీడియట్‌కు ఆ నిబంధన వర్తించదని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పిన విషయం విదితమే. ఈ ప్రకటన వెనుక కార్పొరేట్ కళాశాలల హస్తమున్నట్టు స్పష్టమౌతోంది. సీఎం మొదట తీసుకున్న నిర్ణయంపై ఇంటర్మీడియట్ పరీక్షల అనంతరం సంస్కృతం అధ్యాపకులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్‌లో సంస్కృతం ఉంచాలని డిమాండ్ చేస్తూ మూల్యాంకన శిబిరాన్ని 15 రోజుల నుంచి బహిష్కరిస్తున్నారు. ఈ 15 రోజులు ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకను గుణంగా వ్యవహరించింది. అందులో భాగంగానే మంగళవారం కేసీఆర్ తెలుగుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పదవ తరగతి వరకే కచ్చి తంగా తెలుగు అమలు చేస్తామని, ప్రయివేటు పాఠశాలలకు కూడా ఇది వర్తిస్తుందని, ఈ నిబంధన అమలు చేయని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమ్మె లోనున్న అధ్యాపకుల తరపున చినజీయర్‌స్వామి, సీఎం గురువు అయిన మృత్యుంజయశర్మ చొరవ తీసుకొని సంస్కృతం భాషను కాపాడాలని, ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని ఉంచాలని మధ్యవర్తిత్వం చేయడంతో ముఖ్యమంత్రి నిర్ణయాన్ని మార్చుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. సంస్కృతంలో అయితే అధిక మార్కులు స్కోర్ చేసే అవకాశం ఉన్నందున దీని కోసం కార్పొరేట్ శక్తులు పట్టుపడుతున్నట్టు తెలుస్తోంది.

నేటి నుంచి సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం: ఈ నెల ఏడు నుంచి ప్రారంభం కావాల్సిన ఇంటర్మీడియట్ సంస్కృతం మూల్యాంకనాన్ని రాష్ట్రంలోని అన్ని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో అధ్యాపకులు బహిష్కరిస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం తెలుగుపై టెన్త్ వరకే అనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో, సంస్కృతం అధ్యాపకులందరూ బుధవారం నుంచి మూల్యాంకన శిబిరానికి హాజరు కానున్నారు.

సభ్యత్వాన్ని రద్దు చేసిన వాళ్లు.. ఎందుకు అరెస్టు చేయించలేదు: టీ మాస్



మాట్లడుతున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసన మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌పై అసెంబ్లీలో దాడి చేసిన ఘటనకు సంబంధించి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వాన్ని రద్దు చేసిన ప్రభుత్వం, స్పీకర్.. వారిని ఇప్పటి వరకూ ఎందుకు అరెస్టు చేయించ లేకపోయారని టీ మాస్ ఫోరం ప్రశ్నించింది. వారిని తక్షణం అరెస్టు చేయించాలని ఫోరం చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీ మాస్ రాష్ట్ర నేతలు కిల్లె గోపాల్, పైళ్ల ఆశయ్య, శ్రీరాంనాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పీకర్‌కు ఉన్న విశేషఅధికారాల ప్రకారం.. ఏ సభ్యుడికైనా ఏడాది వరకూ జైలు శిక్ష విధించే అధికారం ఉంటుందని తెలిపారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా.. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల సభ్యత్వాన్ని రద్దు చేయటం శోచనీయమన్నారు. హై కోర్టు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించిందని గుర్తుచేశారు. గోపాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చర్చకు వేదిక కావాల్సిన అసెంబ్లీ.. ఇప్పుడు దాడులు, దౌర్జన్యాలు, రెచ్చగొట్టుడు చర్యలు, ప్రేలాప నలకు వేదిక కావటం శోచనీయమన్నారు. దీన్నిబట్టి మన నాయకులు విలువలను ఎంతగా దిగజారుస్తున్నారనే విషయం విదితమవుతున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో విలువలతో కూడిన రాజకీయాల కోసం టీ మాస్ కృషి చేస్తుందని తెలిపారు. ఆశయ్య మాట్లాడుతూ.. అగ్రవర్ణ అహంకారంతో స్వామిగౌడ్‌పై దాడి చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో చర్చించాల్సిన రైతులు, విద్యార్థులు, కార్మికులు, మహిళల సమస్యలన్నీ పక్కకు పోయయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా మన ప్రజా ప్రతినిధులు చట్ట సభల గౌరవాన్ని దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాల కోసం రైల్‌రోకో

ముంబయి: రైల్వేలో అప్రెంటీస్ పూర్తిచేసి... నియా మకాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులంతా మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మతుంగ, ఛత్రపతి శివాజీ టెర్మినల్ స్టేషన్ల మధ్య నిరసనలకు దిగడంతో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వీరంతా రైల్వేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగార్థుల ఆందోళనల నేపథ్యంలో అధికారులు 60కి పైగా లోకల్ రైళ్లను రద్దు చేశారు. ఉదయం అంతా కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వెళ్లే కీలకమైన సమయంలో దాదాపు పెద్ద సంఖ్యలో విద్యార్థులు మతుంగ, దాదర్ స్టేషన్ల మధ్య సబర్బన్ సర్వీసులను అడ్డుకున్నారు.మతుంగ నుంచి ఛత్రపతి శివాజీ టెర్మినల్ మధ్య సబర్బన్ సర్వీసులతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా నిలిపేయాల్సి వచ్చిందని, ఈ మార్గంలోని నాలుగు లైన్లలోనూ రాకపోకలు ఆపేసినట్టు అధికారులు తెలిపారు. గత నాలుగేండ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఓ ఆందోళనకారుడు తెలిపారు. పది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మళ్లీ అలాంటి పరిస్థితి రాకూడదనే ఆందోళన చేస్తున్నామని అన్నారు.రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఇక్కడికి వచ్చి తమ డిమాండ్లను నెరవేర్చాలని.. అంత వరకూ ఆందోళన విరమించేది లేదని వెల్లడించారు. ఉద్యోగాల విషయంపై ముంబయి డివిజన్ డివిజినల్ మేనేజర్‌ను పలుమార్లు అభ్యర్థించినా ఫలితం లేదని తెలిపారు.

కాకులను కొట్టి..

కొండూరి రమేశ్‌బాబు

రాష్ట్రంలో లక్షలాది ఎకరాల అసైన్డ్ భూమి భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నేతల చేతుల్లో ఉన్నది. కండబలం, అధికార బలంతో దళితుల భూమిని ఆక్రమించుకున్న పెద్దలు వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు దశాబ్దాల కాలం నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొన్ని జిల్లాల్లో కేవలం నామమాత్రపు ధర చెల్లించి అసైన్డ్ భూములను కొనుగోలు చేయగా మరికొన్ని జిల్లాల్లో కవులు పేరుతోనూ, అభివృద్ధి పేరుతోనూ వారి భూములను ఆక్రమించుకుని తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. 1977 లో అమల్లోకి వచ్చిన చట్టం ప్రకారం అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లను ప్రభుత్వం నిషేధించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆక్రమణదారులకు రెవిన్యూ ఎన్‌ఓసీలు ఇవ్వటం, రిజిస్ట్రేషన్ అధికారులు వాటిని రిజిస్ట్రేషన్ చేయటం జరిగింది. దీనితో లక్షలాది మంది దళితులు భూమిని కోల్పోయారు. భూమిని కోల్పోయిన పలువురు దళితులు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే అటువంటి కేసులు 4,135 కేసులు వివిధ న్యాయస్థానాల్లో ఉన్నాయి. తాత్కాలిక అవసరాల కోసమో, ఒత్తిడితోనో దళితులు తమకు కేటాయించిన అసైన్డ్ భూమిని అమ్మినా అటువంటి లావాదేవీలను రద్దు చేసి మొదటి తప్పుగా భావించిన తిరిగి ఆ భూమిని ఆ రైతులకే కేటాయించాలనే నిబంధన కూడా 1977 అసైన్‌మెంట్ చట్టంలో ఉన్నది. దళితుల వద్ద ఆక్రమించుకున్న అసైన్డ్ భూములకు ఇటీవల విలువ పెరిగిపోవటంతో వాటిని తమకు క్రమబద్ధీకరించాలంటూ కొందరు బడా వ్యాపారులు ప్రభుత్వంపై ఇటీవల ఒత్తిడి పెంచారు. రెవిన్యూ రికార్డుల ప్రక్షాళణ పేరుతో ఇటీవల జరిగిన సర్వేలో అసైన్డ్ భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయో తెలిపే వివరాలను పొందుపరచారు. దీని ఆధారంగా అక్రమణ దారులకు, అక్రమార్కులకు వీటిని దారాదత్తం చేయటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెమో నంబర్ 241191 అసైన్1 (3/2017)-1 తో జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అసైన్డ్ భూములు ఎవరి వద్ద ఉంటే వారికి క్రమబద్ధీకరించాలనే ఈ ఉత్తర్వులు కలకలం సృష్టించాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని ముందుగా 2017 కు పూర్వం కొనుగోలు చేసిన వారికే వర్తింప చేయాలని నిర్ణయించారు. ఇటీవల ఈ నిబంధన కూడా సడలించి 2017 డిసెంబర్ 31 వరకూ అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన వారందరికీ ఈ నిబంధన వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 1977 అసైన్డ్ చట్టంలోని 4(1) (బి) పరిచ్ఛేదానికి మార్పులు తీసుకు రావటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.

చేతులు మారిన అసైన్డ్ భూములు...

దళితుల భూములే దళితేతరులు కొనుగోలు చేయటం ఆక్రమించుకోవటం జరిగింది. చట్ట ప్రకారం వారి భూమిని కాపాడి అక్రమంగా కొనుగోలు చేసిన వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం అది చేయకపోగా భూమిలేని నిరుపేదల పేరుతో బడాబాబులకు ఈ భూమిని కట్టబెట్టటానికే చట్ట సవరణ చేస్తున్నది. భూమిలేని నిరుపేదలకు భూమిని పంచే అసైన్‌మెంట్ చట్టం 1954 జూన్ 6న అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం 50 శాతం దళితులకు, 25 శాతం బలహీనవర్గాలకు, మరో 25 శాతం ఇతర బలహీరవర్గాలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1956 నుంచి ఏడు ధపాలుగా రాష్ట్రంలో 13,88,530 మంది బలహీనవర్గాల వారికి 22,55,617 ఎకరాలను ప్రభుత్వం ఇచ్చింది. వీరిలో దళితులే ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 84,706 మంది 2,41,749 ఎకరాల భూమిని అక్రమంగా కొనుగోలు చేసినట్టు స్పష్టమవుతున్నది. అనధికారిక లెక్కల ప్రకారం ఈ భూమి ఐదు లక్షల ఎకరాల వరకూ ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలోనే 74,000 ఎకరాల అసైన్డ్ భూమిని భూస్వాములు, రియల్టర్లు కొనుగోలు చేశారు.

నాడు వ్యతిరేకం.. నేడు అనుకూలం..

దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను ప్రభుత్వ అవసరాల కోసం వెనక్కి తీసుకునే విధంగా 1977 అసైన్డ్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 2006 లో సవరించింది. ఆనాటి రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బిల్లును సభలో ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ, సీపీఐ (యం) తో పాటూ టీఆర్ఎస్ కూడా వ్యతిరేకించింది. కానీ ఉద్యమపార్టీగా చెప్పుకుంటున్న టీఆర్ఎస్ ఇప్పుడు ఇదే చట్టానికి సవరణ చేయటానికి ప్రయత్నిస్తున్నది. 1977 అసైన్‌మెంట్ చట్టంలో పొందుపరచిన అసైన్డ్ భూముల బదలయింపుకు సంబంధించిన నాలుగవ అధికరణం మార్చటానికి నిర్ణయించింది.

కేంద్ర సెస్‌చట్టంలోని స్కీములను అమలు చేయాలి

- సంపన్నులకు ఊడిగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : సీపీఐ(ఎం) శాసనసభపక్ష నేత సున్నం రాజయ్య
- కార్మికభవన్‌ను ముట్టడించిన భవన నిర్మాణకార్మికులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వామపక్ష పార్టీల ఎంపీల ఒత్తిడితో 1996లో వచ్చిన కేంద్ర సెస్‌చట్టాన్ని, తెలంగాణ ప్రభుత్వం అమలు చేయకపోవడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) శాసనసభపక్ష నేత సున్నం రాజయ్య అన్నారు. కర్నాటక, కేరళ, హర్యాన, ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్ తదితర రాష్ట్రాల మాదిరిగానే చట్టంలోని పథకాలన్నీ తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సెస్ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ కార్మికశాఖ కమిషనరేట్‌ను మంగళవారం భవన నిర్మాణ కార్మికులు ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సున్నం రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారనీ, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చి, చర్చ జరపాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సంపన్నులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. బడ్జెట్ చర్చల్లో తప్పనిసరిగా భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని చెప్పారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయనీ, నిర్మాణ కార్మికుల పోరాటాలకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ మాట్లాడుతూ...కార్మిక అడ్డాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో రూ.1300కోట్ల నిధులు ఉన్నాయనీ, వాటిని కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. పలు రాష్ట్రాల్లో పనిముట్లు, సైకిల్, మోడల్ సైకిల్, కండ్లజోడు వంటి పరికరాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకునే, టీఆర్ఎస్ పాలకులు కేంద్ర చట్టంలోని అన్ని స్కీములను అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగూరు రాములు, ఆర్ కోటంరాజు మాట్లాడుతూ...రాష్ట్రంలో 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికులుంటే, కేవలం తొమ్మిదిన్నర లక్షల మంది కార్మికులు మాత్రమే పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. కార్మిక శాఖ అధికారులు అడ్డాల్లోకి వెళ్లి అందరినీ బోర్డులోకి తీసుకురావాల్సి ఉన్నా, వారు పట్టించుకోవడం లేదని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల రెన్యూవల్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 60 ఏండ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.3వేల పింఛన్ ఇవ్వాలనీ, కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూము ఇండ్లు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే మే 7న డిమాండ్ బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామనీ, జూలై 9న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా భవన మరియు ఇతర నిర్మాణ బోర్డు కార్యదర్శి రవీందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. 2009 నుంచి రెన్యూవల్ చేసుకోని కార్మికులు ఇప్పుడు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నామనీ, దీన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ధర్నాకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి ప్రసాద్, టీమాస్ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కురుమయ్య, జి రాములు, కోటేశ్వరరావు, ఎస్‌కే జమాల్, బ్రహ్మయ్య, కోశాధికారి ఎస్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



భార్యాపిల్లల్ని చంపిన దుర్మార్గుడు

- వివాహేతర సంబంధమే కారణం?
- హైదరాబాద్‌లోని మీర్‌పేటలో ఘటన

నవతెలంగాణ - మీర్‌పేట్

తాళి కట్టిన భర్త కనికరం లేకుండా ప్రవర్తించాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కట్టుకున్న భార్యను, కన్న పిల్లల్ని గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. డీసీపీ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం...మీర్‌పేట్‌లోని సాయిప్రభ హోమ్స్‌కాలనీలో నివాసముండే తుమ్మ మహేష్, జ్యోతి దంపతుల మొదటి కూతురు వరలక్ష్మి(28)కి తొమ్మిదేండ్ల కిందట తెల్లాపూర్ లింగంపల్లికి చెందిన సంగిశెట్టి సురేందర్ (37)తో పెండ్లి అయింది. వారికి కొడుకు నితీష్(5), కూతురు యశస్విని (3) ఉన్నారు. సోమవారం నాడు వరలక్ష్మి భర్త, పిల్లలతో కలిసి పుట్టింటి వచ్చింది. మంగళవారం ఉదయమే మామ, బామ్మర్దిని నిద్రలేపి 'కల్లు తీసుకురండి తాగుదాం' అని కల్లుకు సురేందర్ పంపించాడు. సరుకులు తీసుకురమ్మని చెప్పి అత్తనూ బయటకు పంపాడు. ఆ సమయంలో భార్య, కూతురు ఇంకా నిద్రిస్తూనే ఉన్నారు. ఇదే అదునుగా భావించిన సురేందర్ ముందుగా భార్యను, తర్వాత కూతుర్ని గొంతునులిమి హత్య చేశాడు. బయట ఆడుకుంటున్న నితీష్‌ని ఇంట్లోకి పిలిచాడు. ఫోన్‌లో వీడియో గేమ్స్ చూపిస్తూ దగ్గరకు తీసుకుని గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది. భార్య, పిల్లల్ని కిరాతకంగా హత్య చేసిన సురేందర్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని తెలిసింది. ఈ విషయంపై భార్య పలుమార్లు మందలించినట్టు తెలిసింది. దీంతో భార్య, పిల్లల్ని ఎలాగైనా వదిలించుకోవాలని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు.

నవచిత్రం

75 కోట్లు.. దట్ ఈజ్ తలైవా


రజనీకాంత్

రజనీకాంత్ సినిమా విడుదలవుతుందంటే అటు అభిమానుల్లో, ఇటు సినీ వర్గాల్లో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక మార్కెట్ వర్గాల్లో ఆ క్రేజ్‌కు ఆకాశమే హద్దు. రజనీ చిత్రాల శాటిలైట్, డబ్బింగ్ రైట్స్ దక్కించుకునేందుకు భారీ పోటీ ఉంటుంది. ఈ నేపథ్యంలో రజనీ తాజాగా నటిస్తున్న 'కాలా' చిత్ర శాటిలైట్ రికార్డ్ స్థాయిలో అమ్ముడుపోయాయని సమాచారం. ఓ ప్రముఖ ఛానెల్ ఏకంగా 75 కోట్ల రూపాయలతో అన్ని భాషల శాటిలైట్ హక్కులను దక్కించుకుందట. రజనీ నటిస్తున్న మరో చిత్రం '2.0' కూడా 110 కోట్లకు శాటిలైట్ హక్కులు అమ్ముడైన విషయం విదితమే. 'కబాలి' తర్వాత పా.రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'కాలా'. ముంబయి మాఫియా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈచిత్రంలో హ్యూమా ఖురేషి కథానాయికగా నటిస్తోంది. ఏప్రిల్ 27న ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఇటీవల విడుదలైన 'కాలా' టీజర్ 30 మిలియన్ వ్యూస్‌ను దక్కించుకోవడంతో ఈ చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ చిత్రాన్ని వండర్‌బార్ పతాకంపై ధనుష్ నిర్మిస్తున్నారు.

విజయానందంలో కిరాక్ పార్టీ..


శరణ్ కొప్పిశెట్టి, సంయుక్త హెగ్డే, బ్రహ్మాజీ, అనిల్ సుంకర, నిఖిల్

'నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్ రాబట్టిన చిత్రంగా 'కిరాక్ పార్టీ' నిలిచింది' అని నిర్మాత అనిల్ సుంకర్ అన్నారు. నిఖిల్, సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా హీరోహీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఇటీవల విడుదలైన ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మంగళవారం చిత్ర బృందం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో నిఖిల్ మాట్లాడుతూ, "ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'కేశవ' చిత్రాలను మించి ఓపెనింగ్స్ ఈ చిత్రానికి రావడం ఆనందంగా ఉంది. ఇందులోని నా నటనను చూసి అందరూ చాలా బాగుందని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఈ చిత్రానికి వచ్చినన్ని మెసేజ్‌లు ఎప్పుడూ నాకు రాలేదు. కాలేజ్ విద్యార్థులు సినిమాను బాగా ఆదరిస్తున్నారు. సినిమా గురించి పాజిటివ్ టాక్ వైఫైలా బాగా విస్తరిస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో పలు థియేటర్లకు వెళ్ళాం. 80శాతం స్టూడెంట్సే ఉన్నారు. సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వారికి థ్యాంక్స్ చెప్పేందుకు నేటి (బుధవారం) నుంచి రాజమండ్రి, ఖమ్మం, వైజాగ్ వంటి తదితర ప్రాంతాల్లో సక్సెస్ టూర్ చేపట్టబోతున్నాం' అని అన్నారు.
'మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ అయ్యింది. ఓవర్సీస్‌లో కూడా మంచి కలెక్షన్లున్నాయి. మొత్తంగా హాఫ్ మిలియన్ డాలర్లు సాధిస్తుందని నమ్ముతున్నాం. సినిమాకు వస్తున్న స్పందన పట్ల చాలా హ్యాపీగా ఉన్నాం. రెండోవారంలోనూ ఇదే స్థాయిలో మంచి ఆదరణ పొందుతుందని ఆశిస్తున్నాం. ప్రేక్షకులకు థ్యాంక్స్ చెప్పేందుకు ఏపీ, తెలంగాణలో సక్సెస్‌టూర్ ప్లాన్ చేశాం' అని నిర్మాత అనిల్ సుంకర తెలిపారు. 'విద్యార్థులు సినిమాను ఓన్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని దర్శకుడు చెప్పారు. 'యంగ్ టీమ్ కలిసి చేసిన చిత్రమిది. చాలా రోజుల తర్వాత 'హ్యాపీడేస్'లాంటి సినిమా వచ్చిందని అందరూ మెచ్చుకోవడం చాలా సంతోషంగా ఉంది' అని బ్రహ్మాజీ తెలిపారు.

గులేబకావళి పాటల సందడి



'గులేబకావళి' చిత్రం ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన చిత్రం 'గులేబకావళి'. కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తమిళంలో విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించిన ఈ చిత్ర తెలుగు ఆడియో లాంచ్ సోమవారం జరిగింది. అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బిగ్ సీడీను, ఎన్.శంకర్ ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, 'టైటిల్‌లోనే సక్సెస్ కనిపిస్తుంది. గతంలో ఇదే టైటిల్‌తో ఓ సినిమా విడుదలై అఖండ విజయం సాధించింది.ప్రభుదేవా మల్టీటాలెంటెడ్ పర్సన్. చిన్నా, పెద్ద సినిమాలకు తన వంతు సహకారాన్ని నిర్మాత మల్కాపురం శివకుమార్ అందిస్తున్నారు. ఆయన విడుదల చేస్తున్న ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అని అన్నారు. 'మిస్టరీ, కామెడీ, సస్పెన్స్ సహా అన్నీ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. ఇలాంటి జోనర్ సినిమాలు చాలా వరకు పెద్ద విజయాలనే సొంతం చేసుకున్నాయి. ఈ సినిమా సైతం విజయం సాధిస్తుంది' అని ఎన్.శంకర్ తెలిపారు.
"సింగం2' తర్వాత సినిమాలు చేయడం ఆపేద్దామనుకున్నా. సినిమా సక్సెస్ అయితే నెక్ట్స్ ఏంటని అడుగుతారు. ఫ్లాప్ అయితే ఎవరూ కనిపించరు. కానీ పది మందికి ఆదరణ చూపే ఇండస్ట్రీ ఇది. నాకు తమిళం రాకపోయినా ఈ సినిమా చూసి ఎంజాయ్ చేశా. తెలుగు వారికి తప్పకుండా నచ్చుతుందనిపించి విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 6న గ్రాండ్ రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'దర్శకుడిగా నాకిది తొలి చిత్రం. తెలుగు వారిని ఆకట్టుకుంటుందని నమ్ముతున్నా' అని చిత్ర దర్శకుడు కళ్యాణ్ చెప్పారు.


రకుల్ ప్రీత్ సింగ్

మరో అరుదైన గుర్తింపు..


శ్రీదేవి


శశికపూర్

ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక 90వ ఆస్కార్ అవార్డు వేడుకల్లో దివంగత బాలీవుడ్ లెజెండ్స్ శ్రీదేవి, శశికపూర్‌ను స్మరించుకున్న విషయం విదితమే. తాజాగా వీరిద్దరికి మరో అరుదైన గుర్తింపు లభించనుంది. న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ ఇద్దరిని గుర్తు చేసుకోబోతున్నారు. మే 7 నుంచి 12 వరకు న్యూయార్క్‌లో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో గౌరవ సూచకంగా శ్రీదేవి నటించిన 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రాన్ని, శశికపూర్ నటించిన 'ది హౌస్‌హోల్డర్', 'షేక్స్పియర్ వాల్లా', 'హీట్ అండ్ డస్ట్' ఇంగ్లీష్ చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. శశి కపూర్ నటించిన ఈ చిత్రాలను హాలీవుడ్ నిర్మాణ సంస్థ మర్చంట్ ఐవరి నిర్మించింది.

అభిమానుల కోసం..

'నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం అభిమానులే. నా కెరీర్‌కి సంబంధించి ప్రతి అడుగులోనూ వారిది సముచిత పాత్ర ఉంది. అందుకే వారందరికీ మరింత చేరువగా ఉండాలని ఓ ప్రత్యేక యాప్ తయారు చేయించాను' అని అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను అనుసంధానం చేస్తూ ఉండే ఈ యాప్ గురించి రకుల్ చెబుతూ, 'ఇందులో నాకు సంబంధించి ఎక్స్‌క్లూజివ్ విశేషాలు, వివరాలు ఉంటాయి. అభిమానులతో లైవ్ ఛాట్ చేసేందుకు చాలా అనుకులంగా ఉంటుంది' అని తెలిపింది. రకుల్ ప్రస్తుతం సూర్య సరసన 'ఎన్‌జీకే', కార్తీతో ఓ సినిమా, శివకార్తికేయన్‌తో మరో సినిమా, హిందీలో అజయ్ దేవగణ్‌కి జోడీగా ఓ సినిమాలో నటిస్తోంది.


అమైరా దస్తూర్

బంపర్ ఆఫర్..

'ఇసాఖ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి కథానాయికగా అడుగుపెట్టింది అమైరా దసూర్. ఆ తర్వాత 'అనేగన్' చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చి, డెబ్యూ కథానాయికగా సైమా అవార్డునందుకుంది. అట్నుంచి 'కుంగ్ ఫూ యోగా' ఇంగ్లీష్ చిత్రంలో నటించే ఛాన్స్ అందుకుంది. ఇటీవల తెలుగులో 'మనసుకు నచ్చింది' చిత్రంతో మెప్పించిన అమైరా తాజాగా బాలీవుడ్‌లో ఓ బంపర్ ఆఫర్‌ను అందుకున్నట్టు తెలుస్తోంది. కంగనా రనౌత్, రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న 'మెంటల్ హై క్యా' చిత్రంలోని ఓ కీలక పాత్ర కోసం అమైరాను ఎంపిక చేశారట. ఏక్తా కపూర్ నిర్మించే ఈ చిత్రానికి దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు తనయుడు ప్రకాష్ కోవెలమూడి దర్శకత్వం వహించడం విశేషం. త్వరలోనే పట్టాలెక్కనున్న ఈ చిత్ర పోస్టర్స్ ఇప్పటికే హల్‌చల్ చేస్తున్నాయి. అమైరా ప్రస్తుతం 'రాజుగాడు', 'ఊడి ఊడి ఉజైకనుమ్' చిత్రాల్లో నటిస్తోంది.

టెంపర్ రీమేక్‌లో..!


సారా అలీఖాన్

సైఫ్ అలీ ఖాన్ తనయ సారా అలీఖాన్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ 'కేథార్‌నాథ్' చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. సుశాంత్ సింగ్ రాజ్‌పూత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం విడుదలవ్వక ముందే సారా అలీఖాన్ మరో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌కి జోడీగా 'సింబా' చిత్రంలో నటించనుంది. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'టెంపర్' చిత్రానికి ఇది రీమేక్. ఈ విషయాన్ని నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నారు. 'ఊహాగానాలకు తెరపడింది. రోహిత్ శెట్టి రూపొందించిందే 'సింబా' చిత్రంలో కథానాయికగా సారా అలీ ఖాన్‌ను ఫైనల్ చేశాం. ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 28న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని కరణ్ ట్వీట్ చేశారు. 'అద్భుతమైన ఫ్రెష్ ఫేస్, సూపర్‌స్టార్ ఎనర్జీ, పెద్ద ఫిల్మ్ మేకర్స్ కలిసి తీయబోతున్న ఈ సినిమా ఇప్పటికే పెద్ద బ్లాక్‌బస్టర్' అని చిత్ర బృందం పేర్కొంది. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానున్నట్టు తెలుస్తుంది. రోహిత్ శెట్టి, కరణ్ జోహార్ సంయుక్తంగా సినిమాను నిర్మించనున్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్..

కె.గోవర్ధన్‌రావు దర్శకత్వంలో వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై హేమలతారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నిన్నే చూస్తు'. శ్రీకాంత్, నితిన్, హేమలతా (బుజ్జి) హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి నిర్మాత హేమలతారెడ్డి మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ అద్భుతమైన పాటలను అందించారు. సినిమాకు టైటిల్ సాంగ్ 'నిన్నే చూస్తు' హైలైట్‌గా నిలుస్తుంది. ఈ పాట చాలా శ్రావ్యంగా ఉంటుంది. ఇలాంటి అందమైన పాటకు మలేషియాలోని అందమైన లొకేషన్లు ఊపిరి పోశాయి. పాట అద్భుతంగా వచ్చింది. నృత్య దర్శకురాలు రేఖ అందించిన కొరియోగ్రఫీ మరో హైలైట్. మంచి కుటుంబ కథా చిత్రంగా సినిమాను తెరకెక్కిస్తున్నాం. సుహాసిని, సుమన్, భానుచందర్ ముఖ్య పాత్రల్లో ఆకట్టుకుంటారు. వారితో కలిసి నటించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ప్రస్తుతం మూడో షెడ్యూల్ జరుగుతోంది. దీంతో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది' అని చెప్పారు. కాశీ విశ్వనాథ్, షియాజీ షిండే, రజిత, విద్య లతా, నిహాల్, వేణు, ఫణి, రమణ్, వెన్నెల కిషోర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: ప్రసాద్ ఈదర (శంకర్ కుమార్), ఎడిటింగ్: నాగిరెడ్డి.వి.


'నిన్నే చూస్తు' చిత్రంలో శ్రీకాంత్, హేమలత



పోటీ పత్రికలకు దీటుగా ప్రజల పత్రికగా విశేష పాఠకాభిమానాన్ని పొంది విజయవంతంగా నాలుగవ సంవత్సరంలోకి 'నవతెలంగాణ' అడుగిడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖులు తెలిపిన శుభాకాంక్షలు..

సమగ్ర సమాచారం..



మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడంలో నవతెలంగాణ ముందుంటుంది. సినిమాతోపాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలతోపాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, టెక్నాలజీ ఇలా వివిధ రంగాల్లో ప్రజల్లో మంచి అవగాహన కల్పిస్తుంది. అన్ని రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పాఠకులకు అందిస్తున్న దిన పత్రిక నవతెలంగాణ నాలుగవ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నా శుభాకాంక్షలు. - రాజేంద్రప్రసాద్ (హీరో)

నాకు బాగా నచ్చిన పత్రిక..




పిల్లలు, పెద్దలు, యూత్, మహిళలు ఇలా అందరికి కావాల్సిన అంశాలు, సమాచారాన్ని నవతెలంగాణ దిన పత్రికలో చూడొచ్చు. నాకు ఈ పత్రిక బాగా నచ్చుతుంది. ఇలానే అన్ని అంశాలపై విశ్లేషణాత్మక కథలను అందిస్తూ ప్రజలను ఎడ్యూకేట్ చేసే దిన పత్రికగా ఉంటుందని కోరుకుంటూ నవతెలంగాణ బృందానికి శుభాభివందనాలు.
- బ్రహ్మానందం (హాస్యనటుడు)

వాస్తవాలకు ప్రతిరూపం..



ఈ గ్లోబలైజేషన్ మాయా ప్రపంచంలో నవతెలంగాణ దిన పత్రిక వాస్తవాలకు ప్రతిరూపంగా నిలిచింది. పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ ప్రజాశక్తిగా అందరి దృష్టి ఆకర్షిస్తుంది. కార్పొరేట్ మీడియా దాచేస్తున్న వాస్తవాలను వెలికి తీస్తూ ప్రజలను మేల్కొలుపుతున్న నవతెలంగాణ మరింత నూతనత్వంలో మరిన్ని సంవత్సరాలు విజయవంతంగా కొనసాగాలని, ఆ దిశగా పాఠకులు ఆదరించాలని కోరుకుంటున్నా. పాఠకులకు కావాల్సిన తాజా వార్తలను అంతే నాణ్యతతో అందిస్తూ ముందుకు సాగాలి - ఆర్.నారాయణమూర్తి (నటుడు, దర్శకుడు, నిర్మాత)

ప్రజల పత్రిక..



నిత్యం సమాజంలోని అసమానతలను, పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజలను చైతన్యం చేస్తూ జనం నాడిగా ముందుకు సాగుతుంది నవతెలంగాణ. ప్రజా సమస్యలకు పెద్ద పీట వేస్తూ, బహుజన సామాజిక న్యాయం కోసం పోరాడుతోంది. ప్రజల్లో మూఢవిశ్వాసాలను తొలగిస్తూ, వారిని ఎడ్యూకేట్ చేస్తూ, రాజకీయ చైతన్యం రగిలిస్తూ పాఠకులను ఆకట్టుకుంటున్న 'నవతెలంగాణ'కు శుభాకాంక్షలు -తమ్మారెడ్డి భరద్వాజ (దర్శకుడు, నిర్మాత)

ప్రజా చైతన్య సారధి



ఉత్తమ ఆశయాలతో, ఉన్నత లక్ష్యాలతో సమాజ పురోగతికి, శ్రమజీవుల అభ్యున్నతికి అంకితమై ఈ మూడేండ్లు పని చేసింది నవతెలంగాణ. ప్రజలను చైతన్యపరిచే ఆయుధంగా పాలకుల వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన పనిచేసింది. గొప్ప రచనలు, వ్యాసాల ద్వారా ఎందరో అభ్యుదయ రచయితలను ప్రోత్సహించింది. వామపక్ష ప్రగతిశీల బడుగు బలహీన (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనరిటీ) వర్గాల ఐక్యత కోసం ఉద్యమించింది. తెలంగాణ ప్రజల సాంఘిక, రాజకీయ, ఆర్థిక సత్యాలకు నిలువెత్తు దర్పణంగా తెలుగు జాతి ఆదరాభిమానాలు పొందింది. ప్రజా ఉద్యమాల సందర్భంలో నిజాయితీగా, నిర్భయంగా అన్ని ఉద్యమాలకు ఊపునిచ్చింది. ఇది విప్లవ సంకేతం, ఇది శ్రామిక జన సంగీతం, ఇది ప్రగతిశీల వేదిక, చైతన్య దీపిక. సామాన్యుల పక్షాన గళమెత్తుతున్న నవతెలంగాణకు నా ప్రజాభి వందనాలు, విప్లవాభి వందనాలు - మాదాల రవి (నటుడు)

నూతనత్వానికి మారుపేరు..




నవతెలంగాణ పేరులోనే నవతరం ఉంది. అందులోనే నూతనత్వమూ ఉంది. తెలంగాణ అనే పేరుతో దానికి అందం, శోభ సంతరించుకుంది. ప్రస్తుతం అన్నిటికంటే బాగా ఉధృతంగా దూసుకొస్తున్న ప్రజాపత్రికగా నవతెలంగాణ ఉందని భావిస్తున్నాను. నేను రెగ్యులర్‌గా ఫాలో అవుతుంటాను. పత్రికా శైలి, భాష బాగా నచ్చింది. ఇలాగే దినదినాభివృద్ధి చెంది తెలుగు దిన పత్రికల్లో అగ్ర స్థానంలో నిలవాలని కోరుకుంటున్నాను - రాజ్ కందుకూరి (దర్శకుడు, నిర్మాత)

ప్రజా చైతన్య యాత్ర..



విజయవంతంగా మూడు ఏండ్లు పాఠకులను అలరించిన నవతెలంగాణ దిన పత్రికకు నా అభినందనలు. పాఠకులకు వికాసాన్ని కలిగిస్తూ, ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నాల్గవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నవతెలంగాణ పాఠకులకు, యాజమాన్యానికి, సిబ్బందికి నా హృదయ పూర్వక అభినందనలు - ఎన్.శంకర్ (దర్శకుడు)

అన్నింటికంటే ముందే..



సినీ పరిశ్రమలోని టాలెంటెడ్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లను ప్రోత్సహిస్తూ సినీ ప్రేమికులకు ఎప్పటికప్పుడు సరికొత్త వార్తలతో నవతెలంగాణ అలరిస్తోంది. 'షో' పేరుతో అంతర్జాతీయ సినిమాను తెలుగు పాఠకుడికి పరిచయం చేసి, విశేష పాపులారిటీని సొంతం చేసుకుంది. మేజర్ అప్‌డేట్స్‌ను అన్నింటికంటే ముందే అందిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. సక్సెస్‌ఫుల్‌గా 3 ఏండ్లు పూర్తి చేసుకుని నాలుగవ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా నవ తెలంగాణ టీమ్‌కు నా బెస్ట్ విషెస్ - విజయ్‌దేవరకొండ (హీరో)

అప్పులపై విమర్శలు తప్పే

సంక్షేమం.. అభివృద్ధి కోసమే

- దేశం అప్పు రూ.82లక్షల కోట్లు
- బుద్ధి తక్కువై అప్పులు చేయడం లేదు
- త్వరలోనే పీఆర్‌సీ :

శాసనసభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధి పథకాల అమలు కోసమే అప్పులు చేస్తున్నామని ముఖ్యమంత్రి కె చెంద్రశేఖరరావు తెలిపారు. బుద్ధి తక్కువ ఆలోచనలతో అప్పులు చేయడం లేదనీ,. రాష్ట్రం చేస్తున్న అప్పులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బీజేపీ శాసనసభ్యులు పదే పదే అప్పులు గురించి సభలో ప్రస్తావించడం సమంజసం కాదన్నారు. 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు అప్పులు చేయడం లేదా? అని సీఎం ప్రశ్నించారు. అంతదాక ఎందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశం అప్పు రూ. 82లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సభలో బీజేపీ సభ్యులు చేసిన విమర్శలపై సీఎం మాట్లాడుతూ దేశ జీడీపీ రూ.167 లక్షల కోట్లు కాగా అందులో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ.82లక్షల కోట్లని చెప్పారు. ఈ లెక్కన చూస్తే 49.5 శాతం మేర కేంద్రం అప్పులు చేసిందన్నారు. గత మూడు సంవత్సరాలలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన అప్పుల గురించి సీఎం వివరించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.5,35,618 కోట్లు, 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.5,94,849 కోట్లు, 2018-19లో రూ. 6,24, 276 కోట్ల అప్పు చేసిందన్నారు.



బుద్ధి తక్కువ ఆలోచన కాదు

అప్పులు తీసుకోవడం బుద్ధి తక్కువ ఆలోచన కాదని సీఎం వెల్లడించారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో 21 శాతం మాత్రమే అప్పులు ఉన్నాయని తెలిపారు. అదికూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయ్ పథకం కింద రూ.9వేల కోట్ల అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. 22 శాతం వృద్ధి రేటుతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబవర్‌వన్‌గా ఉందని చెప్పారు.

రుణమాఫీపై విమర్శలు తగదు

రైతు ప్రయోజనాల కోసం రుణమాఫీ చేస్తే దానిపై కూడా విమర్శలా? అని సీఎం ప్రశ్నించారు. రూ.17వేల కోట్ల రుణమాఫీలో ఇప్పటి వరకు సుమారు రూ.16వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశామన్నారు. ఇంకా ఎవరికైనా రుణమాఫీ కాకుంటే వారి వివరాలు ఇస్తే రుణమాఫీ చేస్తామన్నారు.


శాపాలు పెట్టడం సరికాదు

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి శాపాలు పెట్టడం సరికాదని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ, గురుకుల పాఠశాలలు, వసతిగృహాలకు సన్న బియ్య లాంటి ఏ ఒక్క అభివృద్ధి పథకం కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు ఉన్నాయా? పథకాల అమల్లో తప్పులుంటే చెప్పాలే కాని చేపడుతున్న పథకాలనే తప్పు పట్టొద్దన్నారు.

త్వరలోనే పీఆర్‌సీ

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర వేతనాలతో సమానంగా వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు పీఆర్‌సీ చెల్లించకుండా ఉంటామా? అని సీఎం ప్రశ్నించారు. త్వరలోనే పీఆర్‌సీ చెల్లిస్తామన్నారు.

జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం : తుమ్మల



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జాతీయ రహదారుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణను వేగవంతం చేస్తున్నామని, భూసేకరణ ఆలస్యం మూలంగా ఎక్కడా రోడ్ల నిర్మాణం ఆగలేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న జాతీయ రహదారులకు భూసేకరణ కొంత ఆలస్యమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1333 కిమీ పొడవును జాతీయ రహదారులుగా ప్రకటించినట్టు సభకు వివరించారు. అందుకోసం 147.71 హెక్టార్ల భూమి సేకరించినట్టు తెలిపారు. రహదారుల కోసం ఆరునెలల్లో భూసేకరణ పూర్తి చేస్తామన్నారు.

రైతు వేదిక భవనాలు నిర్మిస్తాం :పోచారం

రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు 'రైతు వేదిక భవనాలు' నిర్మాణం చేపడుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక ఏఈఓ చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2638 క్లస్టర్లకు ఎఈఓలను నియమించడం జరిగిందన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో రూ 12 లక్షలతో రైతు వేదికలను నిర్మిస్తామన్నారు. ప్రతి క్లస్టరుకు ఒకటి చొప్పున రైతులను సమావేశ పరచడానికి 2638 రైతు వేదికలను నిర్మించడం జరిగిందన్నారు. ప్రతి వేదికకు రూ 12 లక్షల చొప్పున సుమారు రూ 300 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు.

శాస్త్రీయంగా పార్కింగ్ స్థలాలు : కేటీఆర్

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రాల్లో పార్కింగ్ వ్యవస్థలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని మున్సిపల్ శాఖ మంత్రి కె తారకరామారావు తెలిపారు. పార్కింగ్ కోసం ప్రయివేట్ స్థలాలను కూడా సేకరిస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 10,15 431 నాలుగు చక్రాల వాహనాలు, 40, 14, 034 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా పార్కింగ్ విధానం ఉంటుందని చెప్పారు.

అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లు : మంత్రి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనూ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఇప్పటికే 13 జిల్లాల్లో సెంటర్లు ప్రారంభించామని వీటిలో 5 లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తే 2 వేల మందికి క్యాన్సర్ ఉన్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాదానం చెప్పారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓరల్, బ్రెస్ట్, సర్వేకల్ వంటి క్యాన్సర్లకు జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని తెలిపారు.

ఎన్‌పీసీడీసీఎస్ కార్యక్రమంలో భాగంగా ఎంఎన్‌జేఐఓ అండ్ ఆర్‌సీసీ స్క్రీనింగ్, క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి 277 మంది వైద్యాధికారులు, 275 మంది స్టాఫ్ నర్సులు, 9217 మంది ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం వీరు జిల్లా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పాజిటివ్ కేసులను హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రికి పంపిస్తున్నామని మంత్రి చెప్పారు.

'మెట్రో'ను శంషాబాద్ వరకు పొడిగిస్తాం: కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మెట్రోను శంషాబాద్ విమానాశ్రయం వరకు పొడిగించే ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని మున్సిపల్ శాఖ మంత్రి కె తారకరామారావు చెప్పారు. మెట్రో అలైన్‌మెంట్ ఉన్న ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాలు ఉండటంతో పాతనగరంలో మెట్రో ఆలస్యమవుతుందన్నారు. జీరో అవర్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పైవిధంగా స్పందించారు. మెట్రో మొదటి ఫేజ్‌లోని 72 కిమీ పొడవుకుగానూ 30 కిమీలలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైనట్టు తెలిపారు. మొత్తం 85 శాతం పురోగతితో, ఇతర భాగాలలో ప్రాజెక్టు పనులు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు.రెండోఫేజ్ కోసం ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్(డీఎంఆర్‌సీయల్) ప్రాథమిక ప్రాజెక్టు నివేదిక (పీపీఆర్)ను సమర్పించిందన్నారు. ప్రస్తుతం 2వ దశకోసం సమగ్రమైన ప్రాజెక్టు నివేదిక రూపొందించడానికి క్షేత్రస్థాయిలో స్థాయిలో సర్వే నిర్వహిస్తుందన్నారు. జేబీఎస్- ఫలక్‌నామా కారిడార్‌లోని ఫేజ్ వన్ ప్రాజెక్టు పనులు మధ్య చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. ఎంజీబీఎస్ మరియు ఫలక్‌నామ మధ్య మెట్రో రైలు అలైన్‌మెంట్ ప్రాంతాలలో 25 సున్నితమైన నిర్మాణాలు ఉన్నట్టు తెలిపారు. వీటిలో ఎక్కువగా మతపరమైన భవనాలు ఉండగా ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా వీటి



సంఖ్యను నాలుగు తగ్గించినట్టు తెలిపారు. నిర్మాణ సమయంలో నాలుగు కట్టడాలను కూడా ఎటువంటి నష్టం జరగకుండా తగినంత శ్రద్ధ తీసుకోవడమవుతుందన్నారు.

బీజేపీ వాకౌట్

గత నాలుగేండ్లుగా పాత నగరంలో మెట్రో రైలు ఆలస్యానికి నిరసనగా బీజేపీ ఎమ్మెల్యేలు సభను వాకౌట్ చేశారు. పాతనగరంలో మెట్రో రైలు నిర్మాణాన్ని గత కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ కూడా అదే బాటలో నడుస్తుందని బీజేపీ సభ్యులు జి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ సభ నుంచి వాకౌట్ చేసిందని కేటీఆర్ ఎదురుదాడికి దిగారు.

గ్రామాల్లో శ్మశాన వాటికలపై కార్యాచరణ : జూపల్లి



గ్రామాలలో శ్మశాన వాటికల సమస్యల తీవ్రత బాగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 4271 సంఖ్యలో శవదహన వాటిక పనులు మంజూరు అయ్యాయన్నారు. రాష్ట్రంలో వెయ్యి సంఖ్యలో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. శ్మశాన వాటికల స్థలాల సేకరణ కోసం తహసీల్దార్లకు, కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు లేనిచో కొనుగోలు చేయడమో, దాతల నుంచి సేకరించడమో చేయాలని ఆదేశించారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో సీపీఐ(ఎం) సభ్యులు సున్నం రాజయ్యతోపాటు టీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. శ్మశానవాటికలకు మిషన్ భగీరథ పైపు లైన్ల ద్వారా నీటి అందించనున్నట్టు తెలిపారు.

మిషన్ కాకతీయకు సహకరించని కేంద్రం : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిషన్ కాకతీయ కార్యక్రమానికి కేంద్రం సహకరించడం లేదని ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. చెరువుల పునరుద్ధరణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి రూ. 5 వేల కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని నీతి ఆయోగ్ సిఫారసు చేసిందని మంత్రి అన్నారు. మిషన్ కాకతీయ వల్ల చెరువుల పునరుద్ధరణతో కృష్ణా బేసిన్‌లో 89 టీఎంసీలు, గోదావరి బేసిన్‌లో 165 టీఎంసీలో సామర్థ్యం పెరిగినట్టు చెప్పారు. దేశ, విదేశాల నుంచి మిషన్ కాకతీయ పథకానికి ప్రశంసలు అందుతున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలలో కూడా మిషన్ కాకతీయ అమలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలు తీరును శాస్త్రీయంగా అధ్యయనం చేసిన నాబార్డుకు చెందిన నాబ్‌కాన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్టు చెప్పారు. మిషన్ కాకతీయ మొదటి దశలో ఎంపిక చేసిన చెరువులున్న గ్రామాల్లో చెరువుల కింద ఆయకట్టు రైతాంగ కుటుంబాల్లో సర్వే, వారితో చర్చలు, ఉపగ్రహ చిత్రాల పరిశీలన, విశ్లేషణ, కొన్ని చెరువులపై కేస్ స్టడీ ఇతరత్రా లభ్యమయ్యే సమాచారం ఆధారంగా మిషన్ కాకతీయ ప్రభావాలను ఆ సంస్థఅధ్యయనం చేసినట్టు మంత్రి తెలిపారు. 400 చెరువు గ్రామాల్లో 12 వేల కుటుంబాలను నాబ్ కాన్ సర్వే కోసం ఎంపిక చేసిందన్నారు. 2016 ఖరీఫ్‌లో వర్షపాతం ఆశాజనకంగా లేకపోయినా మిషన్ కాకతీయ అమలు కారణంగా 51.5 శాతం సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ఈ పెరుగుదల రబీ పంట కాలంలో ఎక్కువగా నమోదైందని చెప్పారు. పథకం అమలు తర్వాత చెరువుల్లో నీటి నిల్వ పెరిగిన కారణంగా నీటి లభ్యత పెరిగిందన్నారు. వరి పంట సాగు 49.2 శాతం నుంచి 62.1 శాతానికి పెరిగిందని తెలిపారు. 2016-17 రబీ సీజన్‌లో ఖరీఫ్‌లో సాగైనా వరి పంట విస్తీర్ణం కంటే 7.2 శాతం పెరిగిందని చెప్పారు. వరి పంట దిగుబడి 4.1 శాతం , పత్తి పంట దిగుబడి 6.5 శాతం పెరిగిందన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పంట దిగుబడి కూడా పెరగడం విశేషమని చెప్పారు. నేలలో తేమ నిలుపుకునే సామర్థ్యం పెరిగిందన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై దృష్టిసారించని సర్కార్ : ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై ప్రభుత్వం దృష్టిసారించాలని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు ఇచ్చినంత ప్రాధాన్యత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు ఇవ్వపోవడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. దళితుల అభివృద్ధికి సబ్‌ప్లాన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. కోట్లాది రూపాయలు ఖర్చవుతున్నాయని గణాంకాలు చెబుతున్నా దళితుల్లో అభివృద్ధి కానరావడంలేదన్నారు. లోపం ఎక్కడ ఉందో ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.16 వేల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కేటాయింపులతో సరిపెట్టకుండా నిధులను విడుదల చేయాలని కోరారు.

పంట పెట్టుబడి పండ్లతోటలకు వర్తిస్తుంది : పోచారం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎకరాకు నాలుగువేల పెట్టుబడి సాధారణ పంటలతోపాటు పండ్లతోటలకు వర్తిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనగ, చెరకు రైతులకు కూడా పెట్టుబడి ఇస్తామన్నారు. వివాదస్పదమైన భూములకు ఇస్తామని, అయితే న్యాయపరమైన చిక్కులు తొలగిపోయిన తర్వాత ఆ పెట్టుబడి ఆ రైతుకు చెందుతుందన్నారు. ఏప్రిల్ 20 మొదటి పంటకు, నవంబర్ 20 నుంచి రెండోపంటకు ఈ పెట్టుబడి ఇస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు చెక్కుల రూపంలో ఇవ్వనున్నారని చెప్పారు. ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న ఆరు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రైతులకు ఈ పెట్టుబడి తీసుకునే అవకాశం ఉందన్నారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో రైతు పెట్టుబడి పథకంపై సభ్యులు ఎనుగు రవీందర్‌రెడ్డి, పుట్టమధు, వీరేశం అడిగిన సభ్యులకు మంత్రి సమాధానమిచ్చారు. కౌలు రైతులకు వర్తించదని, భూమి యాజమానులకే ఇస్తామని, పెట్టుబడి గురించి కౌలురైతులు యాజమానులతో మాట్లాడుకోవాలని సూచించారు. రైతులు పంట పండించడానికి పెట్టుబడి కింద 72,13,111 మంది పట్టాదారులు లబ్దిపొందుతున్నారని చెప్పారు. రాజరిక పాలనలో రైతుల నుంచి శిస్తు వసూలు చేసేవారని, శిస్తు కట్టపోతే చిత్రహింసలకు గురి చేసేవారని, కానీ మన రాజు (కేసీఆర్) రైతులకే పెట్టుబడి ఇస్తున్నారని కొనియాడారు. ప్రపంచంలోనే ఎక్కడా ఇటువంటి పెట్టుబడి ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ 12000 కోట్ల రూపాయలను ప్రతిపాదించినట్టు తెలిపారు.

పండ్లకు క్యాల్షియం కార్బైడ్ వాడితే చర్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పండ్లను క్యాల్షియం కార్బైడ్‌తో మాగబెడితే చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాపారులను హెచ్చరించారు. ఇందుకోసం నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా సమాధానం చెప్పారు. ప్రస్తుతం గడ్డి అన్నారం, వరంగల్, జగిత్యాలలో పండ్ల మార్కెట్లు ఉన్నాయని నల్లగొండలో బత్తాయి పండ్ల కోసం ప్రత్యేకంగా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గడ్డి అన్నారం మార్కెట్‌ను రంగారెడ్డి జిల్లా కోహెడకు, జగిత్యాల మార్కెట్‌ను అదే జిల్లాలోని చెల్గల్‌లో తరలిస్తున్నామని అందువల్ల ఆ మార్కెట్లను ఆదునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి వివరించారు. వరంగల్ పండ్ల మార్కెట్‌కు కూడా అనువైన భూమిని సేకరించి అభివృద్ధి చేస్తామని అన్నారు.


ఎంబీసీ నిధులు క్యారీఫార్వర్డ్ చేయండి..

అసెంబ్లీలో సున్నం రాజయ్య డిమాండ్

- బీసీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి
- ఈటల సమాధానంపై అసంతృప్తి
- సభ నుంచి సీపీఐ (ఎం), టీడీపీ, బీజేపీ వాకౌట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంబీసీలకు గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. అందులోంచి వెయ్యి పైసలు కూడా ఖర్చు చేయలేదని సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య విమర్శించారు. ఈ యేడాది వారి కోసం మళ్లీ వెయ్యి కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో గతేడాది ఖర్చు చేయకుండా ఉన్న నిధులను క్యారీ ఫార్వర్డ్ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలకు సబ్‌ప్లాన్ చట్టం చేయాలని కోరారు. అంగవైకల్యానికి సంబంధించి మొత్తం 21 రకాలున్నాయని.. వీటితో బాధపడే వికలాంగులకు చాలినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా సంక్షేమ శాఖలో కలిపేయటం శోచనీయమని అన్నారు. వారి కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోడు రైతులకు పట్టాలివ్వాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. ఐటీడీఏలకు ఐఏఎస్ అధికారులను నియమించాలని.. 1998, 2008, 2012 డీఎస్సీ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక ప్రత్యేక డీఎస్సీని వేసి.. నిరుద్యోగులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని



రాజయ్య.. నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ఆయనతోపాటు టీడీపీ, బీజేపీ సభ్యులు కూడా వాకౌట్ చేశారు.

జర్నలిస్టులకు ఇండ్లెప్పుడిస్తారు..? : సండ్ర వెంకటవీరయ్య, కె.లక్ష్మణ్

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలనిస్తా మంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు హామీనిచ్చారని టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, బీజేపీ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ గుర్తుచేశారు. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లో ఆయన ఈ వాగ్దానం చేశారని వారు తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఇండ్ల స్థలాలనివ్వలేదని విమర్శించారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యుజే ధన్యవాదాలు

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు టీడీపీ, బీజేపీ సభ్యులకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజే) ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపాయి. సమస్య పరిష్కారమయ్యే వరకూ తమకు అండగా నిలబడాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.సోమయ్య, బి.బసవపున్నయ్య కోరారు.

ఎంబీసీ కులాలను ఎప్పుడు గుర్తిస్తారు..? : బీజేపీ

రాష్ట్రంలోని ఎంబీసీ కులాలను ఎప్పుడు గుర్తిస్తారు? జాబితాను ఎప్పుడు విడుదల చేస్తారు..? అని బీజేపీ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంచార జాతుల వారు రాష్ట్రంలో అత్యంత దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాత బస్తీ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు : అక్బరుద్దీన్ ఓవైసీ



పాత బస్తీ అభివృద్ధికి రూ.5 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనారిటీలకు ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నప్పటికీ వాటి విడుదలలో తగినంత శ్రద్ధ వహించటం లేదని విమర్శించారు.


ధరణి ప్రాజెక్టుతో రెండు రోజుల్లో మ్యూటేషన్ : మహమూద్ అలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ధరణి ప్రాజెక్టు ఏర్పాటైతే కేవలం రెండు రోజుల్లోనే డాక్యుమెంట్ల మ్యూటేషన్ పూర్తవుతుందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. భూ రికార్డుల వివరాలను ఎక్కడినుంచైనా అప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. భూ రికార్డులు, సర్వే, సెటిల్‌మెంటు, రిజిస్ట్రేషన్ సర్వీసులను ఏకీకృతం చేసి ఆయా వివరాలను ఒకే ప్రదేశంలో నిర్వహించడానికి బ్యాంకింగ్ తరహాలోనే కొత్త వెబ్ ఆధారిత సమీకృత భూ రికార్డుల నిర్వహణ విధానాన్ని డిజైన్, అభివృద్ధి నిర్వహించడానికి ధరణి ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ అప్రమత్తతో వీలు కల్పించడం, రైతులు దాఖలు ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేందుకు, సమస్యలు లేకుండా భూ రికార్డులను భద్రపరచడం, దొంగ పాస్ పుస్తకాలను నివారించడానికి, ప్రభుత్వం అందించే సబ్సిడీలు ప్రయోజనాలు అసలైన రైతులకు చేరడానికి వీలు కల్పించడం కోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, వ్యవసాయ శాఖలు, ఆర్థిక సంస్థలకు అనుసంధించి పంపిణీ చేయడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

మళ్లీ అధికారం మాదే

- ప్రతిపక్షాలకు పుట్టగతుల్లేకుండా చేస్తాం
- పగటి కలలు కనొద్దు
- అభివృద్ధి కనిపించడం లేదా?: ఆర్థికమంత్రి ఈటల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారంపై కలలు కనొద్దు.. మళ్లీ అధికారం మాదే.. అధికారంపై పగటి కలలు కనొద్దని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. 'రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి. మీరు మాత్రం గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్న పార్టీలకు పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ ప్రతిపక్షాలపై ముఖ్యంగా బీజేపీపై మండిపడ్డారు. ఆ పార్టీ మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు తంగెళ్లు కూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన నాలుగేండ్లలో తమ ప్రభుత్వం 15 పథకాలు రూపొందించి అమలు చేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఒక్క పథకమైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కరెంట్ ఉందంటూ బీజేపీ సభ్యులు చేసిన వ్యాఖ్యలను మంత్రి ప్రస్తావిస్తూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. పంట పెట్టుబడి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.. కొత్తగా ఏర్పడిన తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశించినా.. ఇవ్వలేదన్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీనీ వేడుకున్నా.. ఒక్క రూపాయి కరుణించలేదని విమర్శించారు. ఇది కేంద్ర ప్రభుత్వం మనపై చూపుతున్న వివక్షకు నిదర్శనమన్నారు. మానవతా విలువలతో ఉన్న తాము ప్రజల కోసం ఎంతైన ఖర్చు చేస్తామని, మార్వాడీ కొట్టులా వ్యవహరించడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతిపక్షాలకు అవగాహన లేదని, నిజాయితీ అంతకంటే లేదని ఘాటుగా విమర్శించారు. నిద్రపోతున్నట్టు ప్రతిపక్షాలు నటిస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీలతో చెప్పించుకునే స్థాయికి తాము దిగజారలేదన్నారు. తమ పాలనపై బురదజల్లుతున్న ప్రతిపక్షాలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ పాలనలో 'గుణాత్మకమైన మార్పు' చూపించామని చెప్పుకొచ్చారు. రజకులకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. గత నాలుగేళ్లుగా తమ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్లలో 90 నుంచి 95 శాతం నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మైనార్టీల కోసం రూ.994.067 కోట్లు కేటాయించామని చెప్పారు. తెలుగు భాషను కాపాడుకోవడం కోసం కమిటీ వేశామని, దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైదరాబాద్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. ఎంబీసీలను త్వరలోనే గుర్తించి పథకాలు ప్రకటిస్తామన్నారు.

బాలకార్మికుల రక్షణ కోసం 'ఆపరేషన్ స్మైల్' : మంత్రి నాయిని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాలకార్మికుల రక్షణ, పునరావాసం కోసం 'ఆపరేషన్ స్మైల్' పేరుతో పోలీసు, కార్మిక శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నాయని హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అన్నారు. శాసనమండలిలో మంగళవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఎక్కడైనా ఉల్లంఘనలు జరుగుతున్నట్టు తెలిస్తే 2016 బాలకార్మిక (నిషేధ, క్రమబద్దీకరణ) సవరణ చట్టంలోని 3వ విభాగంతోపాటుగా 1988 షాపులు, సంస్థల చట్టంలోని 20వ విభాగం కింద తప్పుచేసిన యాజమాన్యాలను ప్రాసిక్యూషన్ చేస్తామని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో 1,732 మంది బాలలను రక్షించామని, 1,624 మంది బాలలకు పునరావాసం కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

సెన్సెక్స్ ▲ 74	నిఫ్టీ ▲ 30	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)
32,996	10,124	65.19	రూ. 30,261	రూ. 40,200

కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410

అబ్బే.. ఈ వృద్ధి సరిపోదు

ఏటా 1.2 కోట్ల మేర కొలువులు కావాలి

- 10 శాతం వృద్ధితోనే కొత్త ఉద్యోగాలు
- మౌలికం, ఈవోడీలపై దృష్టి పెట్టాలి
- దేశంలో సంస్కరణల వేగం పెరగాలి: రాజన్



హాంకాంగ్: భారత్ నమోదు చేస్తూ వస్తున్న వృద్ధి రేటు భవిష్యత్తు అవసరాలకు సరిపోదని భారతీయ రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ప్రతియేటా ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్న 1.2 కోట్ల మంది అవసరాలను తీర్చేందుకు.. భారత్ ప్రస్తుతం నమోదు చేస్తున్న 7.5 వృద్ధి సరిపోదని ఆయన అన్నారు. ఇందుకోసం భారత్ కనీసం 10 శాతం మేర వృద్ధిని నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. క్రెడిట్ సూయిస్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో పాల్గొన్న ఆయన అనంతరం సీఎన్‌బీసీకి ఇంటర్వ్యూనిస్తూ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. భారత్ రానున్న 10 నుంచి 20 సంవత్సరాల గురించి ఆలోచిస్తూవుంటే.. అందులోఉద్యోగ కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుందని అన్నారు.

ఆర్‌బీఐ అధినేత పదివికి రాజీనామా చేసిన అనంతరం రాజన్ ప్రస్తుతం షికాగో విశ్వవిద్యాలయంలోని బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అధ్యాపక బాధ్యతలను నిర్వహిస్తూ వస్తున్నారు. భారీ స్థాయిలో మౌలిక వసతుల కల్పన, దేశంలో అధికంగా కంపెనీలు వచ్చేలా చర్యలు చేపట్టడంతో పాటు.. భారత్‌లో కంపెనీల వ్యాపార నిర్వహణను మరింత సులభతరం(ఈవోడీ) చేయడం, నాణ్యమైన మానవ మూలధానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా భారత్ 10 శాతం వృద్ధిని నమోదు చేయగలదని ఆయన అన్నారు. భారత్‌లో మెరుగైన సంస్కరణలు వస్తున్నప్పటికీ.. అనుకున్న దానికంటే కూడా చాలా నెమ్మదిగా ఇది తెరపైకి వస్తుండడం పట్ల రఘురామ్ రాజన్ కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. యువ జనాభా భారత్‌కు గొప్ప సంపదని ఆయన అన్నారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇక భారత్‌లో సంస్కరణల పర్వం కొన్ని రోజులు పక్కనపడే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికలు ముగిసి కొత్త సర్కారు కొలువుదీరిన తరువాత సంస్కరణలు మళ్లీ పట్టాలెక్కే అవకాశం ఉన్నట్టు ఆయన తెలిపారు. భూసేకరణ, విద్యుత్తు రంగంలో సంస్కరణలు వంటి చర్యల వల్ల పరిశ్రమ వర్గాల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు.

అప్రమత్తతతోనే ఆరోగ్యం..!

- వేసవిలో ప్యాక్ చేసిన నీటితో జాగ్రత్త..
- ఐఎస్ఐ మార్క్‌లేని బాటిల్స్‌లో నీరు వాడొద్దు..
- ప్రజలు జాగురుకతతో వ్యవహరించాలి..
- ఇంటి ఉక్కు విషయంలోనూ జాగ్రత్త: బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధినేత అమీర్ ఉజ్ జమాన్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: వేసవి నేపథ్యంలో కుప్పలుతెప్పలుగా ప్యాక్ చేసిన తాగు నీటి సీసాలు, మినరల్ బాటిల్స్ మార్కెట్లోకి అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగురుకతతతో వ్యవహరించాలని 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' (భారత ప్రమాణాల సంస్థ-బీఐఎస్) హెచ్చరిస్తోంది. తాగు నీటి సీసాలపై తప్పక ఐఎస్ఐ మార్కును చూసి ప్రమాణాలకు తగ్గట్టుగా తయారు చేసిన సీసా నీళ్లనే తాగాలని.. లేదంటే ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉందని బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధినేత, శాస్త్రవేత్త అయిన అమీర్ ఉజ్ జమాన్ ప్రజలకు సూచిస్తున్నారు. వేసవి నేపథ్యంలో పలు ప్రయివేట సంస్థలు ఎలాంటి ప్రమాణాలను పాటించకుండా తాగు నీటిని సీసాల్లో ప్యాక్ చేసి వాటిని మార్కెట్లోకి వదులుతుండడం తమ దృష్టికి వస్తోందని వాటిపై నిఘా ఉంచినట్టుగా ఆయన తెలిపారు. బీఐఎస్ ప్రమాణాలను పాటించకుండా మార్కెట్లోకి సీసాలను తీసుకువచ్చే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్టుగా ఆయన వెల్లడించారు. కొత్తగా మార్కెట్లలోకి తమ ఉత్పత్తులను తీసుకురావాలని యోచిస్తున్న వారు బీఐఎస్ కార్యాలయాన్ని సంప్రదించి ఐఎస్ఐ ధ్రువీకరణను తగిన అనుమతులను పొందాలని ఆయన సూచించారు. కొందరు తమ ఉత్పత్తులకు ఐఎస్ఐ ధ్రువీకరణ లేకున్నా.. తమ సీసాలపై నకిలీ ఐఎస్ఐ మార్క్‌ను ముద్రించి మార్కెట్లలో అమ్ముతున్నట్టుగా కూడా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. దీనిని అరికట్టేందకు చర్యలు చేపడుతున్నట్టుగా వివరించారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వారి సమాచారం తమ కార్యాలయానికి గానీ.. లేదా 040-27249996/ 97/98 నంబర్లకు ఫోన్ చేసి అందిస్తే తగిన చర్యలు చేపట్టనున్నట్టుగా ఆయన వివరించారు. గ్రామాల్లో సరఫరా చేస్తున్న టిన్ బాటిల్స్ నీళ్లను కూడా ప్రమా ణాల మేరకు తయారు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

ఉక్కు విషయంలోనూ జాగ్రత్త..

భవన నిర్మాణాలతో సహా ఇతర నిర్మాణ కార్యక్రమాల్లో వినియోగించే స్టీల్ విషయంలోనూ ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని అమీర్ ఉజ్ జమాన్ తెలిపారు. నమ్మకమైన స్టీల్‌కు ఐఎస్ఐ మార్క్ గుర్తని ఆయన అన్నారు. స్టీల్ రాడ్‌లపై ఐఎస్ఐ గుర్తింపు లేకుండా వచ్చే ఉక్కును భవన నిర్మాణాలకు వాడొద్దని ఆయన సూచించారు. దీనివల్ల ఆ భవనాలు ఎక్కువ కాలం మన్నకపోవడమే కాకుండా చిన్నచిన్న ప్రమాదాలను కూడా అవి తట్టుకోలేక కుప్పకూలే అవకాశం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో భవన యజమానులు నిర్మాణాలు చేపడుతున్నప్పుడు స్టీల్ విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రజలు కూడా బీఐఎస్ ప్రమాణాల పట్ల కనీస అవగాహనను పెంపొందించుకోవడం ద్వారా వ్యాపారుల చేతుల్లో మోస పోకుండా ఉంటారని అధికారులు చెబుతున్నారు.

బ్యాంకుల్ని ప్రయివేటీకరించండి..

- ఇన్ఫోసిస్ చైర్మెన్ నిలేకని ఉచిత సలహా



ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకుల విలువ పడిపోక ముందే వాటిని ప్రయివేటీకరించాలని ఇన్ఫోసిస్ చైర్మెన్ నందన్ నీలేకని సర్కారుకు సూచించారు. ప్రస్తుతం బ్యాంకులు ప్రయివేటుకంటే మంచి పనితీరుతో మార్కెట్లో ఆధిక్యకర స్థాయిలో ఉన్నాయని.. వాటి విలువ ఏటా నాలుగు శాతం మేర తగ్గుతూ వస్తోందన్న అంచనాల పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల విలువ 70 శాతం వరకు ఉందని.. రానున్న పదేండ్లలలో ఈ విలువ తగ్గుతూ వచ్చి 10 శాతం దరిదాపుల్లోకి చేరవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగంలో జరిగినట్టుగానే.. బ్యాంకింగ్ రంగంలోనూ పరిణామాలు చోటు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఒకప్పుడు టెలికాం రంగంలో ఏకఛత్రాధిపతిగా వెలుగొందిన బీఎస్ఎన్ఎల్ ప్రస్తుతం ప్రయివేటు సంస్థల దాటికి తట్టుకోలేక పోతోందని.. ఈ నేపథ్యంలో ఆ సంస్థ చిన్న టెలికాం స్థాయికి చేరకుందని అన్నారు. విమానయాన రంగంలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఎయిరిండియా నేలకొరగి మనుగడ కోసం పోరాడుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బ్యాంకింగ్ రంగానికి కూడా ఇలాంటి పరిస్థితి రాకమునుపే తగిన చర్యలు తీసుకుంటే మేలని ఆయన అన్నారు.

ప్రజలే బ్యాంకుల్నికొనుగోలు చేసుకొని స్వేచ్ఛగా నిర్వహించుకోనిస్తే అద్భుత ఫలితాలుంటాయని అభిప్రాయ పడ్డారు. బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తూ వస్తోందని. బ్యాంకులు విజయవంతంగా నిలిచేందుకు గాను టెక్నాలజీ ప్రముఖ పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆధునిక టెక్నాలజీని వీటిని ప్రయివేటు రంగ బ్యాంకులు చురుగ్గా అందిపుచ్చుకొని ఖాతాదారులను ఆకట్టుకొనే దిశగా వేగంగా పావులు కదుపుతున్నాయని అన్నారు.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్

ఐపీవో రేపటి నుంచే..

4,017 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దాదాపు రూ.4,017 కోట్ల మేర నిధుల సమీకరణ కోసం ఐసీఐసీఐ సెక్యూరిటీస్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ పబ్లిక్ ఇష్యూ గురువారం (22న) ప్రారంభమై 26వ తేదీతో ముగియనుందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ అధినేత ఖేతన్ కర్నానీస్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.519-520 ధరల శ్రేణితో ఈ పబ్లిక్ ఇష్యూలో అందుబాటులో ఉంచనున్నట్టుగా కంపెనీ తెలిపింది. ఐపీవోలో మొత్తం దాదాపు 7.72 కోట్ల మేర ఈక్విటీ షేర్లను సంస్థ జారీ చేయనుంది. ఇటీవలి కాలంలో కంపెనీ బ్రోకరేజ్ ఆదాయం 70 శాతం నుంచి 64 శాతానికి జారిందని... అయితే ఇతర మూలాల నుంచి వచ్చే ఆదాయం మాత్రం 29 శాతం నుంచి 36 శాతానికి చేరినట్టుగా ఆయన వివరించారు. తమ ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం స్థిరంగా ముందుకు సాగుతున్నట్టుగా ఆయన తెలిపారు. మొత్తం ఆదాయంలో ఈ వ్యాపారం దాదాపు 24 శాతం మేర వాటాను కలిగి ఉన్నట్టుగా ఆయన వివరించారు.



సావిత్రిబాయిఫూలే విగ్రహం ధ్వంసం

- ఆవిష్కరించిన రెండ్రోజులకే..

నవతెలంగాణ-కోనరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల ప్రాథమిక పాఠశాలలో ఉన్న సావిత్రిబాయి ఫూలే విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రెండు రోజుల కిందటే ఈ విగ్రహాన్ని ఎంపీ వినోద్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆవిష్కరించారు. మహిళా అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి విగ్రహ ధ్వంసం పట్ల జిల్లా వ్యాప్తంగా మేధావులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, జేఎన్‌టీయూ జేఏసీ జిల్లా అధ్యక్షులు గుడిసె ప్రభాకర్, బీసీ ఉపాధ్యాయ నాయకులు, బీఎస్పీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



నవతెలంగాణ-కోరుట్లరూరల్

పనిలో నిమగ్నమై ఉన్న ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు ఒక్క సారిగా దాడి చేశాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పదిమందికి పైగా గాయాలయ్యాయి. ఈ ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం లో మంగళవారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం... పైడిమ డుగు గ్రామంలో ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు గన్నెగుట్ట వద్ద కాలువ పనులు చేస్తున్నారు. అక్కడ పొదల్లో ఉన్న తేనెతుట్టెను గమనిం చకుండా దాన్ని తొలగించేందుకు యత్నించారు. దీంతో తేనెటీగలు ఒక్క సారిగా కూలీలపై దాడి చేశాయి. దీంతో వారు అక్కడ్నుంచి పరుగులు పెట్టారు. ఘటనలో పొన్నాల రాజేశ్వరి, పొన్నాల లక్ష్మి, దొమ్మాటి వసంత, పడాల లింగవ్వ, పాలడుగు లచ్చవ్వ, కొండవేని భూమక్క, తదితరులకు గాయాలయ్యాయి. గాయపడ్డ కూలీలకు స్థానిక వైద్యులు చికిత్స అందించారు. పొన్నాల లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

అటకెక్కిన అవిశ్వాసం...

మూడోరోజూ అనుమతించని స్పీకర్

- విపక్షాల ఆందోళన సాకు
- పార్లమెంట్ ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణం : విపక్షాలు
- కేంద్రం చొరవ తీసుకోవడం లేదని విమర్శ



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారుకు వ్యతిరేకంగా వైసీపీ, టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు అటకెక్కాయి. ఈ తీర్మానాలను వరుసగా మూడోరోజూ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో ప్రవేశపెట్టేందుకు నిరాకరించారు. విపక్ష ఎంపీలు ఆందోళన చేపడుతున్నారని, ఈ దశలో అవిశ్వాస నోటీసులకు మద్దతుగా నిల్చున్న ఎంపీలను లెక్కిండం సాధ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు పార్లమెంట్‌లో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో తొమ్మిది విపక్ష పార్టీల నేతలు మంగళవారం రాజ్యసభా విపక్ష నేత గులాంనబీ ఆజాద్ కార్యాలయంలో సమావేశమయ్యాయి. ప్రధానంగా పీఎన్‌బీ కుంభకోణంతో పాటు ప్రత్యేకహోదా, కావేరీ అంశంపై చర్చ చేపట్టాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌లో నెలకొన్న ప్రతిష్టంభనకు నరేంద్రమోడీ సర్కారే కారణమని విమర్శించాయి. విపక్ష పార్టీల ఆందోళనలను శాంతింపజేసేందుకు కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి చొరవ తీసుకోలేదని ఆరోపించాయి. కాగా ఉభయసభల్లో వివిధ పార్టీల ఆందోళనలతో మరోమారు పార్లమెంట్ బుధవారానికి వాయిదా పడింది.

కేంద్ర సర్కారుపై వైసీపీ, టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన నోటీసులు అందాయని లోక్‌సభలో స్పీకర్ ప్రకటించారు. 'వైవీ సుబ్బారెడ్డి(వైసీపీ), ఎంపీ తోట నరసింహం(టీడీపీ) అవిశ్వాస తీర్మాన నోటీసులు అందాయి. అయితే సభ క్రమంలో ఉండేంత వరకు అవిశ్వాస తీర్మానాలకు మద్దతుగా నిల్చున్న ఎంపీలను లెక్కించడం సాధ్యపడదు. ఎంపీలు తమకు కేటాయించిన స్థానాల్లోకి వెళ్లాలి. అప్పుడే 50 మంది ఎంపీలను లెక్కించడం సాధ్యమవుతుంది' అని స్పీకర్ అన్నారు. అయితే విపక్షాలు ఆందోళన విరమించకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకముందు ఉదయం సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, టీఎంసీ తదితర పార్టీల ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. రిజర్వేషన్ అంశంతో పాటు ప్రత్యేక హోదా, కావేరీ అంశంపై నినాదాలు చేశారు.

ప్రతిష్టంభనకు కేంద్ర సర్కారే కారణం : రాజ్యసభలో గులాంనబీ ఆజాద్

రాజ్యసభలో నెలకొన్న ప్రతిష్టంభనకు కేంద్ర సర్కారే కారణమని విపక్ష నేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. ఉదయం సభ ప్రారంభమైన తరువాత విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటన అనంతరం సభలో ఆయన మాట్లాడారు. 'సభ ప్రారంభం నుంచి ప్రధానంగా మూడు అంశాలు విపక్ష పార్టీల మెదళ్లలో నానుతున్నాయి. బ్యాంకుల్లో అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలను దోచుకెళ్లారు. పీఎన్‌బీ కుంభకోణంపై చర్చ జరపాలి. ఈ అంశాన్ని యావత్తు దేశం చర్చించాలనుకుంటోంది. అలాగే ఏపీకి ప్రత్యేక హోదా, కావేరీ అంశం. ఈ అంశాలపై సభలో చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ రోజు తొమ్మిది విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీఎంసీ, బీఎస్పీ, ఎస్పీ, డీఎంకే, ఎన్సీపీ, సీపీఐ, జేఎంఎం మా కార్యాలయంలో కలిశాం. సభ జరగాలని కోరుకుంటున్నాం. ఈ మూడు అంశాలపై చర్చ చేపట్టాలి. బిల్లులపై కూడా చర్చ జరగాలి. ఈ అన్ని అంశాలపై చర్చించేందుకు వీలుగా ప్రభుత్వం సభా కార్యక్రమాలను పొడిగించాలి. ప్రభుత్వం సైతం అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలి. కేంద్రం ఇప్పటి వరకు ప్రతిష్టంభనను తొలగించేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. సభలో ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణం' అని అన్నారు.




యూపీఏ కుంభకోణాలపై చర్చించాలి : కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ కాంగ్రెస్‌పై ఎదురు దాడి చేశారు. యూపీఏ హయాంలో చోటుచేసుకున్న కుంభ కోణాలపై కూడా చర్చ జరగాలన్నారు. అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు విపక్షాలు సహకరించాలని సూచించారు. టీడీపీ ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. '2014లో ఆమోదించిన బిల్లులో(ఏపీ పునర్విభజన బిల్లు) కొన్ని హామీలిచ్చారు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదు' అని అన్నారు. డీఎంకే ఎంపీ తిరుచ్చిశివ మాట్లాడుతూ..కావేరీ నిర్వహణ బోర్డు ఏర్పాటుపై కేంద్రం నుంచి ఎలాంటి హామీ రాలేదని అన్నారు.

ఈ సందర్భంగా పార్లమెంట్ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్‌గోయల్ మాట్లాడుతూ.. మోడీ సర్కారు నాలుగేండ్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందంటూ ప్రసంగించే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ లేచి 'మీరు మోడీ సర్కారు ప్రసంగం చేయకండి' అని అడ్డుకున్నారు. అదే సమయంలో విపక్ష ఎంపీలు తమ డిమాండ్లతో ప్లకార్డులు చేతపట్టి వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో సభను చైర్మెన్ బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభ ఎంపీలకు చైర్మెన్ విందు రద్దు

- సభలో ఆందోళన చేస్తున్నారని నిర్ణయం



ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు నేడు పెద్దల సభ ఎంపీలకు ఇవ్వనున్న విందును రద్దు చేశారు. గత 12 రోజులుగా రాజ్యసభ సజావుగా సాగకపోవడంతో ఆగ్రహం చెందిన చైర్మన్... ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం విందు ఏర్పాట్లన్నీ గత వారమే పూర్తయినట్టు తెలిసింది. స్వయంగా చైర్మన్ వెంకయ్యనాయుడు రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి, రాజ్యసభాపక్ష నేత, విపక్ష నేతతో పాటు ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్‌లీడర్లతో మాట్లాడారు. బుధవారం(నేడు) ఏర్పాటుచేయనున్న విందుకు రావాలని ఆహ్వానించారు. అయితే చివరి నిమషంలో రద్దు చేశారు. మంగళవారం నుంచి సభ సజావుగా జరుగుతుందని ఛైర్మన్ భావించారని తెలిసింది. ఉదయం వివిధ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో సభలో ఆందోళనలపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇదే సమయంలో విందు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ఎంపీలకు తెలియజేశారని సమాచారం. నేటి విందులో ముఖ్యంగా ఆంధ్ర ప్రత్యేక వంటకాలను ప్లాన్ చేశారని, ఇందుకోసం ఆ రాష్ట్రం నుంచి వంటచేసే వారిని కూడా ఢిల్లీకి రప్పించారని తెలిసింది.



థర్డ్‌ఫ్రంట్ సాధ్యం కాని ఊహ

- హామీల అమలే చేతగాలే.. దేశాన్నేం ఉద్ధరిస్తరు
- కొట్లాడి గిట్టుబాటు ధర సాధించాలి
- మహారాష్ట్ర తరహాలోఆందోళనలు : టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

థర్డ్‌ఫ్రంట్ అనేది ఊహలాంటిదేనని, అది సాధ్యం కాదని, రాష్ట్రంలోని సమస్యలను పరిష్కరించడం, ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాని కేసీఆర్ దేశాన్ని ఏం బాగు చేస్తాడని టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాక ఢిల్లీపై ఆలోచన చేయాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని కేఎన్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన రైతు సమస్యలపై సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎర్రజొన్న రైతులు ధర్నా నిర్వహించే వరకు ప్రభుత్వానికి సోయి లేదని, రైతు అభిప్రాయం తెలుసుకోకుండానే, రైతు సంఘాల నాయకులను చర్చలకు పిలవకుండానే మద్దతు ధర రూ.2,300 ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకూ సాగు ఖర్చులు ఎక్కువై అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరి సాగు కోసం ఎంతో కష్టపడుతుంటే, క్వింటా వడ్లకు రూ.1590 మద్దతు అందజేసిందన్నారు. ప్రభుత్వం ఇస్తానంటున్న రూ.నాలుగు వేల పెట్టుబడి దేనికీ సరిపోదని, సాగు పెట్టుబడి మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. పసుపు, పత్తి, మిర్చి, ఎర్రొజన్న, శనగ పంటలకు మద్దతు ధర లేక రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. 500 గ్రామాలు తిరిగి రైతుల నుంచి పంటల వివరాలు సేకరించామని, ఈ సమాచారంతోనే 13 డిమాండ్లతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, నష్టపోయిన దానికి నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ ప్రక్షాళనతో ఎలాంటి మార్పూ రాలేదన్నారు. రాష్ట్రం ఏర్పడి నాలుగేండ్లు గడిచినా ఉద్యోగాలు భర్తీ చేయలేదని, గతంలో కేసీఆర్ ఇచ్చిన లెక్కల ప్రకారమే లక్షా 80వేల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్ర తరహాలో ఇక్కడా రైతన్నలు కొట్లాడి గిట్టుబాటు ధర సాధించాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్రలో వేలాది మంది రైతులు 200 కిలోమీటర్లు నడిచి హక్కులు సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. జేఏసీ జిల్లా చైర్మెన్ గోపాల్‌శర్మ మాట్లాడుతూ.. జేఏసీ ఏ కార్యక్రమం చేసినా నిర్బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మెన్ నార చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.




అంతులేని రహదారుల ఆవిష్కరణ 'లే లడఖ్'

అప్పటికే ఢిల్లీ నుంచి లేహ్ చేరుకున్న మా కోడలు హిమాన్షి, మనవడు శయన్ మాతో జాయినయ్యారు. డెహ్రాడూన్ నుంచి హిమాన్షి అన్నయ్య రాజీవ్, వదిన షాలిని, వాళ్ళ పిల్లలు అరుషి, అనూ, ఇలీషా వచ్చి మాతో కలిసారు. షాలిని ఖతార్ లో పనిచేస్తుంది. ఖతార్ పెట్రోలియంలో పని చేసే ఆమె కేరళ మిత్రుడు టోనీ, అతని భార్య ఎల్సీ, వాళ్ళ బాబు జోహాన్, టోనీ తమ్ముళ్ళు ఇద్దరు, టోనీ స్నేహితుడి కుటుంబం నుంచి ఆరుగురు వచ్చారు. ఇదీ మొత్తం మా గ్రూప్. అయితే మేం దిగిన ఫొటోలో కొందరు మిస్సయ్యారు.

లాండ్ ఆఫ్ ఎండ్‌లెస్ డిస్కవరీ

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో లడఖ్ జిల్లా లోని బహు సుందరమైన అతి పెద్ద ప్రాంతాలే. ప్రజలు ఈ ప్రాంతాన్ని లే లఢఖ్ అనే పిలుస్తారు. భారత్ "లిటిల్ టిబెట్"గా లే ప్రసిద్ధిగాంచింది. క్షణ క్షణానికీ మారిపోయే బీభత్సమైన వాతావరణం. 'లడఖ్' టిబెటన్ పదం. అనేక రహదారులు కలిగిన ప్రదేశమని అర్థం. ప్రజలది ప్రత్యేకమైన టిబెట్ సంస్కృతి. లడఖ్ ఉత్తరాన కారాకోరం కున్ లూన్ పర్వత శ్రేణితో, దక్షిణాన ఎత్తైన హిమాలయాల మధ్యన నొక్కుకు పోయినట్లుగా ఉంటుంది. అత్యంత తక్కువ జనాభా గల ప్రాంతం. పూర్వం ప్రపంచ ప్రధాన



వ్యాపార మార్గాలన్నిటినీ కలుపుతూ లడఖ్ కేంద్రంగా ఉండేది. కానీ 1960లో చైనా ఆ దారులన్నీ మూసివెయ్యడం వల్ల, ఆ దారుల గుండా జరిగే వ్యాపారం అంతరించి, ప్రస్తుతం అది ప్రధాన పర్యాటక కేంద్రమైంది. ఆకాశానికి నిచ్చెన వేసినట్లు 11,562 అడుగుల ఎత్తులో భూమ్యాకాశాల మధ్య ఒక అందమైన వంతెనలా ఏర్పడిన ఒక రమ్యదశ్యంగా కన్నుల పండుగ చేస్తుంది లడఖ్. కను చూపు అందినంత మేరా ఎత్తు పల్లాల పీఠ భూమి మీద బంజరు భూములు, రంగు రంగుల కొండలు, లోతైన లోయలు, అద్భుతమైన సరస్సులు పరచుకొని ఉంటాయి. కొండల్ని తొలిచి చేసిన బ్రహ్మాండమైన రహదారుల వల్ల లేహ్ లడఖ్ 'లాండ్ ఆఫ్ ఎండ్ లెస్ డిస్కవరీ'గా ప్రపంచ ప్రసిద్ధి పొందింది!

ఉత్కంఠభరిత దృశ్యాలు

ఎటు చూసినా పచ్చని లోయలు కంటికి ఆహ్లాదంగా కనిపించి కనువిందు చేస్తాయి. తెల్లగా మెరిసిపోయే మఠాలు, దారి పొడవునా శ్మశానాల్లో కనిపించే తెల్లని గోపురాల్లాంటి చిన్న పెద్ద సమాధులు లే లో ఉంటాయి. ఉదయం, సాయంత్రం బీపీ, పల్స్ రేట్ చెక్ చేయించుకోవాలనే హెచ్చరిక విమానాశ్రయంలో చాలాసార్లు వినిపించింది. మేం మా బాబు క్వార్టర్‌లో, మిగిలిన స్నేహితులందరూ అతిథి గృహాల్లోనూ సర్దుకున్నాం. పొద్దునా, సాయంత్రం ఆర్మీ నర్సులు బీపీ, పల్స్ రేట్ చెక్ చేసేవారు. పూర్తిగా మూడు రోజుల తర్వాత అక్కడి వాతావరణ పరిస్థితులకు అంటే 11562 అడుగుల ఎత్తుకు మా శరీరాలు క్రమంగా అలవాటుపడి కుదురుకున్నాయి. నిలబడితే కండ్లు తిరిగేవి. ఈ మూడురోజులూ మా ఇంటి వాకిట్లోంచి కనిపించే హిమాలయాలను అబ్బురపడుతూ చూశాం!

బల్టిస్తాన్ లోయలతో విరాజిల్లే అందమైన ప్రదేశం ఒకప్పటి లడఖ్. (ఇప్పుడు ఎక్కువ భాగం పాకిస్థాన్లోకి వెళ్లిపోయింది) భారతదేశం లోని అతి పెద్ద జిల్లా లడఖ్. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని సగానికి పైబడిన విస్తీర్ణం లడఖ్ జిల్లాదే! ఇక్కడి జనాభాలో సగం షియా ముస్లింలు. మిగిలిన సగం బౌద్ధులు. లడఖ్ మాతభాష లడాఖీ అనబడే టిబెటన్ భాష. కానీ ప్రజల్లో చాలా మంది ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషలు కూడా మాట్లాడతారు. కాశ్మీర్, లడఖ్ రెండూ ముస్లిం ప్రాంతాలయిన ప్పటికీ వాటిమధ్య చాలా సాంస్కతిక భేదాలున్నాయి. ఇక్కడి ప్రజల ప్రధాన నీటి వనరు మంచు పర్వతాల నుంచి ప్రవ హించే నీరే! లడఖ్ ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆట ఐస్ హాకీ. లడఖ్‌లోని సుదూరాలకు వ్యాపించిన రకరకాల రంగు రంగుల పర్వతాల సౌందర్యం ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసినా తనివి తీరదు.

సింధూనది లడఖ్‌కి వెన్నెముక. ప్రధాన చారిత్రక పట్టణాలు షెయ్, బాస్గో, తింగ్మోస్ గాంగ్, సింధూ నది సమీపంలో ఉన్నాయి. మోటార్ బైకింగ్ చేయదలచుకున్న వారికి ప్రపంచవ్యాప్తంగా 5602 మీటర్ల ఎత్తులో భారత్‌ని సియాచిన్ గ్లేసియర్ తో కలిపే అత్యధిక ప్రసిద్ధమైన దారి ఉంది. అతి చల్లని వాతావరణమైనప్పటికీ దాన్ని మరిపించే విభిన్నమైన ప్రకతి దశ్యాలతో, అతి సుందరమైన ప్రదేశం లడఖ్. పెంగాంగ్‌త్సో, మోరిరి లాంటి కొన్ని ప్రాంతాలు అద్భుతమైన సరస్సులకు నిలయం. ఇక లెహ్ లో పగలు భయంకరమైన వేడి, రాత్రులు విపరీ తమైన చలి, బీభత్సమైన హొరుగాలి.

"సాహిత్యానికన్నా ముందే జీవితం ఉంది, పని కన్నా ముందే పదార్థం ఉంది. ప్రపంచాన్ని మనం విగ్రహాలతో ముంచెత్తక ముందే పర్వతాలు చలువరాళ్లకు కాణాచిగా ఉన్నాయి" అని అంటారు ఫిలిప్స్ బ్రూక్. ఈ చలువరాళ్ల కాణాచుల్ని చూడటానికి మేం 2016 జులై 3 నుంచి 15 వరకూ లడఖ్ జిల్లాలోని లేహ్ నగరంలో పర్యటించాం. ఆ సమయంలో మా బాబు ఇండియన్ ఆర్మీలో ఏవియేషన్ పైలట్‌గా లేహ్ లో పనిచేశాడు. శీతాకాలంలో ఆ కఠినమైన వాతావరణాన్ని తట్టుకోలేం గనక జులైలో బయల్దేరాం. అమెరికా నుంచి వచ్చిన మా పాప ఉష, ఉష ఫ్రెండ్ స్నిగ్ధ, మనవళ్ళు విహాన్, తనీష్, మేమిద్దరం కలిసి హైదరాబాద్ నుంచి ఢిల్లీ, అక్కణ్ణుంచి లేహ్ కి ఫ్లైట్ లో జులై మూడున చేరుకున్నాం. ఢిల్లీ నుంచి ప్రతి ఉదయం లేహ్ కి ఒకే ఒక ఫ్లైట్ ఉంటుంది.



జరదేఖో నవతెలంగాణ

ఆ గాలి ఊళలు చేసే శబ్దానికి ఇల్లు కదలబారి మీద పడుతుందేమోనని భయపడి పోయాం! చర్మం పొడిబారి పగిలిపోతుండేది. మా అందరి ముక్కులు విపరీతంగా పొడిబారి పోతుండేవి. మాకు కాస్త తరచుగానూ, పిల్లల ముక్కుల్లోంచి ఎక్కువగానూ రక్తం వచ్చేది. ఆకలి పూర్తిగా తగ్గిపోయింది. ఏదైనా చూడడానికి వెళ్తున్నామంటే పిల్లలతో సహా రోజంతా అసలేమీ తినేవాళ్లంకాదు. ఆ రహదారుల ఎత్తు పల్లాల మీద నుంచి వాహనాలు నడుస్తున్నప్పుడు కళ్లు తిరిగి వాంతులయితే కష్టమనిపించేది. నోరు పొడి బారకుండా చూయింగ్ గమ్స్ లాంటివి, ఆక్సిజన్ సిలిండర్లు మాత్రం పెట్టుకునేవాళ్లం.



కర్ దుంగ్లాపాస్ చాలా దూరంలో ఉంది. ఒక రోజంతా ప్రయాణం చేశాం. ఆ రహదారుల్లో వాహనం ఎక్కడ పడిపోతుందోననే ఉత్కంఠ వెంటాడుతుంది. గుండెలరచేతుల్లో పెట్టుకుని ప్రయాణించడ మంటే ఏమిటో తెలిసింది. మొత్తానికి ప్రపంచంలోనే ఎత్తైన మోటారబుల్ రోడ్ చేరుకున్నాం. అక్కడ 15 నిమిషాలు మించి ఉండకూడదు, ఆక్సిజన్ తక్కువైనందున ఎవరూ ఉండలేరట! నేను 10 నిమిషాలు నిలబడ్డాను. అదేరోజు రాత్రికి నుబ్రా వ్యాలీ చేరుకున్నాం. అది ఒక అతి శీతల ఎడారి వలె ఉంటుంది! కాని నోరూరించే ఎర్రటి యాపిల్ పండ్లు, అక్రోట్లు, యాప్రికాట్స్((జల్దారు పండ్లు) బాదం మొ.న పండ్లు సాగు నీటి గ్రామాల్లో పండుతాయి. ఒక రాత్రి నుబ్రా వ్యాలీలో గడిపాము. నుబ్రాలోయలో కెప్టెన్ ముజాఫర్-కమర్ జమానీ దంపతులు మాకు ఆప్యాయంగా సొంతింట్లో వాళ్లలాగా గడ్డ కట్టే చలిలో వెచ్చని ఆతిథ్యమిచ్చారు. అక్కడ కుటుంబాలుండే వీలు లేదు. మాలాగే చూడ్డానికి భర్త దగ్గరకి కొన్నిరోజుల కోసం వచ్చింది కమర్. కాబట్టి వాళ్లకంటూ వంట వసతి లేదు. ఆరోజు వారి రంజాన్ లాంటి పండగేదో ఉంది. తను మా కోసం స్వయంగా మిలిటరీ కిచెన్‌లోకి వెళ్ళి స్వయంగా వంటచేసి ఖీర్ వడ్డించింది.



సాధారణంగా ఆ కిచెన్లలోకి స్త్రీలెవరూ వెళ్లరు. పురుషులే వంట చేస్తారు. ఈ దంపతులు నా మనస్సులో నిలిచిపోయారు.

నాలాంటి అర్భకులు రవ్వంత ఖాళీ లేకుండా శరీరమంతా కప్పుకున్నా అల్లడిపోతున్న వాతావరణంలో దారి పొడవునా శ్రమజీవులు కొండల్ని తొలిచి రహదారులు వేస్తూ కనిపించారు. లడఖ్ - కాశ్మీర్ మధ్య భారతదేశపు మొట్టమొదటి నేషనల్ హై వే నంబర్ ఒన్ బహు శోభాయమానంగా ఉంది. మంత్రముగ్ధులను చేసే వివిధ సందర్శనా స్థలాలను చూశాం. అక్కడ కొలువు తీరిన బౌద్ధ ఆరామాలు, చంబ ఆలయం, గురుద్వారాలు ప్రజల పరమత సహనాన్ని చాటి చెప్తాయి. కచ్చితంగా దర్శించి తీరవలసిన శాంతి స్థూపం, అయస్కాంత కొండల్ని చూశాం! పాంగోంగ్ సరస్సు నీళ్ల రకరకాల రంగుల్లో కాంతులీనుతూ ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మన భూమి మీదున్న ప్రకతి మాయాజాలం ! మాకు జులై (2016) 9వ తేదీ నుంచి శ్రీనగర్ ద్రాస్ లోయలో మూడు రాత్రులకు హొటల్స్ అన్నీ బుక్కైపోయాయి. కానీ జులై 8న భారత దళాలు చేసిన 'బుర్హన్ ముజాఫర్ వనీ' ఎన్‌కౌంటర్ వల్ల కాశ్మీర్‌కి వెళ్లే దారులన్నీ మూసేశారు. మా ప్రయాణం ఆగి పోయింది. శ్రీ నగర్ చూడలేకపోయామే అని ఏడ్చుకుంటూ సింధూ లోయ, జాంగ్స్కర్, రోహతంగ్ లా మంచు రహదారి గుండా ప్రయాణించి మనాలీ చూసు కుని ఉస్సురంటూ ఢిల్లీ చేరుకున్నాం . రోహతంగ్ లా దారులు కూడా ఆద్యంతమూ ఉత్కంఠగానే ఉన్నాయి.

అక్కడున్నన్ని రోజులూ మనశ్శరీరాలు ఆహ్లాదంగా సోలిపోయాయి! స్నిగ్ధ, అరుషిలు వేలల్లో ఫొటోలు, వీడియోలు తీశారు గానీ అవన్నీ కంటితో చూసిన వాటి ముందు పేలవంగా కనిపిస్తాయి. వంటలూ, తిండీ తక్కువేగానీ, ఇంతమందికి ఎప్పుడూ సిద్ధంగా ఉండి వేడినీళ్లు, టీ, కాఫీలు, ఆక్సిజన్ సిలిండర్లు అందించి ఎంతో అండగా ఉన్న రుద్రేష్, బల్బీర్ సింగ్ భయ్యాలు కూడా మాకెప్పటికీ గుర్తుంటారు!

- శివలక్ష్మి

ఫోన్ నెం: 9441883949

> "యాత్రికుడు తను ఏం చూడాలనుకుంటాడో అదే చూస్తాడు. అదే పర్యాటకుడైతే అక్కడ ఉన్నదే చూస్తాడు"
>
> - గిల్బర్ట్ చెస్టన్

అద్భుత ప్రకృతి స్థలి శ్రీశైలం



శ్రీశైల మహాక్షేత్రాన్ని నేను సందర్శించాను. నలమల్ల అటవీ ప్రాంతంలో ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం లో బస్‌లో బయలుదేరాను. డిండి ద్వారా చక్కటి ప్రయాణం. మార్గమధ్యంలో కృష్ణానదిపై నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టును చూశాను. అక్కడి నుంచి పాలధార- పంచదార, శిఖరేశ్వరం, సాక్షి గణపతి మొదలైన పర్యాటక ప్రదేశాలను సందర్శించాను. ఇదొక మధుర మైన అనుభూతి. శ్రీశైలం ప్రతి ఒక్కరూ చూడదగిన ప్రదేశంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే అక్కడి వాతావరణం, ప్రకృతి సౌందర్యం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

-సరికొండ రవిప్రకాశరాజు

సూర్యాపేట జిల్లా, మునగాల

సెల్: 9000191196

అడుగడుగునా కమనీయ దృశ్యాలే!

అదొక అద్భుతమైన ప్రయాణం... అనుకోకుండా మా ఫ్రెండ్ ఫోన్ చేసి చెప్పింది. వెనీస్ నుంచి వారం రోజులు క్రూయిజ్‌లో ప్రయాణం. తక్కువ ఖర్చుతో ఎనిమిది రోజులు గడపటం అంటే లక్కీ లాటరీ కొట్టినంత ఆనందంతో ఎగిరి గంతులేశాం. కాని అది బుక్ చేసుకోవడానికి ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. ఆ సమయంలో నేను మా స్నేహితురాలు భారతి ఇంట్లో చిన్న పార్టీలో ఉన్నాను. ఈ విషయం తెలియగానే మా ఆయనకు ఫోన్ చేసి ట్రావెల్ ఏజెంట్ దగ్గరకెళ్ళి మన టికెట్స్ బుక్ చేయమని చెప్పాను. ఆరవై వేల రూపాయాలకు ఏడు ప్రదేశాలు, ఉండటానికి వసతి, ఆహారంతో సహా వారే అన్ని చూసుకుంటారు. మా అబ్బాయి, అమ్మాయి, అల్లుడు, నేను మావారు, పిల్లలతో సహా డబుల్ బెడ్‌రూమ్ బుక్ చేసుకున్నాం. అక్కడికి వెళ్లడానికి ఇరవై వేల రూపాయాలు ఎందుకంటే మేం నవంబర్‌లో బుక్ చేసుకున్నాం. కాని వెళ్ళింది మాత్రం ఏప్రిల్ నెలలో. వెళ్ళిరావ డానికి మొత్తం ఎనభై వేలు ఖర్చయినవి. వారం రోజుల్లో మేం చూసిన ప్రదేశాలు ఇటలీ, వెనీస్, బరీ, గ్రీస్, సాంత్రొని, క్రొయేషియా. మేం టికెట్స్ బుక్ చేసిన వారం రోజుల్లో నే ఒక పత్రికలో 'బరీ', 'అల్బెరబెల్లో" అనే పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన పెద్ద ఫోటో వేశారు. అది ఇటలీలో ఉందని దాంట్లో చదివాను.



ఇక వెంటనే నేను అల్బెరబెల్లోకి ఎలా వెళ్లాలి అని ప్లాన్ చేశాను. క్రూయిజ్ 'బరీ' అనే ప్రాంతంలో ఉదయం పది గంటలకు దిగాం. అక్కడి నుంచి అల్బెరబెల్లోకి చేరే వరకు మూడు గంటలు పట్టింది. మా ఓడ బరీ తీరానికి చేరగానే మేం త్వరత్వరగా అందరి కంటే ముందు బయటికి వచ్చాం. బయటికి రాగానే రెంటల్ కారు బుక్ చేసుకోవడానికి వెళ్లాం. ఒక టాక్సీ డ్రైవర్ ఇలా అన్నాడు "అల్బెరబెల్‌కు వెళ్ళడానికి మీకు రెంటల్ కారు ఎందుకు"? ఆ కారు నాకే ఉంది అని చెప్పాడు. ఆ రెంట్ డబ్బులు నాకే ఇస్తే చాలు అడిగాడు. ఇక ఎంతో ఆనందంతో సమయం కూడా ఆదా అవుతుంది పైగా వెతుకులాట లేకుండా చూడాలనుకున్న ప్రదేశానికి వెళ్ళొచ్చు. సంతోషంగా డ్రైవర్‌కి 60 డాలర్స్ ఇచ్చి ఎనిమిది మందిమి కారులో కూర్చొని అల్బెరబెల్లో వెళ్ళాం.

ఇటలీ లో ఉన్న అతి పురాతనమైన పట్టణం అల్బెరబెల్లో. ఇక్కడ పల్చటి పలకలాంటి రాతితో కట్టిన గుడిసెలు. వాటిపైన గోపురము, మొత్తంగా రాతి పలకలతో నిర్మించిన విచిత్రమైన కట్టడాలు. 1996లో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించారు. ఈ గుడిసెల్నీ 'ట్రుల్లీ' అంటారు. పలకల మధ్య సిమెంట్ కాని ఇసుక కాని లేదు. అన్నీ పేర్చటమే. ఈ ప్రాంతమంతా గుడిసెలతో నిండి ఉంటుంది. కొండపైకి ఎక్కి కిందకు చూస్తే ఆకాశమంతా నలుపు, తెలుపు మేఘాలతో కమ్ముకున్న నగరంలా కనిపిస్తుంది. నగరం లోపల దాదాపు ఏడు కిలో మీటర్లు నడిచాం. అక్కడ ఓ మ్యూజియం ఉంది. ఎన్నో శతాబ్దాల క్రితం ఒక క్రైస్తవ మత గురువు ఈ ప్రాంతంలో పలకలతో చిన్న గదిని ఏర్పాటు చేసుకొని జీవించేవారట. ఆయనను చూసే చాలామంది అలాగే గుడిసెలను నిర్మించుకున్నారట.

కొన్ని ట్రుల్లీలు రెండంతస్తుల మేడలాగ కట్టారు. కాని గోపురము మాత్రం ఒకే విధంగా ఉండే టట్టు జాగ్రత్త తీసుకున్నారు. అందమైన పూల మొక్కలు, తీగలతో ఇంటిని అలంక రించారు. టెంపరరీ స్ట్రక్చర్స్ రాతితో నిర్మించడం వల్ల ఎండాకాలంలో చల్లగా, చలికాలంలో వేడిగా ఉంటాయి. ఎన్నో శతాబ్దాల నుంచి ఈ పట్టణం చెక్కుచెదరకుండా ఉంది. కొత్త కట్టడమైనా ఇంటి పై కప్పుకి మాత్రం అదే రాతిని వాడుతున్నారు. ఓ ఇంట్లో బొమ్మలు, టీ షర్టులు అమ్ముతున్నారు. ఆ రెండు కొని అక్కడి నుంచి బయలు దేరాం. ఇది 14 వ శతాబ్దములో కట్టిన నగరం. ఇక్కడ అందరు పావు రాళ్ని అమ్ముకొని బతికే వాళ్ళు. మానవుడు సృష్టించుకున్న అద్భుత నగరం. ఈ నగరాన్ని కనులార చూసి మేమందరం చాలా సంతోషంగా బరీకి తిరిగి వచ్చాం.



అప్పుడు నిజంగా నాకు అనిపించింది ఒక్క ఫోటో నన్ను ఇంత ప్రభావితం చేసింది. నిజంగా దీని గురించి రాస్తే ఇంకా ఎంతమంది ప్రభావితమవుతారో కదా అని అనిపించింది. 'బరీ'లో వున్న చర్చిలు చూశాం. బరీ మొదటి ఓ వ్యాపార కేంద్రం. అన్ని ఓడలు ఇక్కడికి వచ్చేవి. ఇక్కడ 13వ శతాబ్దములో కట్టిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, బెసిలికా ఆఫ్ సెయింట్ నికోలస్ చర్చిని చూశాం. ఈ చర్చి గురించి మా గైడ్ ఓ ఆసక్తికరమైన కథ చెప్పాడు. "సాన్ నికోలస్ బిషప్ ఆఫ్ మీరా 300-350 ప్రాం తానికి చెందినవాడు. ఆయన ఎంతో మందికి సాయం చేసే వాడు. ఆయన మరణాంతరం 1087లో 47 మంది నావికులు నికోలస్ సమాధి నుంచి సేకరించిన అస్తికలను దొంగిలించి బరీ చర్చిలో ఉంచారు. 1089-1095 వరకు ఈ కట్టడం పూర్తయింది. కాని 1197లో చర్చికి సిమెంట్‌తో తాపడం చేశారు. చర్చి చూడటానికి ఎంతో అందంగా వుంది.



అక్కడి నుంచి క్రొయేషియా వెళ్ళాం. క్రొయేషియాలో ఉదయం ఎనిమిది గంటలకు దిగి నగరాన్ని చూడడానికి వెళ్ళాం. బయటికి వెళ్ళేముందు మా పాస్‌పోర్ట్స్‌ని చెక్ చేశారు. ఈ దేశము ఎంతో చిన్నదైనా చాలా అందంగా ఉంది. నగరం మధ్యలోకి రాగానే మాకు ఓ పెద్ద కట్టడం కనిపించింది. ఆ కట్టడం ఎత్తైనగోడతో, రాతితో కట్టబడి వుంది. అందరూ ఒక నిచ్చెనని పట్టుకొని ఎక్కుతున్నారు. నేను మా వారిని అడిగాను వెళ్దామని మా పిల్లలు మా వారు ఎవ్వరూ ఆ మెట్లు ఎక్కి చూడడానికి రాలేదు. కాని నేను ఒక్కదాన్నే బయల్దేరాను. ఆ గోడ ఎక్కడానికి ఎంట్రీ ఫీజు వుంది. నేను టికెట్ కొని నిచ్చెన ఎక్కాను. నిచ్చెన 200 మెట్ల దాకా వున్నాయి. ఎంతో ఉత్సాహంగా ఎక్కేశాను. అది ఓ ప్రహరీ గోడ. పూర్వకాలంలో రాజులు మధ్యలో ఉండి రక్షణ కోసం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించుకున్నారు.

క్రొయేషియా లో ఇండ్లన్నీ ఎరుపు రంగు పెంకులతో రెండు వేల వరకు ఉండొచ్చు. పైనుంచి చూస్తూ వుంటే నీలి రంగులో వున్న సముద్రపు అంచున ఎర్రటి తివాచీతో ఆహ్వానం పలుకుతున్నట్టుగా వుంది. క్రొయేషియాను మావారు, పిల్లలు ఎంత మిస్ అయ్యారో అని చింతిస్తూ.. అడుగడుగునా కమనీయ దృశ్యాలను చూస్తూ.. రాజు గారిని మెచ్చుకుంటూ నడిచాను. ఒక మూలకి మినికాటో టవర్ వుంది. సముద్రం మధ్యలో ఎర్రటి చుక్కని పెట్టినట్టు ఆ నగరం ఎంతో అందంగా వుంది. ఈ మినికాటో అనే టవర్‌ని 7-17 శతాబ్దం వరకు కట్టిన దాఖలాలు వున్నాయి. ఇది 1940 మీటర్ల దూరం (6360 ఎస్.ఎఫ్.టి) పొడవు వుంది. 25 మీటర్ల ఎత్తు (82 ఎస్.ఎఫ్.టి) వుంది. ప్రతి పది అడుగులకు ఒక అర్ధచంద్రాకార గోడ కట్టివుంది. నగరాన్ని శత్రువుల నుంచి కాపాడుకొనడానికి 120 తుపాకులు వున్నాయి. అలా నడుస్తూ పట్టణ సౌందర్యాన్ని ఆస్వా దిస్తూ ఒకచోట ఆగాం. అక్కడి నుంచి ప్రాంత మంతా తెల్లటి పెయింటింగ్స్ వేసిన ఇండ్లు, ఓడలు, పడవలు ఉన్నాయి. అక్కడి నుంచి గోతిక్ అర్కి టెక్చర్‌తో కట్టిన వంతెనని చూశాం. ఈ గోడ మొత్తం ఏడు కిలో మీటర్లు ఉంటుంది.

ఈ ప్రదేశాన్ని చూచి ఎగిరి గాలిలో గంతులేశాను. అంత అందమైన కట్టడాన్ని చూసిన తర్వాత భవనం నుండి కిందికి దిగడానికి నిచ్చెన వేసి ఉంది. నాకు పై నుండి దిగాలంటే కండ్లు తిరుగుతున్నాయి. భయమేస్తుంది. అక్కడే ఒక జపాన్ అమ్మాయి నా చేయి పట్టుకొని నా హ్యాండ్ బ్యాగ్ తీసుకొంది. తన సాయంతో మెల్లిగా కిందకి దిగాను. దిగగానే ఆ అమ్మాయికి థ్యాంక్స్ చెప్పి మా వారి గురించి వెతికాను. ఎంత వెతికినా దొరకలేదు. సిటీ స్కేర్ నుంచి బయటకు రాగానే క్రూయిజ్ వారు వేసిన బస్ వుంది అది ఎక్కి కూర్చున్నాను. నేరుగా క్రూయిజ్ దగ్గరకి తీసుకొని వెళ్లింది. నేను దిగి నా ఐడీ కార్డు చూపించి లోపలికి వెళ్ళాను. అక్కడ అందరి ఐడీ కార్డ్సు స్కాన్ చేసి లోపలికి పంపుతారు. నేను మా వాళ్ళు వచ్చారా అని ఆఫీసర్‌ని అడిగితే రాలేదని చెప్పారు. వారికి నేను వచ్చిన విషయం తెలియజేయమని చెప్పి మళ్ళీ బయటికి వచ్చాను. గేటు దగ్గర వెయిట్ చేస్తూ కూర్చున్నాను. పిల్లలు ఒక గంట తర్వాత కలిశారు. మా వారు ఇంకా గేటు దగ్గరే నా కోసం వెయిట్ చేస్తున్నారు. మా బాబు వెళ్ళి మా వారిని తీసుకొని వచ్చారు. మొత్తానికి వారు ఒక గంట నేను ఒక గంట వారి కొరకు వెతికి తిరిగి రూమ్‌కి తిరిగి వచ్చాం. అప్పటి నుండి ఎప్పుడూ ఏ ప్లేస్‌లో అయినా విడిగా వెళితే ఒక టైమ్ పెట్టుకొని ఒక షాప్‌లోనో లేక ఒక రెస్టారెంట్ ప్లేస్ చూసుకొని ఆ ప్లేస్‌లో కలవాలని నిర్ణయించుకున్నాం.

- నర్మదా రెడ్డి


9849018510

నవతెలంగాణ ఆటలు
హైదరాబాద్ 14 బుధవారం 21 మార్చి 2018

పద్మ పురస్కార ప్రదానం


సోమ్‌దేవ్ దేవర్మన్
కిదాంబి శ్రీకాంత్

పద్మ పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, టెన్నిస్ ఆటగాడు సోమ్‌దేవ్ దేవర్మన్‌లు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మ శ్రీ పురస్కారాలు స్వీకరించారు. మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్ దక్కించుకున్న దిగ్గజ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోని, స్నూకర్ లెజెండ్ పంకజ్ అద్వాని సహా పద్మ శ్రీ గ్రహీత యువ లిఫ్టర్ మీరాబాయి చానులు పురస్కార ప్రదాన వేడుకకు హాజరు కాలేకపోయారు.


భారత్‌తో బెంగళూర్ టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్

రబాడకు లైన్ క్లియర్

- రెండు టెస్టుల సస్పెన్షన్ ఎత్తివేత



కేప్‌టౌన్ : సఫారీ పేసర్ కగిసో రబాడ ఆస్ట్రేలియాతో మూడో టెస్టులో ఆడనున్నాడు. రెండో టెస్టులో వికెట్ తీసిన తర్వాత స్మిత్‌ను ఢీకొట్టిన రబాడ.. మ్యాచ్ రిఫరీ నుంచి లెవల్ 2 తప్పిదం కింద మూడు డీ మెరిట్ పాయింట్లు పొందాడు. అప్పటికే ఐదు పాయింట్లున్న రబాడ.. ఎనిమిది పాయింట్లతో రెండు టెస్టుల్లో సస్పెన్షన్‌కు గురయ్యాడు. దీనిపై దక్షిణాఫ్రికా అప్పీల్ చేయగా.. ప్రముఖ న్యాయవాది డాలి వాదనలు వినిపించాడు. స్కైప్‌లో సుమారు ఆరు గంటల పాటు విచారణ చేపట్టిన అప్పీల్ కమిషనర్ మైకల్ హెరాన్ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తీర్పు చెప్పాడు. రబాడ లెవల్ తప్పిదంతో ఒక డీ మెరిట్ పాయింట్‌తో తప్పించుకున్నాడు. దీంతో గురువారం నుంచి ఆరంభమయ్యే కేప్‌టౌన్ టెస్టుకు రబాడ బరిలోకి దిగబోతున్నాడు.



ముక్కోణపు టీ20 సిరీస్ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జులన్ గోస్వామి, మిథాలీరాజ్

మహిళల క్రికెట్‌పై దృష్టి

- బలమైన రిజర్వ్ ప్లేయర్ల తయారీపై సమాలోచనలు

ముంబయి : పురుషుల క్రికెట్‌తో పాటు సమానంగా దేశవాళీ, భారత్-ఏ జట్ల టూర్లు పొందిన అమ్మాయిలు.. క్రికెట్ అభివృద్ధిలో భాగంగా మరో ముందడుగు సాధించారు!. మెన్స్ క్రికెట్ మాదిరిగానే మహిళల జట్టుకు బలమైన రిజర్వ్ ప్లేయర్స్‌ను తయారు చేసేందుకు బీసీసీఐ సంకల్పించింది. ఈ మేరకు జాతీయ సెలక్షన్ కమిటీకి సూచించినట్టు తెలుస్తోంది. ఇటీవల ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను 0-3తో కోల్పోయిన టీమ్ ఇండియా.. అనూహ్యంగా పేలవ ప్రదర్శన చేసింది. సీనియర్ క్రికెటర్లు మిథాలీరాజ్, జులన్ గోస్వామిలు మరెంతో కాలం జట్టుతో కొనసాగే అవకాశాలు కనిపించటం లేదు. లేటు వయసులోనూ వీరిద్దరు మంచి ప్రదర్శన చేస్తున్నారు. అయినా, వీరు వీడ్కోలు పలికే సమయానికి నాణ్యమైన రిజర్వ్ క్రికెటర్లను సిద్ధం చేసే యోచనలో బోర్డు కనిపిస్తోంది. పాలకుల కమిటీ సభ్యురాలు డయాన ఎదుల్జీ, కెప్టెన్ మిథాలీ రాజ్, చీఫ్ సెలక్టర్ హేమలత కళా, రత్నాకర్ శెట్టి (కన్వీనర్)లతో కూడిన మహిళల కమిటీ త్వరలోనే భేటీ కానున్నది. ఆస్ట్రేలియాతో సిరీస్ ఓటమి, భవిష్యత్ రోడ్‌మ్యాప్‌పై ఈ భేటీలో చర్చించనున్నారు. మెరుగైన పేసర్లు, స్పిన్నర్లు, వికెట్ కీపర్లను ఎంపిక చేయాలని ఈ మేరకే సెలక్షన్ కమిటీకి ఆదేశాలున్నాయని తెలుస్తోంది. ప్రతిభావంతులైన అమ్మాయిలకు ఈ నెలాఖరులోగా బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. ఇందు కోసం ఈశాన్య రాష్ట్రాలు సహా దేశమంతా ప్రతిభాన్వేషణ కార్యక్రమం జరుగుతోందని తెలుస్తోంది.

పుణెలో ఐపీఎల్ ప్లేఆఫ్స్



ముంబయి : ఐపీఎల్ 11 ప్లే ఆఫ్ మ్యాచులు ఊహించనట్టు పుణెకే దక్కాయి. ఈ మేరకు గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నది. మే 23న ఎలిమినేటర్, మే 25న క్వాలిఫయర్ 2 మ్యాచులకు పుణె ఆతిథ్యం ఇవ్వనున్నది. క్వాలిఫయర్ 1, ఫైనల్స్ ముంబయిలో జరుగనున్న సంగతి తెలిసిందే. ఇదే విధంగా చండీగడ్ విమానాశ్రయంలో ఆధునీకరణ పనుల కారణంగా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సొంత గడ్డపై ఆడాల్సిన నాల్గు మ్యాచులను ఇండోర్‌కు మార్పు చేశారు.

ఏది తప్పు ఒప్పు?

- ఐసీసీ డీ మెరిట్ పాయింట్ల గందరగోళం


లంక కెప్టెన్‌తో బంగ్లా ఆటగాడు నురుల్ వాగ్వాదం

శ్రీనివాస్‌దాస్ మంతటి

నిరుడు కొలంబోలో శ్రీలంకతో టీమ్ ఇండియా రెండో టెస్టు. బౌలింగ్ చేస్తున్న భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా బంతిని లంక బ్యాట్స్‌మన్ మలింద పుష్పకుమార వైపు విసిరాడు. జడేజా త్రో ప్రమాదకరమే కాదు క్రీడాస్ఫూర్తి లోపించిందని ఐసీసీ అతడికి మూడు డీ మెరిట్ పాయింట్ల రూపంలో శిక్ష విధించింది. దీన్ని లెవల్ టూ నేరంగా ఐసీసీ పరిగణించింది.

సీన్ కట్ చేస్తే, 2016లో ఇంగ్లాండ్‌తో టీమ్ ఇండియా ఐదో టెస్టు. వేదిక చెన్నై. కెఎల్ రాహుల్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ బౌలింగ్ చేస్తున్నాడు. రాహుల్ స్ట్రయిట్ షాట్‌కు స్పందించిన రూట్.. ప్రమాదకర రీతిలో బంతిని రాహుల్‌పైకి విసిరాడు. కానీ ఐసీసీ ఈ ఘటనపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మ్యాచ్ రిఫరీ దీన్ని అసలు పరిగణనలోకే తీసుకోలేదు.

2016 సెప్టెంబర్ నుంచి ఐసీసీ నూతన ఆటగాళ్ల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిన తరువాత చోటుచేసుకున్న రెండు సారూప్య సంఘటనల్లో ఐసీసీ భిన్నమైన నిర్ణయాలు తీసుకున్నది. ఈ రెండింటిలో టీమ్ ఇండియా భాగస్వామి. ఒక సంఘటనలో లెవల్ 2 తప్పిదం కింద మూడు డీ పాయింట్లు పొందటంతో తర్వాతి టెస్టుకు రవీంద్ర జడేజా సేవలు కోల్పోయింది. మరో సంఘటనలో ప్రత్యర్థి స్టార్ బ్యాట్స్‌మన్ ఎటువంటి శిక్ష లేకుండా బయటపడ్డాడు.

ప్రస్తుతం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో సఫారీ పేసర్ కగిసో రబాడపై ఐసీసీ మ్యాచ్ రిఫరీ లెవల్ 2 తప్పిదం కింద మూడు డీ మెరిట్ పాయింట్లు కేటాయించటంతో అతడిపై రెండు టెస్టు మ్యాచుల వేటు పడింది. కానీ అప్పీల్‌కు వెళ్లిన దక్షిణాఫ్రికా క్రికెట్.. రిఫరీ శిక్ష నుంచి తప్పించుకున్నది. లెవల్ 1 తప్పిదం కింద ఓ డీ మెరిట్ పాయింట్‌తో రబాడను బయటకు తెచ్చుకున్నది. ఈ వ్యవహారంతో ఐసీసీ డీ మెరింట్ పాయింట్ల విధానంపై మరోసారి విస్తృత చర్చ నడుస్తోంది. అసలు ఈ విధానంలో ఎవరు నష్టపోతున్నారు? ఎవరికి న్యాయం జరుగుతుందో? తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది!.

2017 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ. బెంగళూర్‌లో ఆస్ట్రేలియాతో రెండో టెస్టు. పుణెలో నెగ్గి జోరుమీదున్న కంగారూలు ఇక్కడా ఉత్సాహంగా బరిలోకి దిగారు. పుణెలో శతకంతో విజయానికి బాటలు వేసిన ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్ చిన్నస్వామిలోనూ కుదురుకున్నాడు. కానీ అంతలోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. రివ్యూ కోరాలా? వద్దా? అనే విషయమై డ్రెస్సింగ్‌రూమ్ సంకేతాల కోసం ఎదురుచూశాడు. ఇంతలోనే భారత కెప్టెన్ కోహ్లి అంపైర్లకు ఫిర్యాదు చేయగా.. వారు స్మిత్‌ను వెనక్కి పంపించేశారు. ఈ సంఘటన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌ను వేడెక్కించింది. రెండు దేశాల క్రికెట్ బోర్డులు సైతం ఈ వివాదంలోకి దూకాయి. క్రీడా స్ఫూర్తి మరిచి, డ్రెస్సింగ్‌రూమ్ సహకారం కోరిన ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై ఐసీసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. క్రికెట్ వర్గాలను తీవ్ర విస్మయానికి గురి చేసిన సంఘటనల్లో ఇదొకటి. కానీ ఐసీసీ దీనిపై మౌనం వహించటం ఇప్పటికీ అర్థం కాని వ్యవహారమే కావటం గమనార్హం.

ఇటువంటి సంఘటనలే మరికొన్ని సైతం చోటుచేసుకున్నాయి. ఒకే విధమైన సంఘటనలు.. కానీ ఆడుతున్న దేశాలు, పాలుపంచుకున్న ఆటగాళ్లే మారుతున్నారు. విచిత్రంగా ఐసీసీ విధించే శిక్షలు సైతం మారటం క్రికెట్ లోకాన్ని విస్తుపోయేలా చేస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యర్థిని కవ్వించటంలో ముందు వరుసలో ఉండే ఆస్ట్రేలియా.. డీ మెరిట్ పాయింట్లకు దూరంగా ఉండటం ఆశ్చర్యకరమే. 2017లో ఇంగ్లాండ్‌తో ఆడిలైడ్ టెస్టులో ఇంగ్లీష్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌తో కంగారూ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తీవ్ర వాదనకు దిగాడు. ఇద్దరూ ఒకరికొకరు వేడెక్కిన మాటల యుద్ధంలో మునిగిపోయారు. అంపైర్లు అలీమ్ దార్ జోక్యం చేసుకుని పరిస్థితి సద్దుమణిగేలా చేశాడు. కానీ ఐసీసీ ఈ ఘటనలో ఇద్దరినీ వదిలేసింది. ఎవరిపైనా డీ మెరింట్ పాయింట్లు విధించలేదు. ఇటువంటే ఘటనే ఇంగ్లాండ్‌తో వెస్టిండీస్‌తో టెస్టులో చోటుచేసుకున్నది. 2017 హీడింగ్లే టెస్టులో బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో షాయ్ హోప్ బౌండరీ బాదాడు. దీంతో స్టోక్స్ తీవ్ర అసహనానికి లోనయ్యాడు. దాని ఫలితం మాటల్లో వ్యక్తమైంది. ఇంకేముంది ఐసీసీ మ్యాచ్ రిఫరీ దీన్ని నేరంగా పరిగణించాడు. స్టోక్స్‌ను లెవల్ 1 తప్పిదం ప్రకారం ఓ డీ మెరిట్ పాయింట్‌తో శిక్షించాడు. ఇటీవల బంగ్లాదేశ్ ఆటగాళ్ల ప్రవర్తన సైతం చర్చనీయం. 2016 మీర్పూర్‌లో రెండో వన్డేలో జోశ్ బట్లర్‌ను అవుట్ చేసిన అనంతరం బంగ్లా ఆటగాళ్లు అతిగా స్పందించారు. అంపైర్లు జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయింది. ఈ వ్యవహారంలో బట్లర్‌తో పాటు బంగ్లా ఆటగాళ్లకూ ఒకే ఒక్క డీ మెరిట్ పాయింట్ విధించారు. తాజాగా నిదహాస్ ముక్కోణపు టీ20 టోర్నీలో బంగ్లాదేశ్ పరిధులు దాటి ప్రవర్తించింది. బంగ్లా కెప్టెన్ షకిబ్ అల్ హసన్ ఆటగాళ్లను మైదానం విడిచి వచ్చేయమని పిలువగా.. 12వ ఆటగాడు నురుల్ హుసేన్ లంక కెప్టెన్‌తో వాగ్వాదానికి దిగాడు. కెప్టెన్ షకిబ్ ప్రవర్తన గల్లీ క్రికెట్‌లోనూ ఇప్పుడు చూడలేం, ఆటగాళ్లు మైదానం వీడి ఉంటే క్రికెట్‌పై చెరగని మచ్చ తీసుకురాగల ప్రవర్తన అతడిది. డ్రింక్స్ తీసుకెళ్లిన నురుల్.. మైదానంలో ఆటగాడితో గొడవకు దిగటం క్రికెట్ ప్రపంచం నివ్వెరపోయేలా చేసింది. కానీ ఐసీసీ ఈ రెండు ఘటనలనూ కేవలం లెవల్ 1 తప్పిదంగానే చూసింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతకు తోడు చెరో డీ మెరిట్ పాయింట్ విధించింది. క్రికెట్‌కు మచ్చ తీసుకొచ్చే ప్రవర్తన, ప్రత్యర్థి ఆటగాడిపై భౌతిక దాడి, అంపైర్ నిర్ణయానికి కట్టుబడకపోవటం , క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించటం సహా పలు అంశాలపై ఐసీసీ డీ మెరిట్ పాయింట్లు ఇస్తోంది. కానీ ఒకే విధమైన తప్పిదాలకు, భిన్నమైన రీతిలో స్పందించటం విమర్శలకు తావిస్తోంది.

ఐసీసీ డీ మెరిట్ పాయింట్ల విధానం

స్థాయి	పాయింట్లు	సస్పెన్షన్
01	1-2	---
02	3-4	ఒకటెస్టు/రెండు వన్డేలు/టీ20
03	5-6	--
04	7-8	2టెస్టులు/4 వన్డేలు/టీ20

నోట్ : తప్పిదం స్థాయి పెరిగే కొద్ది ఆటగాడి డీ మెరిట్ పాయింట్లు పెరుగుతాయి. 4 డీ మెరిట్ పాయింట్ల నుంచి సస్పెన్షన్ మొదలవుతోంది. టెస్టు, వన్డే, టీ20ల్లో ఏది ముందుగా దానిలో సస్పెన్షన్ అమలవుతుంది. ప్రతి డీ మెరిట్ పాయింట్ కాల పరిమితి 24 నెలలు. ఒక్కో పాయింట్‌తో నాల్గు సారి పొందినా (24 నెలల వ్యవధిలో).. సస్పెన్షన్‌కు గురవుతాడు.


చెన్నై టెస్టులో రాహుల్‌పైకి బంతి విసిరిన ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్



టీ20 చాంపియన్స్ ట్రోఫీకి బీసీసీఐ నో!

దుబాయ్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహించేందుకు బీసీసీఐ అనుకూలంగా లేదని ఐసీసీ వర్గాల సమాచారం. చాంపియన్స్ ట్రోఫీని మరింత లాభదాయక టోర్నీగా మార్చేందుకు 50 ఓవర్ల నుంచి 20 ఓవర్ల ఫార్మాట్‌కు మార్చాలని ఐసీసీ ప్రతిపాదనగా తెలుస్తోంది. 2021లో చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమివ్వాల్సిన బీసీసీఐ అందుకు అంగీకారం తెలపటం లేదట!. క్రికెట్ పాలకుడు జగన్మోహన్ దాల్మియా ప్రవేశపెట్టిన టోర్నీలో మార్పులకు అంగీకరించే ప్రసక్తే లేదని బోర్డు వర్గాలు అంటున్నాయి. ఇక ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపులు దక్కని పక్షంలో టోర్నీ వేదికను మార్చేందుకు వెనుకాడ బోమని ఐసీసీ స్పష్టీకరిస్తోంది. గతంలో జరిగిన ఐసీసీ టోర్నీలకే ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపు దక్కని సంగతి తెలిసిందే. ఏప్రిల్ నెలాఖరులో కోల్‌కతలో జరుగనున్న ఐసీసీ వార్షిక సమావేశంలో ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.

కోచి వన్డే గొడవ

- విండీస్‌తో వన్డే వేదిక మార్పుపై ఎంపీ శశి థరూర్ విమర్శ

న్యూఢిల్లీ : ఈ ఏడాది నవంబర్‌లో వెస్టిండీస్‌తో జరగాల్సిన వన్డే మ్యాచ్ వేదిక విషయంపై తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. కోచి నెహ్రూ స్టేడియం ప్రస్తుతం ఫుట్‌బాల్ మ్యాచులకు కేంద్రం కాగా.. ఇప్పుడు తిరువనంతపురం నుంచి వన్డే మ్యాచ్‌ను కోచికి తరలించటం వెనుక ఎవరికి లాభం? అని అంటూ ప్రశ్నించాడు. దీనిపై పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్‌కి ఫిర్యాదు చేశారు. వినోద్ రాయ్ ఈ నిర్ణయాన్ని సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. కేరళ క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని థరూర్ ఆరోపించారు. ఇక కోచిలో ఎంతో వ్యయప్రయాసలతో ఫుట్‌బాల్ టర్ఫ్ సమకూర్చితే.. ఇప్పుడు క్రికెట్ కోసం పిచ్‌ను తవ్వుతారా? అంటూ కేరళ బ్లాస్టర్స్ ఎఫీసీ సభ్యుడు కె వినీత్ ట్విట్టర్‌లో ఆవేదన వ్యకం చేశాడు.

ఆ పని షకిబ్‌దే!

కొలంబో: శ్రీలంకపై విజయానంతరం బంగ్లాదేశ్ డ్రెస్సింగ్‌రూమ్ అద్దాలు బద్దలు కొట్టినది బంగ్లా కెప్టెన్ షకిబ్ అల్ హసనే చేసినట్టు శ్రీలంక పత్రిక పేర్కొంది. తలుపులు తెరిచేందుకు బలంగా ప్రయత్నించటంతో అద్దాలు పగిలినట్టు కేటరింగ్ సిబ్బంది రిఫరీ క్రిస్ బ్రాడ్‌తో పేర్కొన్నారని సమాచారం. ఈ విషయంలో రిఫరీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బంగ్లా తరఫున సైతం అద్దాలు పగులకొట్టిన ఘటనపై ఇప్పటి వరకూ ఎటువంటి వివరణ రాలేదు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.